ఆంధ్రభూమి

సంపుటి 59 సంచిక 92 | హైదరాబాద్ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | మంగళవారం 1 జనవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940

శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం - దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం
తిథి: బహుళ ఏకాదశి రా. తె. 3.29
నక్షత్రం: స్వాతి ప.11.47
వర్జ్యం: సా. 5.23 నుండి 6.59 వరకు
దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 9.12 వరకు
తిరిగి రా.10.48 నుండి 11.36 వరకు
రాహుకాలం: మ.3.00 నుండి 4.30 వరకు
విశేషాలు: సర్వేషాం ఏకాదశి



ఏటికేడాది ఆశల ఏరువాక
సాగుచుండును జనులంత సంతసించ
గతముపై నొకయంకెను కలుపుకొనుచు
రెండువేల పందొమ్మిది రానెవచ్చె!

పాఠకులు, చందాదారులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు.
- చీఫ్ ఎడిటర్



కాఠిన్యం కరిగిపోయింది!

గుక్కపెట్టిన అనాథ పాప..
పాలుపట్టిన పోలీసమ్మ 6



లాభసాటి వ్యవసాయంపై ఉన్నతాధికారులతో జరిపిన సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు

ఇక పంటల కాలనీలు

- లాభసాటి పంటలపై అవగాహన కల్పించాలి
- రైతు సంక్షేమంలో మనమే ముందుండాలి
- సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు
- ఉన్నతాధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం

ఆంధ్రభూమి బ్యూరో


హైదరాబాద్, డిసెంబర్ 31: రాష్ట్రాన్ని ఖచ్చితంగా పంటల కాలనీలుగా విభజించాలని, రైతులు పండించే ప్రతి పంటకూ డిమాండ్ లభించేలా చూడాలని, రాష్ట్రంలో నెలకొల్పనున్న ఆహార శుద్ధి పరిశ్రమల (ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల) ద్వారా ప్రభుత్వ పరంగా నమ్మకమైన, కల్తీరహిత బ్రాండెడ్ ఉత్పత్తులు జరగాలని ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. రైతులు నియంత్రణా విధానంలోనే పంటలు పండించాలని ఆయన అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆహార శుద్ధి పరిశ్రమల తీరుతెన్నులపై, భవిష్యత్తులో అవలంబించాల్సిన విధానాలపై, మహిళా సంఘాలను ఈ పరిశ్రమల్లో భాగస్వాములను చేయడంపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు రాజీవ్ శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎంవో అధికారుల నర్సింగ్ రావు, భూపాల్‌రెడ్డి, స్మితాసబర్వాల్, డీజీపీ వీ.మహేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు అనురాగ్ శర్మ, మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, ఎమ్మెల్సీలు రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, ఆనంద్, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారధి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యానవన శాఖలపై కోట్లాది మంది ఆధారపడి ఉన్నారని చెప్పారు. వారి ఆశయాలకు అనుగుణంగా ఆ శాఖలు పనిచేయాలని, దేశం మొత్తంలోనే ఉత్తమమైన వ్యవసాయ, ఉద్యానవన, ఆహార శుద్ధి, ఎగుమతులలో తెలంగాణ రాష్ట్రం అగ్రభాగాన ఉండాలని అన్నారు. రైతులను ఆదుకునే విషయంలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ఆహార, వ్యవసాయ రంగానికి సంబంధించి సరైన గణాంకాలు లేనందున సమస్యలు వస్తున్నాయని, వీటిని అధిగమించాల్సిన - మిగతా 6వ పేజీలో



తగ్గిన ఎల్‌పీజీ ధరలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: గృహ వినియోగ వంట గ్యాస్ (ఎల్‌పీజీ) ధరలు సోమవారం తగ్గుముఖం పట్టాయి. సబ్సిడీ సిలిండర్ మీద 5.91 రూపాయలు తగ్గిస్తున్నట్లు చమురు సంస్థలు ప్రకటించాయి. మార్కెట్లో ఇంధన ధరలు తగ్గిన క్రమంలో వరుసగా నెల రోజుల వ్యవధిలో ఈ గ్యాస్ ధర తగ్గడం ఇది రెండోసారి. కాగా తగ్గిన ధరలతో దేశ రాజధానిలో ఆదివారం అర్ధరాత్రి నుంచి 14.2 కిలోల బరువుండే సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్ ధర 494.99 రూపాయలకు చేరింది. ఇప్పటి వరకు ఈ ధర 500.90 రూపాయలుగా ఉండేదని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) తెలిపింది. ఈనెల 1న సబ్సిడీ వంట గ్యాస్ ధర సిలిండర్‌పై 6.52 తగ్గిన సంగతి తెలిసిందే. అంతకు ముందు జూన్ నుంచి వరుసగా ఆరు నెలల పాటు సాగిన ధరల పెరుగుదల అనంతరం ఇలా ధరలు తగ్గుముఖం పట్టడం పట్ల వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక నాన్ సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌పై సైతం 120.50 రూపాయలు తగ్గిస్తున్నట్టు ఐఓసీ తెలిపింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గడం, అమెరికన్ డాలర్‌తో రూపాయి విలువ బలపడడం వంటివి - మిగతా 6వ పేజీలో

వీడిన బంధం



ఉమ్మడి హైకోర్టు అధ్యాయానికి తెర



- ఏపీకి తరలిన న్యాయమూర్తులు, న్యాయవాదులు
- సుప్రీంలో పిటిషన్, తక్షణ విచారణకు నో
- ఏపీ న్యాయవాదులపై తెలంగాణ కేవియట్
- నేటి నుండి రెండు హైకోర్టుల్లో కార్యకలాపాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: ఉమ్మడి హైకోర్టు అధ్యాయం సోమవారం సాయంత్రంతో ముగిసింది. మంగళవారం నుండి తెలంగాణ హైకోర్టు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వేర్వేరుగా పనిచేయనున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ న్యాయవాదులు, సిబ్బందికి తెలంగాణ న్యాయవాదులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. మంగళవారం నుండి అమరావతిలో ఏపీ హైకోర్టు పనిచేయనుంది. ఇందుకోసం హైదరాబాద్ నుండి అమరావతికి 900 మంది ఉద్యోగులు తరలివెళ్లారు. వీరికోసం టీఎస్ ఆర్టీసీ ప్రత్యేకించి గరుడ వాహనాలను ఏర్పాటు చేసింది. అమరావతి పరిధిలో నిర్మిస్తున్న హైకోర్టు భవనం పూర్తయ్యే వరకూ హైదరాబాద్ నుండి హైకోర్టు తరలింపు నిర్ణయాన్ని వాయిదా వేయాలన్న ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టలేమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగొయ్ బెంచ్ తిరస్కరించింది. హైకోర్టు భవనాలు, న్యాయమూర్తుల నివాస సముదాయాలు, - మిగతా 6వ పేజీలో



ఏపీ న్యాయమూర్తులు, న్యాయవాదులకు వీడ్కోలు పలుకుతున్న తెలంగాణ న్యాయమూర్తులు, న్యాయవాదులు

హడలెత్తిస్తున్న చలి

రికార్డుస్థాయిలో 2.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు • శీతల గాలులతో స్తంభించిన జనజీవనం

ఆంధ్రభూమి బ్యూరో

ఆదిలాబాద్, డిసెంబర్ 31: ఆదిలాబాద్ జిల్లాలో చలిగాలుల తాకిడికి తోడు అత్యల్ప ఉష్ణోగ్రతలు బెంబేలెత్తిస్తున్నాయి. గత నాలుగు రోజులుగా వరసగా రికార్డుస్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో చంటి పిల్లల నుండి వృద్ధుల వరకు దైన్య పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తోంది. నిన్నటి వరకు ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లిటి సరిహద్దు గ్రామంలో 3.0 డిగ్రీలు నమోదుకాగా సోమవారం పగటి ఉష్ణోగ్రతలు మరింత పడిపోయి 2.7 డిగ్రీల సెల్సియస్ నమోదు కావడం చలి తీవ్రతకు అద్దంపడుతోంది. హిమపాతంలా మంచు గడ్డకట్టే విధంగా చలి పంజా విసరడంతో ఒళ్ళంతా బిగుసుకుపోయి బయటకు వెళ్లేందుకు సైతం జనం జంకాల్సిన పరిస్థితి నెలకొంది. తాంసి, భీంపూర్, బేల, జైనథ్ మండలాల్లో 3.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదుకాగా ఆదిలాబాద్‌లో 3.4 డిగ్రీల సెల్సియస్ రికార్డయింది. చలి తాకిడికి ప్రజలు గజ గజ వణికిపోతుండగా జిల్లావ్యాప్తంగా జనజీవనం స్తంభించిపోతోంది. పెళ్ళిళ్లు, ఇతర శుభకార్యాలకు ప్రజలు వెళ్లేందుకు వెనకడుగువేయాల్సి వస్తోంది. దీంతో సాదాసీదాగానే జనసందోహం లేకుండా శుభకార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. మరోవైపు ఉట్నూరు, ఆసిఫాబాద్, బోథ్ ప్రాంతాల్లో తీక్షణమైన చలి గాలులకు ప్రజలు అల్లాడిపోతుంటే శ్వాస సంబంధ వ్యాధులు పట్టిపీడిస్తూనే ఉన్నాయి. ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చలి తీవ్రతతో అస్వస్థతకు గురైన వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. వేసవి కాలంలో 48 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలతో జిల్లా రికార్డుల్లోకి ఎక్కుతుంటే చలికాలంలో ఇందుకు భిన్నంగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం, రాత్రి వేళల్లో మంచు దుప్పటి కమ్మేయడంతో పొగమంచుకు వాహనదారులు బయటకు వెళ్లలేకపోతున్నారు. ఆదిలాబాద్ పట్టణంలో జనసంచారం లేక సాయంత్రం 6 గంటల నుండే ప్రధాన మార్కెట్ వీధులన్నీ నిర్మానుష్యంగా తలపిస్తూ రోడ్లన్ని బోసిపోయాయి. మరో వారం రోజుల పాటు చలితీవ్రత ఇదే విధంగా ఉంటుందని, ఉత్తరాది నుండి వీస్తున్న శీతల పవనాలతోనే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.




సాయంత్రం 6 గంటలకే నిర్మానుష్యంగా మారిన ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వీధి

సీఎం కేసీఆర్, పీసీసీ చీఫ్ ఉత్తమ్ శుభాకాంక్షలు



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖశాంతులతో జీవించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలో సంక్షేమ కార్యక్రమాలు మరింత ముందుకు పోవాలని ఆకాంక్షిస్తున్నానని ఆయన తెలిపారు. టీ.పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



‘పంచాయతీ’కి విస్తృత ఏర్పాట్లు

రిజర్వేషన్లపై నివేదిక రాగానే నోటిఫికేషన్ • ఆంధ్రభూమి ఇంటర్వ్యూలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి అశోక్‌కుమార్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఈసీ) కార్యదర్శి ఎం. అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన ఆంధ్రభూమి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్నికల ఏర్పాట్ల గురించి వివరించారు. ప్రభుత్వం నుంచి రిజర్వేషన్ల నివేదిక కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు. మొత్తం 12751 గ్రామ పంచాయతీ సర్పంచ్, 1.27 లక్షల వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రిజర్వేషన్ల వివరాలను ప్రభుత్వం తమకు అందించిన మూడు నాలుగు రోజుల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్ ఇస్తామన్నారు. జిల్లా విస్తీర్ణం, గ్రామ పంచాయతీల సంఖ్యను అనుసరించి ఎన్నికలు ఒకటి లేదా రెండు లేదా మూడు విడతల్లో జరుగుతాయన్నారు. కొద్ది గ్రామ పంచాయతీలు ఉన్న మేడ్చల్ లాంటి జిల్లాల్లో ఒకే ఒక విడతలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఏ ఏ జిల్లాలో ఎన్ని విడతల పోలింగ్ నిర్వహించాలో నోటిఫికేషన్‌లో వివరిస్తామన్నారు. ప్రతి వార్డుకు ఒక పోలింగ్ కేంద్రం ఉంటుందని, సర్పంచ్ పదవికి, వార్డు సభ్యుడి పదవికి వేర్వేరుగా బ్యాలెట్‌ద్వారా ఓట్లు వేసి ఒకే బ్యాలెట్ బాక్సులో వాటిని వేయాల్సి ఉంటుందన్నారు. బ్యాలెట్ పేపర్‌పై పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ఉండవని అందువల్ల ఇప్పటికే సీరియల్ నెంబర్, అభ్యర్థికి కేటాయించే గుర్తులను పేర్కొంటూ బ్యాలెట్ పేపర్లను ముద్రించామన్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత కొద్దిసమయంలో బ్యాలెట్ పేపర్లను ముద్రించడం సాధ్యం కాదని, అందువల్లనే ముందుగానే బ్యాలెట్ పేపర్లను ముద్రించామన్నారు. పోటీ చేసే అభ్యర్థుల సంఖ్యను అనుసరించి వీటిని ఏయే పంచాయతీలకు, ఏ ఏ వార్డులకు వాడాలో నిర్ణయిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 65 వేల బ్యాలెట్ బాక్సులను ఉపయోగిస్తున్నామని అశోక్ కుమార్ తెలిపారు. ఇప్పటికే అవసరమైన బ్యాలెట్ బాక్సులను సేకరించి భద్రపరిచామన్నారు. పెద్ద ఎత్తున వార్డులు, గ్రామ పంచాయతీలు ఉండటం వల్ల ఈవీఎంలను వాడటం సాధ్యం కాదని, అందుకే బ్యాలెట్ పేపర్ల విధానాన్నే ఉపయోగిస్తున్నామని చెప్పారు. ఎన్ని పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలో జిల్లాస్థాయిలో జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లే నిర్ణయిస్తారని ఎస్‌ఈసీ కార్యదర్శి తెలిపారు. ఆ యా గ్రామాల్లో శాంతి, భద్రతల పరిస్థితిని బట్టి బందోబస్తు ఏర్పాట్లు కలెక్టర్లు, ఎస్పీలు చేస్తారన్నారు. 200 మంది ఓటర్లకు ఇద్దరు పోలింగ్ సిబ్బంది ఉంటారని, 400 మంది ఓటర్లు ఉన్నచోట ముగ్గురు, అంతకు మించి ఓటర్లు ఉన్నచోట నలుగురు పోలింగ్ సిబ్బంది పనిచేస్తారన్నారు. ప్రతి జిల్లాకు 15 మంది రిసోర్స్‌పర్సన్లకు తాము శిక్షణ ఇచ్చామని, వీరు జిల్లాల్లో అవసరమైన శిక్షణ ఇచ్చారన్నారు. గ్రామాల్లో పనిచేసే పోలింగ్ సిబ్బందికి మండలాల్లో శిక్షణా తరగతులు సాగుతున్నాయన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి 2019 జనవరి 3 వరకు శిక్షణ పూర్తవుతుందని, పోలింగ్‌కు ముందు మళ్లీ అత్యవసరమైన అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఇప్పటికే సమావేశాలు ఏర్పాటు చేశామని, మళ్లీ వారితో సమావేశాలు ఉండబోవన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసే సమయానికి కేంద ఎన్నికల కమిషన్ వద్ద ఉండే తాజా ఓటర్ల జాబితానే తాము ఉపయోగిస్తామన్నారు. పోలింగ్‌కోసం ఇప్పటికే అవసరమైన భవనాలను ఎంపిక చేశామన్నారు. పోలింగ్ ప్రశాంతంగా, నిస్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎస్‌ఈసీ తరపున అన్ని ఏర్పాట్లు చేశామని అశోక్ కుమార్ తెలిపారు.



ఎస్ఈసీ అశోక్ కుమార్

ఎన్నికల నిర్వహణకు రూ.50 కోట్లు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతగా 50 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఈ ఎన్నికలకోసం మొత్తం 120 కోట్ల రూపాయలను ప్రభుత్వం 2018-19 వార్షిక బడ్జెట్‌లో పొందుపరిచింది. ఇప్పటి వరకు 37 కోట్ల రూపాయలు విడుదలయ్యాయి. రెండో విడతలో తాజాగా 50 కోట్ల రూపాయలు విడుదల అయ్యాయి. ఇవి కాకుండా మరో 33 కోట్ల రూపాయలు విడుదల చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం విడుదల చేసిన 50 కోట్ల రూపాయలను డ్రా చేసి, జిల్లాలకు పంపించాలని ప్రభుత్వం పంచాయతీ రాజ్ కమిషనర్‌ను అదేశించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ పేరుతో సోమవారం జీఓ జారీ అయింది.

నదుల పునరుజ్జీవంపై ప్రణాళిక

15 లోగా రూపొందించాలని సీఎస్ ఆదేశాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: రాష్ట్రంలో నదుల పునరుజ్జీవంపై నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ముసాయిదా ప్రణాళికను 2019 జనవరి 15 లోగా తయారు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఆదేశించారు. సచివాలయంలో సోమవారం జరిగిన నదుల పునరుజ్జీవ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలోని వివిధ నదులకు సంబంధించి నీటి వాడకంపై నివేదిక రూపొందించాలన్నారు. ఇరిగేషన్, గ్రౌండ్‌వాటర్, మెట్రోవాటర్‌వర్క్స్, మున్సిపల్ వ్యవహారాలు, పరిశ్రమలు తదితర శాఖలు జనవరి 5 లోగా తమ డాటాను నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (నీరి) కు అందచేయాలని సూచించారు. నదుల జలాల కాలుష్యం తగ్గించేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. నీరి ఇచ్చే ముసాయిదా నివేదికపై జనవరి మూడోవారంలో మరోసారి కమిటీ సమావేశం నిర్వహిస్తామని ఎస్‌కే జోషి తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలకు నేడు సెలవు

ఫిబ్రవరి 9న రెండో శనివారం పని రోజు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు 2019 జనవరి 1 న సెలవుగా ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులు కొత్త సంవత్సరంరోజు సంబురాలు జరుపుకునేందుకు వీలుగా సెలవు ఇస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. జనవరి 1 న సెలవుగా ప్రకటించినప్పటికీ, ఈరోజు సాధారణ సెలవు కాకపోవడంతో, ఫిబ్రవరి 9 న రెండో శనివారం పనిచేయాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఏఐసీసీ అధికార ప్రతినిధిగా శ్రవణ్



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి (టీపీసీసీ) ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ దాసోజు శ్రవణ్ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధికార ప్రతినిధిగా నియామకమయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ కమ్యూనికేషన్ ఇంచార్జీ రణదీప్ సింగ్ సూర్జేవాలా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 10 మందిని ఏఐసీసీ అధికార ప్రతినిధులుగా నియమించగా అందులో శ్రవణ్ ఒకరు. తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీకి జాతీయ స్థాయిలో అధికార ప్రతినిధిగా తనను నియమించడం పట్ల శ్రవణ్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి, రణదీప్ సూర్జేవాలాకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో దాసోజు శ్రవణ్ ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన విషయం తెలిసిందే.

రెండేళ్ల వరకూ రేవంత్‌రెడ్డి మౌనం

మీడియాతో మాట్లాడనని ప్రకటన

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: రెండేళ్ల వరకు మీడియాతో మాట్లాడనని తెలంగాణ కాంగ్రెస్ కమిటి వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఓడిపోయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మీడియాతో మాట్లాడకుండా రేవంత్‌రెడ్డి మౌనం పాటించారు. కాంగ్రెస్ పార్టీ ఓటమికిగల కారణాలను విశ్లేషించుకోవడానికి సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ముఖ్య నేతల సమావేశానికి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడేందుకు రేవంత్‌రెడ్డి నిరాకరించారు. రెండు సంవత్సరాల వరకు మాట్లాడనని ఆయన ప్రకటించారు.



ఈవీఎంల ట్యాంపరింగ్‌పై న్యాయ పోరాటం

సీఈసీ, రాష్ట్రపతికి ఫిర్యాదు ★ కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశంలో నిర్ణయం • అధికార దుర్వినియోగం, ధన రాజకీయాలపైనా విస్తృత చర్చ
కాంగ్రెస్ ఓటమికి కారణాలపై విశ్లేషణ ★ హాజరైన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: ఈవీఎంల ట్యాంపరింగ్‌పై న్యాయ పోరాటం చేయడంతో పాటు రాష్ట్రపతికి ఫిర్యాదు చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) నిర్ణయించింది. శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి విజయానికి ఈవీఎంల ట్యాంపరింగ్, అధికార దుర్వినియోగం, డబ్బు కారణమని టీపీసీసీ నిర్దారణకు వచ్చింది. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికిగల కారణాలపై సోమవారం హైదరాబాద్‌కు వచ్చిన పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సి కుంతియా పార్టీ నేతలతో గోల్కొండ హోటల్లో సుదీర్ఘంగా చర్చించారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్స్ రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కుసుమకుమార్, పార్టీ సీనియర్ నేతలు కె జానారెడ్డి, షబ్బీర్ అలీ, సునీతా లక్ష్మారెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, దాసోజు శ్రవణ్ తదితర ముఖ్యనేతలు ఓటమికిగల కారణాలను పార్టీకి నివేదించారు. అలాగే రాబోయే పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ వ్యూహంపై టీపీసీసీకి కుంతియా దిశా నిర్దేశం చేశారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌తో పాటు భారీగా ఓట్ల గల్లంతు, సాయంత్రం 4 గంటల తర్వాత భారీగా పెరిగిన పోలింగ్ శాతం, ఒకటి, రెండు శాతం ఓట్ల తేడాతో పార్టీ అభ్యర్థులు ఓడిన చోట వీవీ పాట్ స్లిప్‌లు లెక్కించాలని డిమాండ్ చేసినా ఎన్నికల అధికారులు పట్టించుకోకపోవడం, పోలింగ్‌కు, కౌంటింగ్ మధ్య ఓట్లలో తేడాలు, పోలీసు అధికారుల సహకారం వంటి అధికార దుర్వినియోగ చర్యలకు తెరాస వడిగట్టిందని నేతలు విశ్లేషించారు. భారీ సంఖ్యలో 22 లక్షల ఓట్లు గల్లంతైనట్టు రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి రజత్‌కుమార్ స్వయంగా అంగీకరిస్తూ క్షమాపణ కోరడాన్ని నేతలు గుర్తు చేశారు. ఈవీఎంల ట్యాంపరింగ్, వీవీ పాట్ స్లిప్‌ల మాయం వంటి అంశాలపై న్యాయపోరాటం చేస్తూనే, మరోవైపు ప్రధాన ఎన్నికల కమిషనర్, రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు చేయాలని సమావేశం నిర్ణయించింది. పార్టీ నుంచి గెలిచిన కొందరు ఎమ్మెల్యేలు టీఆర్‌ఎస్‌లో చేరబోతున్నారన్న సమాచారంపై కూడా చర్చ జరిగినట్టు తెలిసింది. గెలిచిన తర్వాత టీపీసీసీతో టచ్‌లో లేని ఎమ్మెల్యేలతో సీనియర్ నేతలు చర్చించి పార్టీ వీడకుండా చూడాలని రాష్ట్ర ఇంచార్జీ కుంతియా సూచించినట్టు తెలిసింది. గెలిచిన ఎమ్మెల్యేలతో టీపీసీసీ మొదట ఒక సమావేశాన్ని నిర్వహించి వారి మనోగతాన్ని తీసుకున్నాకే సీఎల్‌పీ నాయకుని ఎన్నికకు సమావేశం నిర్వహించాలని కుంతియా సూచించినట్టు తెలిసింది.

ఓటమికి పార్టీ శ్రేణులు కుంగిపోకుండా విస్తృత సమావేశాలు ఏర్పాటు చేసి ఉత్తేజ పర్చాలని సూచించారు. వచ్చే పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించే విధంగా పార్టీ శ్రేణులను సమాయాత్తం చేయాలని కుంతియా సూచించారు.



విలేఖరులతో మాట్లాడుతున్న కుంతియా, ఉత్తమ్

దేశం పట్ల బాధ్యత లేని కాంగ్రెస్

పంచభూతాల్లో అవినీతికి పాల్పడ్డారు ★ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ దేశం పట్ల బాధ్యత ఫీల్ కాలేదని , పంచభూతాల్లో ఆ పార్టీ అవినీతికి పాల్పడిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటే కరప్షన్, కమిషన్, కలెక్షన్ అనేపేరు గడించిందని, సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్, రాహుల్‌గాంధీ నేతృత్వంలో కుంభకోణాల మయమైందని విమర్శించారు. సోమవారం సాయంత్రం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ నీరు, నిప్పు, గాలి, నేల, పాతాళం దేనినీ వదలకుండా పంచభూతాలలో కుంభకోణాలు చేశారని విమర్శించారు.


కాంగ్రెస్ పార్టీకి దేశ రక్షణ, ప్రజల రక్షణ పట్ల ఏ మాత్రం బాధ్యత లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి దేశం ఏమైనా, ప్రజలు ఏమైనా పర్వాలేదని, వాళ్ల డిఎన్ఏలోనే దోపిడీ ఉందని, ఇటీవల అగస్టా వెస్ట్ ల్యాండ్ స్కామ్ నిందితుడ్ని భారత ప్రభుత్వం దేశానికి తీసుకువచ్చిందని, ఆయన వచ్చిన నాటి నుండి కాంగ్రెస్ పార్టీ, సోనియా, రాహుల్ ఇతర నేతలు బెంబేలెత్తిపోతున్నారని వణికిపోతున్నారని విమర్శించారు. దొంగ దొంగ అని దొంగే అరచినట్టు రాహుల్‌గాంధీ ప్రవర్తిస్తున్నారని, వాళ్ల దోపిడీ బయటపడుతోందని అన్నారు. వాళ్లు ఊచలు లెక్కించే రోజు దగ్గర్లోనే ఉందని, అగస్టా వెస్ట్‌లాండ్ వీవీఐపీ హెలికాప్టర్లు కొనుగోలులో అక్రమాలు చోటు చేసుకున్నాయని మొదట ఇటలీ కోర్టు తెలిపిందని, ఇటలీలోని ఆ ప్రభుత్వం ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి కొంత మందిని అరెస్టు చేసిందని అన్నారు. ఇటలీ కోర్టులో పలుమార్లు సోనియాగాంధీ పేరు ప్రస్తావనకు వచ్చిందని, అగస్టా వెస్ట్ లాండ్ కుంభకోణం నిందితుడు క్రిస్టియన్ మిషల్ కూడా మిసెస్ గాంధీ పేరు ప్రస్తావించారని డిసెంబర్ 29న ఈడీ, పాటియాలా కోర్టుకు తెలిపిందని అన్నారు. గత 30-32 సంవత్సరాలుగా దేశంలో జరిగిన కుంభకోణాల్లో అండర్సన్‌ను గానీ, ఖత్రోచీని గానీ, ఇపుడు క్రిస్టియన్ మిషల్‌ను గానీ తీసుకుంటే వారందరికీ గాంధీ కుటుంబంతో ఏదో ఒక రూపంలో సంబంధం ఉందని అన్నానరు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ దీనికి సమాధానం చెప్పాలని లక్ష్మణ్ నిలదీశారు. ఈ కుంభకోణం నుండి సోనియా, రాహుల్ కుటుంబం తప్పించుకోలేదని, దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దోపిడీని నిశితంగా గమనిస్తున్నారని అన్నారు. మోదీ నేతృత్వంలోని దోపిడీ దారులకు శిక్ష తప్పదని వ్యాఖ్యానించారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి, ప్రధానకార్యదర్శి చింతా సాంబమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ఎస్ కుమార్, అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ ప్రకాష్‌రెడ్డి, మీడియా కమిటీ కన్వీనర్ సుధాకర్ శర్మ, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్, బాక్రీ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో
సత్తా చాటుతాం

బీసీల రిజర్వేషన్ల కుదింపుపైనా పోరాటం ★ కాంగ్రెస్ నేతలు కుంతియా, ఉత్తమ్

ఆంధ్రభూమి బ్యూరో


హైదరాబాద్, డిసెంబర్ 31: రాబోయే పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చూపుతామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియా తెలిపారు. శాసనసభ ఎన్నికల్లో పార్టీ ఓడిపోయినంత మాత్రాన కాంగ్రెస్ పని అయిపోయిందని అనుకుంటే పొరపాటేనని ఆయన అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ ఓటమికిగల కారణాలపై విశ్లేషణ, పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలకు పార్టీని సమాయత్త పర్చడానికి సోమవారం హైదరాబాద్‌కు వచ్చిన కుంతియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు, వచ్చే పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలకు పార్టీని సమాయత్తం పరిచే అంశంపై చర్చించినట్టు కుంతియా తెలిపారు. శాసనసభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీ అక్రమాలు చేసి గెలిచిందన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగినట్టు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో సాయంత్రం 4 తర్వాత భారీగా పోలింగ్ జరగడం వెనుకనున్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పోలింగ్ జరిగిన ఓట్లకు, కౌంటింగ్‌లో లెక్కించిన ఓట్లకు మధ్య తేడాలున్నాయన్నారు. ఎన్నికల్లో జరిగిన అధికార దుర్వినియోగంపై ప్రధాన ఎన్నికల కమీషనర్‌కు, రాష్ట్రపతికి ఫిర్యాదు చేయనున్నట్టు కుంతియా తెలిపారు. ఎన్నికలు జరిగి ఇరవై రోజులు గడిచినా ఇప్పటికీ ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించకపోవడం దారుణమని విమర్శించారు. ప్రధాని మోదీకి మేలు చూకూర్చడానికే సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ పేరిట పర్యటనలు జరపుతున్నారని ఆరోపించారు. తనపై సీబీఐతో కేసులు పెట్టిస్తారోమోనన్న భయంతోనే మోదీకి కేసీఆర్ బీ-టీమ్‌గా మారారని కుంతియా ఆరోపించారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన సత్తా చూపిస్తుందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ధర్మపురి, ఇబ్రహీంపట్నం, కోదాడ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారన్నారు. ఓడిపోయిన అభ్యర్థులు డిమాండ్ చేసినా వీవీ పాట్ స్లిప్‌లను లెక్కించలేదని విమర్శించారు. తక్కువ మార్జిన్‌తో ఓడిపోయిన స్థానాలపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించామన్నారు. నియోజకవర్గాలకు ఎమ్మెల్యేలు ఇన్‌చార్జిలుగా ఉంటారన్నారు.







హైకోర్టు వద్ద ఆంధ్ర న్యాయవాదులకు వీడ్కోలు పలుకుతున్న తెలంగాణ న్యాయవాదులు, ఆంధ్రప్రదేశ్‌కు తీసుకెళ్లాల్సిన ఫైళ్లను కట్టలు కట్టిన దృశ్యం.. బస్సెక్కి వెళుతున్న ఏపీ న్యాయవాదులు


యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణ స్థలానికి చేరుతున్న నిర్మాణ సామాగ్రీ
థర్మల్ ప్లాంట్ తొలి రెండు యూనిట్ల బాయిలర్ల నిర్మాణ స్థలం

ఏప్రిల్ నెలాఖరుకు మేడిగడ్డ బ్యారేజి పూర్తి

మేడిగడ్డ, కన్నెపల్లి, అన్నారం బ్యారేజీలను సందర్శించిన రిటైర్డ్ ఇంజనీర్ల బృందం

మహదేవ్‌పూర్, డిసెంబర్ 31: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టులను రాష్ట్ర రిటైర్డ్ ఇంజనీర్‌ల బృందం సోమవారం భూపాలపల్లి జిల్లా పరిధిలోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజ్‌లతో పాటు కన్నెపల్లి పంప్‌హౌస్‌లను సందర్శించారు. జనవరి 1న రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించనున్న నేపథ్యంలో ఒకరోజు ముందస్తుగానే ఆయన ఆదేశాల మేరకు ఆయా బ్యారేజ్‌లను సందర్శించి వాటిపై పూర్తి నివేదిక ఇవ్వనున్నారని రిటైర్డ్ ఇంజనీర్‌ల చీఫ్ కె. శ్యాం ప్రసాదరావు తెలిపారు. ఆయన నేతృత్వంలో ఆరుగురు సభ్యులు గల బృందం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని మేడిగడ్డకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఇక్కడకు చేరుకున్నారు. మేడిగడ్డకు విచ్చేసిన రిటైర్డ్ ఇంజనీర్ల బృందానికి బ్యారేజ్ నిర్మాణ సంస్థ ప్రతినిధి రాజు వారికి ఘనస్వాగతం పలికారు. మేడిగడ్డ బ్యారేజ్ పనులతో పాటు సాంకేతిక పరమైన వాటిపై అక్కడి సైట్ ఇంజనీర్లు వారికి వివరించారు. అనంతరం కన్నెపల్లి పంప్‌హౌస్‌కు చేరుకొని అక్కడి పంప్‌హౌజ్ పనులను పూర్తిస్థాయిలో పరిశీలించారు.

అనంతరం రిటైర్డ్ ఇంజనీర్ చీఫ్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు మొదట మేడిగడ్డ నుండే మొదలవుతుందని, దీనికి ప్రధానంగా కన్నెపల్లి పంప్‌హౌస్ గుండెకాయ లాంటిదని ఆయన వివరించారు. మేడిగడ్డ బ్యారేజిలో నాల్గవ ప్లాంట్‌లో కొంత పనులు నీటి ప్రవాహం వలన ఆలస్యంగా నడుస్తుందని, దానిని రైట్ సైడ్ ద్వారా నీళ్ల మళ్లించి పనులు వేగవంతం చేస్తామని సైట్ ఇంజనీర్లు వారికి వివరించారు. జనవరి చివరి కల్లా కాంక్రీట్ పనులు పూర్తి చేసి బ్యారేజి గేట్‌లు పూర్తి స్థాయిలో బిగించడం జరుగుతుందని వారు తెలిపారు. ఏప్రిల్ చివరికి మేడిగడ్డ బ్యారేజి పూర్తవుతుందని, అలాగే పంప్‌హౌస్ పనులు వేగంగా నడుస్తున్నాయని, ఇదివరకే రెండు పంప్‌లు పూర్తి కాగా మరొక 11పంపుల పని చివరి దశలో ఉండగా ఆరు పంపుల పనులు నిరంతరం జరుగుతున్నాయని అక్కడి ఇంజనీర్‌లు వారికి తెలిపారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుండి అన్నారం బ్యారేజి వరకు రోజు రెండు టీ ఎంసిల నీళ్లు తరలించడానికి కన్నెపల్లి పంప్‌హౌజ్ చాలా కీలకమైందని వారు తెలిపారు. మార్చికల్లా పంప్‌హౌజ్ పూర్తి స్థాయిలో రన్ అవుతుందని వారు తెలిపారు.

ఈ సందర్భంగా కేసీ ఆర్ ఇక్కడకు రానున్న నేపథ్యంలో ముందస్తుగా వీటిపై పూర్తి సమాచారం ఇవ్వనున్నట్లు రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ శ్యాం ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట కాళేశ్వరం ప్రాజెక్టు సీ ఈ నల్లా వెంకటేశ్వర్లు, ఆయా బ్యారేజజీల కంపెనీ ప్రతినిధులు ఉన్నారు. రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ రాక సందర్భంగా కాటారం డీఎస్పీ కెఆర్‌కె ప్రసాద్ నేతృత్వంలో మహదేవ్‌పూర్ సీఐ రంజిత్ కుమార్, ఎస్సైలు శ్రీనివాస్, సత్యనారాయణ, తిరుపతిలు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.


బ్యారేజి నిర్మాణ పనులను మ్యాప్ ద్వారా ఇంజనీర్లకు వివరిస్తున్న సీఈ వెంకటేశ్వర్లు

వడివడిగా.. వెలుగుదివ్వె

పరుగులు తీస్తున్న యాదాద్రి థర్మల్ ప్లాంట్ పనులు ❖ బాయిలర్ల నిర్మాణాల పనులు షురూ

ఆంధ్రభూమి బ్యూరో

నల్లగొండ, డిసెంబర్ 31: రాష్ట్రంలో మరోసారి సీఎం కేసీఆర్ సారధ్యంలోని ప్రభుత్వం అధికారంలోకి రావడంతో యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది. 4వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్ధ్యంతో నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద 29వేలకోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న యాదాద్రి ఆల్ట్రామెగా థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి సీఎం కేసీఆర్ 2015జూన్ 8వ తేదీన శంకుస్థాపన చేశారు. కేంద్ర పర్యావరణ, అటవీ అనుమతులతో పాటు ఇతర సాంకేతిక అనుమతులన్ని సాధించడం, భూసేకరణ పూర్తి చేసి రూ. 484కోట్ల పరిహారం సైతం చెల్లించి, ప్లాంట్ నిర్మాణ పనులు గత ఏడాది ప్రారంభించారు. జెన్‌కో ఆధ్వర్యంలో బీహెచ్‌ఈఎల్ సంస్థ పర్యవేక్షణలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో ఐదు యూనిట్లతో 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన చేయనున్నారు. అయితే తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణం రద్దు లేదా కుదింపు చేస్తామంటూ ఆ పార్టీ నాయకులు ప్రకటించడంతో ఈ ప్లాంట్ నిర్మాణ పనులపై నీలి నీడలు కమ్మాయి. ఎన్నికల్లో స్థానిక మిర్యాలగూడ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ఘన విజయం సాధించి తిరిగి సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్లాంట్ నిర్మాణ పనుల్లో ముందడుగు పడింది.

2019చివరికల్లా ఈ ప్లాంట్‌లో తొలి రెండు యూనిట్ల ద్వారా 1600యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించాలన్న లక్ష్యంతో నిర్మాణ పనుల్లో వేగం పెంచారు. తాజాగా అందుకు అవసరమైన బాయిలర్ల నిర్మాణానికి స్థలాన్ని మార్కింగ్ చేసి పనులు చేపట్టారు. ప్లాంట్ నిర్మాణ పనులకు కావాల్సిన యంత్ర సామాగ్రిని బీహెచ్‌ఈఎల్ సంస్థ దిగుమతి చేసుకుంటుంది. ఇంకోవైపు విద్యుత్ ఉత్పాదనకు కావాల్సిన నీటి కోసం, వినియోగించిన నీటిని రీస్లైకింగ్ చేసేందుకు 100ఎకరాల్లో రిజర్వాయర్‌ల నిర్మాణ పనులు సైతం కొనసాగిస్తున్నారు. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను 4వేల ఎకరాల స్థలంలో నిర్మించనుండగా, 1200ఎకరాల్లో గ్రీన్‌పార్క్ నిర్మించనున్నారు. ప్లాంట్ నడిచేందుకు అవసరమైన మూడు టీఎంసీల నీటిని సమీప కృష్ణానది నుండి తీసుకోనున్నారు.

బొగ్గును కృష్ణపట్నం, సింగరేణీ, కొత్తగూడెం, రామగుండంల నుండి దిగుమతి చేసుకోనున్నారు. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌తో పాటు టౌన్‌షిప్ నిర్మాణాన్ని కూడా చేపడుతామని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సీఎం కేసీఆర్ అభివర్ణించినట్లుగా తెలంగాణ వెలుగు దివ్వె యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మితమైన పక్షంలో వేలాది మందికి ఉపాధి లభించి మిర్యాలగూడ అభివృద్ధి రూపురేఖలు మార్చే రీతిలో కొత్త పట్టణం ఇక్కడ రూపుదిద్దుకోనుందని భావిస్తున్నారు.



యాదాద్రి శివాలయానికి స్ఫటిక శివలింగం బహూకరణ


విలువ రూ.30 లక్షలు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 31: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి కొండపైన ఉన్న శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వర శివాలయానికి హైద్రాబాద్‌కు చెందిన భక్తుడు సదావ సంతరెడ్డి - సుజాత దంపతులు బహూకరించారు. ఈ స్పటిక లింగం విలువ రూ.30లక్షలు. సోమవారం ఈవో గీత, అనువంశిక ధర్మకర్త నరసింహ మూర్తి, ప్రధానార్చకులు నరసింహమూర్తిలకు ప్రత్యేక పూజల మధ్య స్పటిక లింగాన్ని అందించారు.

యాదాద్రి పుష్కరణిలో అద్భుతం

- ❖ నడిగుట్టపై ఎగిసిపడిన ఊట జలం ❖ ఫ్లోరింగ్‌తో మూసేసే యత్నం
- ❖ ఆశ్చర్యపడుతున్న భక్తులు.. ఇరకాటంలో అధికారులు
- ❖ ఊటజలం కాదని నమ్మించేందుకు ప్రయత్నాలు


యాదగిరిగుట్ట, డిసెంబర్ 31: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నిర్మాణ పనులు ఒకవైపు నభూతో నభవిష్యత్ అన్న రీతిలో అద్భుత శిల్ప సంపదతో సాగిపోతుండగా ఇంకోవైపు అదే స్థాయిలో తరచూ వివా దాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో గర్భాలయం విస్తరణలో భాగంగా స్వామివారి స్వయంభూగా పంచనారసింహుడిగా వెలసిన రాతిగుండు వెనుక భాగం పగులగొట్టిన నిర్వాకం మరువకముందే తాజాగా కొండపైన పుష్కరణి అభివృద్ధి పనులు వివాదాస్పదమవుతున్నాయి. కొండపైన పుష్కరణి అభివృద్ధిలో భాగంగా సహజ సిద్ధ ఊట జలాలు లేవంటూ పుష్కరణిలో పూర్తిగా సిమెంట్, కాంక్రిట్‌తో ఫ్లోరింగ్ పనులు చేయిస్తున్నారు. ఒకవైపు ఆ పనులు సాగుతుండగానే ఇంకోవైపు యాదాద్రి నడికొండపైన పుణ్యజలం తన ఉనికి చాటుతూ పెద్ద ఎత్తున ఉబికి రావడం భక్తులను, స్థానికులను ఆశ్చర్యపరుస్తోంది. బాల ఆలయానికి, ప్రధాన ఆలయానికి మధ్య దారిలో జరుగుతున్న పనుల్లో భాగంగా త్రవ్విన చోట ఐదు అడుగుల లోతులో సోమవారం రాతి చెరిక నుండి పెద్ద ఎత్తున జలం ఉబికి వస్తోంది. ఇప్పటిదాకా పుష్కరిణికి ఊట జలాలు లేవంటూ ఫ్లోరింగ్ జరిపిస్తుండగా ఉబికి వచ్చిన పు ణ్య జలంపై భక్తుల నుండి ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తుందన్న ఆందోళనతో ఆలయ అధికారు లు వెంటనే మోటార్లు పెట్టి జలాలను తోడివేస్తున్నారు. అయినప్పటికి అక్కడ నీటి ఊట ఆగకుండా కొనసాగుతున్న తీరు కొండపై సహజసిద్ధ పవిత్ర ఊట జలాల ఉనికిని చాటుతుండటం గమనార్హం.




సోమవారం యాదాద్రి నడికొండపై ఉబికి వచ్చిన ఊట జలాలు

మహిమాన్విత జలాలకు అడ్డుకట్టపై భక్తుల ఆగ్రహం

సాక్షాత్తు స్వామివారి ప్రతీకగా బ్రహ్మ కమండలం నుండి జారిపడిన పవిత్ర జలంతో ఆవిర్భవించిన కొండపైన విష్ణుపుష్కరణిలో సుదర్శనుడి కొలువై ఉన్నట్లుగా భక్తుల నమ్మకం. పవిత్రమైన ఈ విష్ణు పుష్కరణిలో యాదరుషి మహర్షి పుణ్యస్నానాలు చేసి తపస్సు ఆచరించి స్వామివారిని ప్రసన్నం చేసుకున్నారని స్థల పురాణం చెప్తోంది. పూర్వం సుర, మునులు ఈ పుష్కరణిలో స్నానమాచరించేవారని, కాలక్రమేణా భక్తులు ఈ పుష్కరణి జలాలను సకల పాపహరిణిగా, సర్వరోగ నివారిణిగా భావిస్తూ పుణ్యస్నానాలు ఆచరించడం ఆనవాయితీ. అటువంటి మహిమాన్వితమైన యాదాద్రి పుష్కరిణి అభివృద్ధిలో భాగంగా పుష్కరిణి కొండ చరియలు, చెరికల్లో ఊట జలం లేదంటూ పుష్కరణి అడుగు భాగాన్ని మొత్తం కాంక్రీట్, సిమెంట్‌తో ఫ్లోరింగ్ చేస్తూ 15 అడుగుల మేర ఎత్తు పెంచుతున్నారు. అయితే ఏళ్ల తరబడిగా ఈ యాదాద్రిని సందర్శిస్తున్న భక్తులు, స్థానికులు మాత్రం పుష్కరిణి కొండ చెరికల నుండి సహజసిద్ధమైన ఊట జలాలతోనే గతంలో పుష్కరిణి నిండేదని, గతంలో ఒక పర్యాయం మరమ్మతుల సందర్భంగా విషపురుగులు రాకుండా చెరికలను మూసివేసి చిన్నచిన్న రంధ్రాలు వదలడంతో ఇటీవల దాకా పుష్కరిణిలో ఊటనీరు వచ్చి చేరుతుండేదని గట్టిగా చెబుతున్నారు. తాజాగా పుష్కరిణి అభివృద్ధిలో భాగంగా పూర్తిగా ఫ్లోరింగ్ చేస్తుండటంతో ఇక సహజసిద్ధంగా భక్తులు పవిత్రంగా భావించే మహిమాన్విత ఊట జలం పుష్కరిణిలోకి చేరని పరిస్థితి నెలకొంది. ఈ వివాదంపై ఇటీవల వైటీడీఏ అధికారులు వివరణ ఇస్తూ పుష్కరణిలో సహజసిద్ధమైన ఊట జలాలకు ఆస్కారం లేదని జియాలజిస్టులు ఇచ్చిన సర్వే మేరకు పుష్కరిణిని ఫ్లోరింగ్ చేయిస్తున్నామని తెలిపారు. తాజాగా కొండపైన ఊట జలం వెలుగుచూడటం ఆలయ అధికారులను ఇరకాటంలో పడేసింది. సీఎం కేసీఆర్ సైతం ఆలయ సహజత్వాన్ని దెబ్బతీయకుండా అభివృద్ధి పనులు జరిపించాలని చెప్పగా వైటీడీఏ మాత్రం అందుకు భిన్నంగా సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా కొండపైన ఊట జలం వెలుగు చూసిన నేపథ్యంలో పుష్కరణిలోకి ఊట జలాలు కలిసేలా ఏర్పాటు చేసి పుష్కరణి జలాల మహిమను, పవిత్రతను, భక్తుల నమ్మకాన్ని పరిరక్షించాలని భక్తులు కోరుతున్నారు.


ప్రధానాలయం, బాలాలయం మధ్యలో ఊటజలం వచ్చిన ప్రాంతం

జయహో భారత్

ఆకాశమే హద్దుగా కొత్త పుంతలు



వెల్‌కం 2019

కొత్త ఆశలు, సరికొత్త తీర్మానాలు..ఎన్నో, ఎన్నెన్నో విజయాలను ప్రోది చేసుకుని కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నాం. కొత్త ఏదైనా ఆశల సమన్వితమే..గత వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకుని తప్పులకు తావులేకుండా ముందుకు సాగేందుకు దోహదం చేసేదే. అంతర్గతంగా, అంతర్జాతీయంగా భారత దేశం కొత్త పుంతలు తొక్కింది. రోదసీలో అబ్బురపడే అద్భుతాలను సాకారం చేసుకుంది. క్రీడల్లో రాణించి దేశంలోని యువకులకు స్ఫూర్తిదాయక బాసటను అందించింది. శాంతి, సౌభ్రాతృత్వమే ధ్యేయంగా ప్రపంచ దేశాలకు తలమానికంగా నిలిచింది. ఆర్థికాభివృద్ధిలోనూ కొత్త తీరాలు చేరుకున్న భారత దేశం కొత్త సంవత్సరంలో మరిన్ని లక్ష్యాలను సాకారం చేసుకునేందుకూ సమాయత్తమైంది. తీవ్ర ఒడిదుడుకులకు లోనైనా స్టాక్ మార్కెట్లు సైతం దేశ ఆర్థిక పునాదులకు అద్దం పడుతూ అంతర్జాతీయ విపరీత ధోరణులను సైతం తట్టుకుని నిలబడగలిగాయి. అమెరికా డాలర్ మారకంతో బలహీన పడ్డ రూపాయి ఎప్పటికప్పుడు నిలదొక్కుకుంటూ, పుంజుకుంటూ ఆర్థిక సత్తాకు నిదర్శనంగా నిలిచింది. కొత్త సంవత్సరంలో ఆర్థికాభివృద్ధి వేగాన్ని పుంజుకునే కొద్దీ రూపాయి బలపడటంతో పాటు అన్ని రంగాలు అంతర్గత శక్తితో రాణించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఆయుష్మాన్ భారత్‌తో పాటు జనారోగ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఎన్నో పథకాలు, కార్యక్రమాలూ అనుకున్న ఫలితాల్ని అందిస్తూ జీవన ప్రమాణాన్ని పెంచుతున్నాయి. ప్రపంచంలో ఏ దేశానికీ లేనంత యువశక్తిని కలిగిన భారత్ అదే స్ఫూర్తితో నవనవోన్మేషంగా అంతర్జాతీయ రంగంలో రాణించే అవకాశాలు మెరుగయ్యాయి. యువ పారిశ్రామిక వేత్తల్ని తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన స్టార్ట్‌అప్‌లు సహా అనేక పథకాలను అందిపుచ్చుకున్న యువత అంతర్జాతీయ ప్రమాణాలతో రాణిస్తోంది. సామాజిక మీడియా మరింతగా వేళ్లూనిన నేపథ్యంలో సాధికార భారత్ కొత్త వన్నెలీనుతోంది. మహిళా భద్రతకు సంబంధించి ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు సైతం వారిలో కొత్త ఉత్సాహాన్ని పాదుగొల్పుతూ అన్ని రంగాల్లోనూ తమ శక్తియుక్తులకు పదును పెట్టుకునేలా చేస్తున్నాయి. సాంకేతిక విజ్ఞానం నలుచెరగులా వేళ్లూనడంతో ఆ విజ్ఞాన కాంతుల వెలుగులో యువత ప్రతిభ మరింతగా వన్నెలీనుతోంది. అమెరికా, రష్యా వంటి అగ్ర దేశాలు మొదలుకుని ఇరుగు పొరుగున ఉన్న అన్ని దేశాలతోనూ ఇనుమడించిన మైత్రీ బంధం ద్వైపాక్షిక వాణిజ్యపరంగా భారత్ మరిన్ని కొత్త శిఖరాలను అందుకునేలా చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. రోదసీ రంగంలో వరుస విజయాలను సాధిస్తూ ఎప్పటికప్పుడు తన అంతరిక్ష సత్తాను చాటుకుంటున్న ఇస్రో కొత్త సంవత్సరంలో మరిన్ని అద్భుత ప్రయోగాలకు సమాయత్తం కావడం భారత కీర్తిని విశ్వ వ్యాప్తం చేసే ప్రయత్నమే. అక్షర భారత లక్ష్యాల సాధనలో కొత్త తీరాలను చేరుకుంటూ విద్యాభారత ఆవిష్కారానికీ 2019 కీలకమవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. రాజకీయంగా కూడా ఎన్నో మలుపులూ, మెరుపులకూ కొత్త ఏడాది స్వాగతం పలుకబోతోంది. పెద్ద నోట్ల రద్దు ప్రభావాన్ని తట్టుకుంటూ, జీఎస్‌టీ భారాన్నీ క్రమంగా దించుకుంటూ నిష్క్రమిస్తున్న 2018 కొత్త ఏడాదికి సరికొత్త ఆశలను అందిస్తోంది. ఏ విధంగా చూసినా నూతన సంవత్సరం నవ భారత నిర్మాణంలో కొత్త వెలుగులను అందిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. భిన్న రంగాల్లో మరిన్ని అద్వితీయ విజయాలకూ, యువశక్తి నిరుపమానతకు, మహిళా శక్తి మరింతగా దేదీప్యం కావడానికి 2019 దోహదం చేయాలని ఆశిద్దాం. ఆ ఆశలను సాకారం చేసుకునే పట్టుదల, నిబద్ధత, అంకిత భావంతో ముందుకు సాగుదాం..జయహో భారత్..



ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
మంగళవారం, 1 జనవరి 2019

చేదు అయిన న్యాయం..

హైదరాబాద్ ఉన్నత న్యాయస్థానం 'తెలంగాణ ఉన్నత న్యాయస్థానం'గాను, 'ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం'గాను పునర్ వ్యవస్థీకృతం కావడం మరో చారిత్రక పరిణామం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణతో ఈ శుభ పరిణామం మొదలైంది. ఒక రాష్ట్రం రెండుగా పునర్ వ్యవస్థీకరణ జరిగిన వెంటే ఉమ్మడి రాజ్యాంగ వ్యవస్థలు కూడ రెండుగా ఏర్పడడం సహజమైన పరిణామం. ''కలియుగాబ్ది 5120వ సంవత్సరం, జాతీయ శకం 1940వ సంవత్సరం, క్రీస్తుశకం 2019వ సంవత్సరం ఈ సహజ పరిణామక్రమ పరాకాష్ఠకు 'సమయ ముద్ర'ను వేయడం కేవలం లాంఛనం. ఈ రాజ్యాంగ లాంఛనం శుభ విలంబి సంవత్సరం మార్గశిర బహుళ ఏకాదశి, మంగళవారం నాడు చారిత్రక వాస్తవంగా ప్రస్ఫుటిస్తోంది! ఉమ్మడి మదరాసు రాష్ట్రం కొనసాగిన కాలంలో తెలుగువారికి రెండు ఉన్నత న్యాయస్థానాలు ఉండేవి. మదరాసు రాష్ట్ర పునర్విభజన ఫలితంగా క్రీస్తుశకం 1953 అక్టోబర్ ఒకటవ తేదీన ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రానికి గుంటూరులో ఉన్నత న్యాయస్థానం ఏర్పడడం చరిత్ర. 'నిజాం'ల మతోన్మాద నిరంకుశ బీభత్స పాలన నుంచి హైదరాబాద్ సంస్థానం 1948 సెప్టెంబర్ 17న విముక్తమైన తరువాత 1956 అక్టోబర్ ముప్పయి ఒకటవ తేదీ వరకు అలా తెలుగువారికి రెండు ఉన్నత న్యాయస్థానాలు ఏర్పడినాయి... హైదరాబాద్‌లో ఒకటి, మొదట మదరాసులోను ఆ తరువాత గుంటూరులోను రెండవది. హైదరాబాద్ రాష్ట్రంలోని కన్నడ ప్రాంతాలు మైసూరు- కర్నాటక - రాష్ట్రంలోను మరాఠీ ప్రాంతాలు ముంబయి- మహారాష్ట్ర- లోను కలిసిపోవడం తెలుగు ప్రాంతమైన తెలంగాణ కోస్తా, రాయలసీమ ప్రాంతాలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడడం తరువాతి చరిత్ర. అలా 1956 నవంబర్ ఒకటవ తేదీన ఆంధ్రప్రదేశ్ ఏర్పడడంతో గుంటూరులోని హైకోర్టు హైదరాబాద్‌లోని హైకోర్టులో కలిసిపోయింది. 2014 జూన్ రెండవ తేదీన తెలుగు భాషాజన సముదాయానికి మళ్లీ రెండు రాష్ట్రాలు ఏర్పడడం ఆంధ్రప్రదేశ్ ప్రజాపాలన చరిత్రలో మరో శుభకరమైన పరిణామం. చిన్న రాష్ట్రాలు ఏర్పడడం వల్ల పాలన, ప్రగతి వికేంద్రీకృతం కాగలవన్న, మరింత విస్తృతం కాగలవన్న వాస్తవానికి ఈ నాలుగున్నర ఏళ్ల చరిత్ర నిదర్శనం! అందువల్ల మళ్లీ రెండు ఉన్నత న్యాయస్థానాలు ఏర్పడడం ఊహించిన పరిణామం. ఈ పరిణామం వాస్తవ రూపం ధరించడానికి నాలుగున్నర ఏళ్లు పట్టడమే విచిత్రమైన వ్యవహారం! తెలుగువారి ఈ చరిత్ర మొత్తం- 1948నాటి నుంచి, 1953 నాటి నుంచి, 1956నుంచి, 2014 నుంచి కొనసాగుతున్న చరిత్ర- ఉమ్మడి వారసత్వం! అందువల్ల రెండు న్యాయస్థానాలు వ్యవస్థీకృతమౌతున్న సమయంలో హైదరాబాద్‌లో తెలంగాణ ఉన్నత న్యాయస్థానం, విజయవాడ- అమరావతి-లో ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం 'కొత్తగా' కొలువుతీరుతున్న సమయంలో తెలుగు ప్రజలు ఈ ఉమ్మడి వారసత్వపు అనుభూతులను నెమరు వేసుకొనడం సహజం..

ప్రతి రాష్ట్రానికి ఒక ప్రత్యేక ఉన్నత న్యాయస్థానం ఉండాలని రాజ్యాంగంలోని 214వ అధికరణం నిర్దేశిస్తోంది. కేంద్ర పాలిత ప్రాంతాలకు మాత్రం ప్రత్యేకంగా హైకోర్టు ఉండవచ్చు లేదా రెండు అంతకంటె ఎక్కువ కేంద్ర పాలిత ప్రాంతాలకు కలసి ఒకే హైకోర్టు ఉండవచ్చునని 241వ అధికరణం నిర్దేశిస్తోంది. అందువల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఈ నాలుగున్నర ఏళ్లుగా ప్రత్యేక ఉన్నత న్యాయస్థానాలు లేకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి కలిగిన విఘాతం. గతంలో బిహార్ పునర్ వ్యవస్థీకరణ తరువాత ఝార్ఖండ్ ఏర్పడినప్పుడు కాని, మధ్యప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ తరువాత ఛత్తీస్‌గఢ్ ఏర్పడినప్పుడు కాని, ఉత్తరాంచల్- ఉత్తరఖండ్- ఉత్తరప్రదేశ్ నుండి విడివడినప్పుడు కానీ ఉన్నత న్యాయస్థానం ఏర్పాటు వ్యవహారానికి ఇంతటి సుదీర్ఘకాలయాపన జరగలేదు. మదరాసు రాష్ట్రం పునర్విభజన తరువాత ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు కూడ కర్నూలులో రాజధాని, గుంటూరులో హైకోర్టు ఏర్పడడం సమాంతర పరిణామాలు! కానీ తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్‌కు నాలుగున్నర ఏళ్లు ఒకే ఉన్నత న్యాయస్థానం కొనసాగడం పునర్ వ్యవస్థీకరణ స్ఫూర్తికి వ్యతిరేక పరిణామం. పదేళ్లపాటు ఉభయ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిని మాత్రమే పునర్ వ్యవస్థీకరణ చట్టంలో నిర్దేశించారు.. ఉమ్మడి న్యాయస్థానాన్ని కాదు!

శాసన నిర్మాణం- విధాన మండలి- కార్యనిర్వాహకత్వం- మంత్రివర్గం,- న్యాయ వ్యవస్థ ప్రజాస్వామ్య రాజ్యాంగ ప్రక్రియను నడిపించే మూడు ప్రధాన విభాగాలు. కొత్త రాష్ట్రం ఏర్పడినప్పుడు ఈ మూడు విభాగాలు ప్రత్యేకంగా ఏర్పడినప్పుడు మాత్రమే రాష్ట్రానికి రాజ్యాంగ స్వరూప స్వభావాలు సమగ్రం కాగలవు. ఆ సమగ్రతను రెండు తెలుగు రాష్ట్రాలు మంగళవారం సంతరించుకోనున్నాయి. ఈ సమగ్రత సిద్ధించడానికి నాలుగున్న ఏళ్లు పట్టడం రాజకీయ నిర్లక్ష్యానికి నిదర్శనం. హైదరాబాద్ ఉన్నత న్యాయస్థానాన్ని రెండు వేఱువేఱు న్యాయస్థానాలుగా పునర్ వ్యవస్థీకరించడం పట్ల తెలంగాణ ప్రభుత్వం చూపినంత శ్రద్ధ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చూపలేదన్నది నిరాకరింపజాలని నిజం. కేంద్ర ప్రభుత్వం దాదాపు నాలుగేళ్లు ఈ సంగతిని పెద్దగా పట్టించుకోకపోవడం చరిత్ర. సర్వోన్నత న్యాయస్థానం అక్టోబర్ 29వ తేదీన ఆదేశించిన తరువాత మాత్రమే 'కదలిక' మొదలైంది! ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఉన్నత న్యాయస్థానం పనిచేయడానికి వీలైన తాత్కాలిక భవనాలను డిసెంబర్ పదిహేనవ తేదీనాటికి సిద్ధం చేయగలమని రాష్ట్ర ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానానికి నివేదించింది. జనవరి ఒకటవ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అమరావతిలో పనిచేయాలన్న ఉత్తరువునకు ఇదీ ప్రాతిపదిక! కానీ ఈ తాత్కాలిక భవనాలు సిద్ధం కాకపోవడం వల్ల ఉన్నత న్యాయస్థానాన్ని తాత్కాలికంగా విజయవాడలో ఏర్పాటు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అధిక శాతం న్యాయవాదులు హైకోర్టుతోపాటు అమరావతికి తరలిపోవడానికి విముఖతను వ్యక్తం చేయడానికి ఇదీ కారణం! హైకోర్టు తరలింపును కొన్ని నెలలపాటు వాయిదావేయాలన్నది ఈ న్యాయవాదుల అంతరంగం... ఈ 'వాయిదా'ను కోరుతూ ఈ న్యాయవాదులు సుప్రీం కోర్టును ఆశ్రయించడం విజయవాడలో మంగళవారం జరుగనున్న ప్రధాన ఉన్నత న్యాయమూర్తి, న్యాయమూర్తుల ప్రమాణ స్వీకార ఉత్సవానికి విచిత్రమైన నేపథ్యం..

అమరావతిలో భవనాల నిర్మాణం పూర్తికానప్పుడు ఆ సంగతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానానికి నివేదించి ఉండాలి, నివేదించకపోవడం నిమ్మకు నీరెత్తినట్టు నిర్లిప్తతను ప్రదర్శించడం నిర్లక్ష్యానికి నిదర్శనం! హైదరాబాద్ ఉభయ రాష్ట్రాలకు పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉండగల అవకాశం ఉంది. అందువల్ల హైదరాబాద్‌లోని తమ భవనాల ప్రాంగణంలోనే, తాము ఖాళీచేసిన సచివాలయంలో కావచ్చు ఇతర భవనాలలో కావచ్చు కొంతకాలం తమ ఉన్నత న్యాయస్థానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పరచుకొని ఉండవచ్చు. ఇందుకు తెలంగాణ ప్రభుత్వం కూడ అభ్యంతరం చెప్పలేదు! ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఈ ధ్యాస ఎందుకు కలగలేదు? శాసనసభను, సచివాలయాన్ని తరలించుకొని రావడానికి- హైదరాబాద్ నుంచి అమరావతికి- చూపిన ఆసక్తిని, శ్రద్ధను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నత న్యాయస్థానాన్ని తరలించుకొని రావడంలో చూపలేదన్నది స్పష్టం.. ఏమయినప్పటికి ప్రత్యేక 'హైకోర్టులు' ఏర్పడినాయి. ఉభయ రాష్ట్రాలకు 'రాజ్యపాల్'-గవర్నర్- మాత్రమే ఇప్పుడు ''ఉమ్మడి''.

విషం చిమ్ముతున్న 'ఉగ్రనాగు'!

'సెక్యులరిజం' ముసుగులో మన రాజకీయ పార్టీలు గత డెబ్బది సంవత్సరాలుగా విషనాగును పాలు పోసి పోషించాయి. మరి.. అది కాటు వేయకుండా ఉంటుందా? మన దేశంలో భారీ విధ్వంసానికి ఐసిస్ ఉగ్రవాదులు కుట్ర పన్నారన్న విషయం తాజాగా బహిర్గతం కావడంతో ప్రజలంతా మరోసారి నివ్వెరపోయారు. జాతీయ భద్రతా సంస్థ (ఎన్ఐఏ) అధికారులు ఇటీవల 16 మంది ఐసిస్ ఉగ్రవాదులను అరెస్టు చేశారు. జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ వేడుకల్లోను, పలు చోట్ల ఆరెస్సెస్ కార్యాలయాలపైన రాకెట్ లాంచర్లతో, గ్రెనేడ్లతో దాడులు చేసేందుకు వీరు వ్యూహరచన చేశారని నిఘా విభాగం అధికారులు కనుగొన్నారు.

మొత్తం 17 ప్రదేశాల్లో విధ్వంసానికి 'టైమ్‌బాంబులు' అమర్చాలని ఉగ్రవాదులు వ్యూహం పన్నారట! భారీ ఎత్తున ఆయుధాలను, విధ్వంసక సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇవన్నీ పాకిస్తాన్, సిరియా వంటి దేశాల నుండి భారత్‌లోని ఉగ్రవాదులకు అందుతున్నాయనేది సుస్పష్టం. ప్రముఖ రాజకీయ నేతలను ఉగ్రవాదులు టార్గెట్ చేశారు. ఢిల్లీ సమీపంలోని నోయిడాలో ఇంజనీరింగ్ విద్యార్థిని సహా కొందరు వెల్డర్లను నిఘా విభాగం అధికారులు పట్టుకున్నారు. నిందితుల్లో కొందరు ఇస్లామిక్ మదర్సాల్లో శిక్షణ పొందారు. ఉత్తర ప్రదేశ్‌లోని పలు చోట్ల ఉగ్రవాద కార్యకర్తలను అరెస్టు చేశాక పలు ఆందోళనకరమైన అంశాలు వెలుగు చూశాయి. నిజానికి గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉగ్రవాద కార్యకలాపాలు దేశవ్యాప్తంగా విస్తరించాయి. ఉత్తరప్రదేశ్‌లో సిమీ, హైదరాబాద్‌లో ఎంఐఎం, కేరళలో ముస్లిం లీగ్ వంటి మతోన్మాద ఉగ్రవాద సంస్థలను ఓటు బ్యాంకు రాజకీయాల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెంచి పోషించింది. భారత్‌ను ఇస్లామిక్ స్టేట్‌గా మార్చాలన్న పన్నాగంతో పాకిస్తాన్ ఈ ఉగ్రవాదులకు అండగా నిలుస్తోందన్నది బహిరంగ రహస్యం. ఉగ్రవాదులను అరెస్టు చేయడం తాత్కాలిక పరిష్కారం మాత్రమే. భారత్‌లోని ముస్లిం, క్రైస్తవ మతస్థులను, మావోయిస్టులను, వామపక్ష కార్యకర్తలను దేశభక్తులుగానూ మార్చడమే ఉగ్రవాద సమస్యకు శాశ్వత పరిష్కారం కాగలదు.

'శిప్ర వాక్యం'
ప్రొ. ముదిగొండ శివప్రసాద్

★★★

తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో ఉభయ కమ్యూనిస్టు పార్టీలూ, మావోయిస్టు పార్టీలు ఘోరంగా ఓడిపోయాయి. కేసీఆర్ ప్రభంజనంలో చాడ వెంకటరెడ్డి, తమ్మినేని వీరభద్రం, ప్రొఫెసర్ కోదండరాం, గద్దర్ వంటి వారంతా కొట్టుకొని పోయారు. ఇప్పుడు సీమాంధ్రలో మధు, రామకృష్ణ, జానకీరాములు వంటి నేతల ఆధ్వర్యంలో సిపిఐ, సిపిఎం, ఆర్ఎస్‌పి వంటి పార్టీలు ఆందోళనలు మొదలుపెట్టాయి. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నందుకు నిరసనగా ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలను తాము అడ్డుకుంటామని వామపక్ష పార్టీలు ప్రకటించాయి. సీమాంధ్రులకు క్షమాపణలు చెప్పిన తర్వాతే మోదీ ఏపీలో అడుగు పెట్టాలని వీరు హెచ్చరిస్తున్నారు. వీరి వాదం ఏమిటంటే రైతులకు మోదీ ఎలాంటి న్యాయం చేయలేదు. విద్యారంగాన్ని ప్రైవేటీకరణ చేస్తున్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదు.

కమ్యూనిస్టు పార్టీలను ఇప్పటికే త్రిపుర, పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రజలు తిరస్కరించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ జగన్, పవన్ కల్యాణ్, చంద్రబాబు పార్టీలకు తప్ప ఉభయ కమ్యూనిస్టులకు మనుగడ లేకుండా పోయింది. సాక్షాత్తూ దేశ ప్రధాని పర్యటనకు వస్తానంటే నల్లజెండాలు చూపి స్తామనడం రాజ్యాంగ బద్ధమేనా? 'మాకు రాజ్యాంగం మీద, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మీద ఎట్టి నమ్మకమూ లేదు' అని గతంలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ వంటి కమ్యూనిస్టు అగ్రనేతలు అన్నారు. కార్పొరేట్ విద్యను ప్రోత్సహించే తెలుగుదేశం పార్టీతో తెలంగాణ ఎన్నికల సందర్భంగా సీపీఐ వారు జతకట్టడం ఎంతవరకూ నైతికం..?

★★★

మన దేశంలో మానవ హక్కుల సంఘాలు, పౌర హక్కుల సంఘాలు, అరసం, విప్లవం వంటి సాహిత్య సంస్థలకు కమ్యూనిస్టులు 'ఫ్రంట్ ఆర్గనైజర్లు'గా కార్యకలాపాలు సాగిస్తూ ఉంటారు. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేరుతో జాన్‌దయాళ్, కవితాకృష్ణ, అరుంధతీ రాయ్ వంటి సెక్యులర్ వాదులు సాగిస్తున్న కార్యకలాపాలు అందరికీ తెలిసిందే! వీరికి కనువిప్పు కలిగించే ఒక వార్త ఇటీవల చైనాలో వెలుగులోకి వచ్చింది. క్యూజాన్ జియన్ అనే విద్యార్థి మావో జయంతిని జరుపుతుంటే అతడిని పోలీసులు అరెస్టుచేసి జైలుకు తరలించారు. ఈ సంఘటన పెకింగ్ యూనివర్సిటీలో జరిగింది. ఇలా ఎందుకు జరిగిందో భారత కమ్యూనిస్టులు 'వివరణ' ఇస్తారా? తియాన్‌జిన్ (చైనా) నుండి వచ్చిన మరో వార్త ఇది.. 42 ఏళ్ల వయస్సుగల వాంగ్ క్వాంగ్ జంగ్ అనే మానవ హక్కుల నాయకుణ్ణి అరెస్టుచేసి పోలీసులు కోర్టుకు పంపారు. అతడు చేసిన నేరం ఏమిటంటే భూకబ్జాలకు వ్యతిరేకంగా పోరాడటం. వాంగ్ న్యాయవాద వృత్తిలో ఉన్నాడు. రాజ్యాధికారాన్ని ధిక్కరించి భూపోరాటాలు చేస్తున్నాడని ఈయనపై అభియోగం మోపారు. భారత మానవ హక్కుల సంఘం వారు దీనికి ఏం సమాధానం చెపుతారు?

★★★

ఎన్నికల్లో ప్రజలు భావోద్రేకాలతో ఓటు వేస్తారు. అంటే ఎన్నికల్లో అభ్యర్థుల జయాపజయాలను బట్టి పార్టీల సిద్ధాంతాల్లో మంచిచెడులను నిర్ణయించలేం. ఎంపీ, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో ఇటీవల భాజపా ఓడిపోయినంత మాత్రాన ఆ పార్టీ నేతల దేశభక్తిని శంకించలేం. కాంగ్రెస్ గెలిచినంత మాత్రాన వారి అవినీతి, విదేశీ భక్తి ఆమోదయోగ్యం కాదు. మన దేశంలో కమ్యూనిజం పూర్తిగా ఓడిపోయింది. అందుకు కారణం వారి హింసాప్రవృత్తిని సమాజం అసహ్యించుకోవటం. వారి వర్గ కలహ సిద్ధాంతాన్ని జనం తిరస్కరించారు. అంతమాత్రాన ఆర్థిక అసమానతలు నివారించడంలో కమ్యూనిస్టుల పాత్ర లేదని చెప్పలేము. ఆర్థిక శోషణ ఉన్నంతవరకు ఏదో ఒక పార్టీ నేతృత్వంలో ఏదో ఒక ఉద్యమం పుట్టుకొని వస్తూనే ఉంటుంది.

★★★

'ట్రిపుల్ తలాక్ బిల్లు దుర్మార్గం.. ఇది షరియత్ మతచారం' అని కొందరు ముస్లిం పెద్దలు సమర్థించటం వారి మత ఛాందస వాదానికి నిదర్శనం. తలాక్ బిల్లును లోక్‌సభలో మజ్లిస్ పార్టీ నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ వ్యతిరేకించడం సరే. మరి కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఎఐడిఎంకెలు ఎందుకు దీన్ని వ్యతిరేకించాయి? తలాక్ అనే అమానవీయ సాంఘిక దురాచారాన్ని సోనియా గాంధీ అనుచరులు ఎందుకు బలపరుస్తున్నారు? ★

కాంగ్రెస్‌కు కాస్త ఊరట..

కాలగర్భంలో కలసిన 2018 సంవత్సరం రాజకీయంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నది. జాతీయ రాజకీయాలను అతలాకుతలం చేసిన సంవత్సరం ఇది. గతించిన సంవత్సరంలో కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు కాస్త బలం పుంజుకుంటే భాజపాకు మాత్రం చేదు అనుభవాలు మిగిలాయి. జాతీయ స్థాయిలో 'కూటముల'ను ఏర్పాటు చేసేందుకు ఇద్దరు తెలుగు ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, కల్వకుంట్ల చంద్రశేఖరరావులు ఎత్తుకు పైఎత్తులు వేసిన సంవత్సరం ఇదే. ఈ ఇద్దరు నేతలూ జాతీయ స్థాయి నాయకులను సైతం ప్రభావితం చేయడం గమనార్హం.

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ లోక్‌సభ, శాసనసభల స్థానాలకు జరిగిన పలు ఉపఎన్నిల్లో తన పార్టీని గెలిపించుకోవటంతోపాటు మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారు. కర్నాటకలో జనతాదళ్ (ఎస్)తో కలసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం ద్వారా భాజపా ఆధిపత్యానికి రాహుల్ గండికొట్టారు. మేఘాలయలో మాత్రం కాంగ్రెస్ అధికారాన్ని నిలబెట్టుకోలేకపోయింది. తన నాయకత్వ పటిమ విషయంలో ఎస్.పి, బి.ఎస్.పి, తృణమూల్ కాంగ్రెస్ లాంటి పార్టీలకు విశ్వాసం కలిగించి జాతీయ స్థాయిలో భాజపాకు ప్రత్యామ్నాయ శక్తిని రాహుల్ రూపొందించ లేకపోతున్నారు. రాజకీయంగా రాహుల్ గతంలో కంటే పరిణతి సాధించగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని భాజపా ఉత్తర ప్రదేశ్‌తోపాటు పలు రాష్ట్రాల్లో జరిగిన ఉపఎన్నికల్లో ఓటమి పాలైంది. భాజపా మూడు రాష్ట్రాల్లో అధికారాన్ని కోల్పోయింది. కర్నాటకలో కొద్దిలో అధికారాన్ని జార విడుచుకున్నది.

రాహుల్ వాక్ చాతుర్యం, ధైర్యం పెంచుకుంటూ- 'చౌకీదార్ చోర్ హై' అంటూ ప్రధాని మోదీ ప్రతిష్టను దెబ్బ తీయడంలో విజయం సాధించారు. 'పప్పు'గా ముద్ర పడిన ఆయన ఇటీవల జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. బద్ధ శత్రువైన తెలుగుదేశం పార్టీతో కలసి పని చేసేందుకు రాహుల్ సిద్ధపడడం మిగతా విపక్షాలను విస్మయానికి గురి చేసింది.

రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఐదు రాష్ట్రాల్లో అధికారంలోకి రావడమే గాక, కర్నాటకలో జేడీ(ఎస్)తో జతకట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. గత ఏడాది జనవరిలో రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లోని మూడు లోక్‌సభ నియోజకవర్గాలకు జరిగిన ఉపఎన్నికలతో కాంగ్రెస్ విజయ పరంపర ప్రారంభమైంది. రాజస్థాన్‌లోని అల్వార్, అజ్మీర్ నియోజకవర్గాల్లో భాజపాను కాంగ్రెస్ ఓడించింది. పశ్చిమ బెంగాల్‌లోని ఉలుబెరియా నియోజకవర్గాన్ని నిలబెట్టుకోవటంలో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. గత మార్చిలో ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్, బిహార్‌లోని ఆరారియా లోక్‌సభ నియోజకవర్గాలకు జరిగిన ఉపఎన్నికల్లో భాజపాకు తీరని నష్టం వాటిల్లింది.

ఢిల్లీ కబుర్లు
కె.కైలాష్ 98115 73262

యూపీలో భాజపా అధికారంలో ఉన్నా- ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్ అంతవరకు ప్రాతినిధ్యం వహించిన గోరఖ్‌పూర్, ఉప ముఖ్యమంత్రి కేశవ ప్రసాద్ మౌర్య ప్రాతినిధ్యం వహించిన ఫూల్‌పూర్ నియోజకవర్గాల్లో ప్రతిపక్షం కలిసికట్టుగా పోటీ చేసి భాజపాను మట్టి కరిపించింది. ఈ రెండు నియోజకవర్గాల్లో సమాజ్‌వాదీ అభ్యర్థులు విజయం సాదించారు. బిహార్‌లోని అరారియా లోక్‌సభ స్థానాన్ని ఆర్.జె.డి నిలబెట్టుకోవటంతో ప్రతిపక్షం సమైక్యంగా ఉంటే భాజపా కూటమిని సునాయసంగా ఓడించవచ్చుననేది రుజువైంది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలను కోల్పోవడంతో భాజపాకు తీరని నష్టం జరిగింది. గత మేలో ఉత్తర ప్రదేశ్‌లని ఖైరానా, మహారాష్ట్రలోని భాండ్రా గోండియా, పాయిఘర్, నాగాలాండ్‌లోని నాగాలాండ్ లోక్‌సభ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ 'కమల దళం' కంగుతింది.



రాహుల్ వాక్ చాతుర్యం, ధైర్యం పెంచుకుంటూ- 'చౌకీదార్ చోర్ హై' అంటూ ప్రధాని మోదీ ప్రతిష్టను దెబ్బ తీయడంలో విజయం సాధించారు. 'పప్పు'గా ముద్ర పడిన ఆయన ఇటీవల జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. బద్ధ శత్రువైన తెలుగుదేశం పార్టీతో కలసి పని చేసేందుకు రాహుల్ సిద్ధపడడం మిగతా విపక్షాలను విస్మయానికి గురి చేసింది.

ఖైరానా,భాండ్రా గోండియా నియోజకవర్గాల్లో ఆర్.ఎల్.డి, ఎన్.సి.పి చేతిలో ఓడిపోయి, పైగార్ స్థానాన్ని నిలబెట్టుకోవడంతో భాజపా పరిస్థితి చావుతప్పి కన్నులొట్టపోయినట్లయ్యింది. నాగాలాండ్ సీటును ఎన్.పి.ఎఫ్ నుండి లాగేసుకోవటంలో ఎన్.డి.పి.పి విజయం సాధించింది. ఖైరానా స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లో ప్రతిపక్షాలు మరోసారి ఐక్యమత్యంతో వ్యవహరించి భాజపాను నిలువరించాయి. ఇక్కడ ప్రతిపక్షాల తరపున రంగంలోకి దిగిన ఆర్.ఎల్.డి అభ్యర్థి విజయం సాధించారు. గత నవంబర్‌లో కర్నాటకలో మూడు లోక్‌సభ స్థానాల (బళ్లారి, మాండ్యా, శివమొగ్గ) కు జరిగిన ఉపఎన్నికల్లో భాజపా రెండు చోట్ల ఓటమిని చవి చూడకతప్పలేదు. శివమొగ్గ సీటును మాత్రమే భాజపా కాపాడుకోగలిగింది. బళ్లారిలో కాంగ్రెస్, మాండ్యాలో జెడీ (ఎస్) అభ్యర్థులు గెలిచారు.

గత ఏడాది త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్, కర్నాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం, రాజస్థాన్, తెలంగాణ శాసనసభలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో మూడు చోట్ల బి.జె.పి, రెండింటిలో కాంగ్రెస్ అధికారంలో ఉండేవి. గత ఫిబ్రవరిలో త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ శాసనసభలకు ఎన్నికలు జరిగాయి. త్రిపురలో కమ్యూనిస్టులను ఓడించి భాజపా చరిత్ర సృష్టించింది. మేఘాలయలో కాంగ్రెస్ ఓటమిపాలు కాగా ఎన్.పి.పి అధికారంలోకి వచ్చింది. నాగాలాండ్‌లో ఎన్.పి.ఎఫ్ ఓడిపోయి ఎన్.డి.పి.పి అధికారంలోకి వచ్చింది. కర్నాటక శాసనసభకు హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో బి.జె.పి ఏకైక అతి పెద్ద పార్టీగా అవతరించినా అధికారాన్ని నిలబెట్టుకోలేకపోయింది. కాంగ్రెస్ రాజకీయ చాతుర్యాన్ని ప్రదర్శించి జేడీ(ఎస్)తో చేతులు కలిపింది. కేవలం ముప్పై ఐదు సీట్లు గెల్చుకున్న కుమార స్వామిని ముఖ్యమంత్రి చేసి బి.జె.పిని అధికారానికి దూరంగా ఉంచటంలో కాంగ్రెస్ విజయం సాధించింది.

ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ శాసనసభలకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఎన్నికల్లో భాజపా అధికారాన్ని కోల్పోగా కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేసింది. ఛత్తీస్‌గఢ్‌లో తాము ఇంత ఘోరంగా ఓడిపోతామని భాజపా నేతలు కలలో కూడా ఊహించలేదు. గత సంవత్సరం 12 రాష్ట్రాల్లోని పదిహేను లోక్‌సభ సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు మెజారిటీ సీట్లు గెలుచుకున్నాయి. శాసన సభలకు జరిగిన పదహారు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఏడు సీట్లలో, ఇతర ప్రతిపక్షాలు ఆరు సీట్లలో విజయం సాధించాయి. భాజపా కేవలం రెండు సీట్లలో మాత్రమే విజయం సాధించగలిగింది. ఉత్తర ప్రదేశ్‌లోని నూర్‌పూర్ ఉపఎన్నికల్లో ప్రతిపక్షాలు సమాజ్‌వాదీ అభ్యర్థిని గెలిపించుకోవటం ద్వారా భాజపాను దెబ్బ తీశాయి.

సమైక్యంగా పోరాడడం ద్వారా భాజపాను మట్టి కరిపించిన ప్రతిపక్షాలు జాతీయ స్థాయిలో మాత్రం బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగలేకపోయాయి. ప్రతిపక్ష కూటమిని ఏర్పాటు చేసేందుకు జరిగిన రెండు,మూడు ప్రయత్నాలు ఫలించలేదు. ఎస్.పి అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, బిఎస్‌పి అధ్యక్షురాలు మాయావతి, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వంటి విపక్ష నేతలు రాహుల్ గాంధీ నాయకత్వంలో పని చేసేంకు విముఖత చూపడం గమనార్హం. ఎన్.సి.పి అధ్యక్షుడు శరద్ పవార్ కాంగ్రెస్ నాయకత్వంలో పటిష్టమైన ప్రతిపక్ష కూటమిని తయారు చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఢిల్లీలో ప్రతిపక్ష నాయకులతో జాతీయ స్థాయి సమావేశం ఏర్పాటు చేసినా, ఆ తర్వాత ఆయన ప్రయత్నం ఇంకా తుది దశకు చేరుకోలేదు. అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్‌తో కలసి పనిచేసేందుకు అఖిలేశ్ యాదవ్, మాయావతి అంగీకరించటం లేదు. ఎనభై లోక్‌సభ సీట్లున్న యూపీలో ప్రతిపక్షం ఐక్యంగా పని చేయకపోతే జాతీయ స్థాయిలో ఎన్‌డిఏకు ప్రత్యామ్నాయం ఏర్పడటం కల్ల. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ పేరుతో కాంగ్రెసేతర, భాజపాయేతర కూటమిని ఏర్పాటు చేసేందుకు ప్రారంభించిన ప్రయత్నాలు జాతీయ రాజకీయాలను మరో మలుపు తిప్పాయి. ★

ఎన్నికల వ్యవస్థకు చికిత్స అవసరం

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో స్వాతంత్రం వచ్చిన నాటి నుంచే ఎన్నికల ద్వారా ప్రజాస్వామ్య విలువలకు గట్టిగా పునాదులు పడ్డాయి. ఎన్నికల నిర్వహణ భారత ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జరుగుతుంది. ఓటర్ల నమోదు, గుర్తింపు కార్డుల విడుదల, ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ఫలితాల ప్రకటన మొదలగు కార్యక్రమాలను ఎన్నికల కమిషన్ సమర్థవంతంగా నిర్వహిస్తున్నది. ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరగాలంటే, దాదాపు ఎన్నికల ప్రక్రియకు ఒక నెల కాలం పాటు జరుగుతుంది. అవసరమైతే ఇంకొన్నాళ్ళు ఎక్కువనూ తీసుకోవచ్చు. ఓటర్ల నమోదు , ఓటర్ల జాబితా తయారీ, జాబితాకు సవరణలు, పరిశీలనలు,పరిష్కారాలు వగైరా సాధారణ కార్యక్రమాలు జరుగుతాయి. ఎన్నికల తంతు ప్రారంభం కాగానే ఎన్నికల నియమావళి (కోడ్) అమలులోకి వచ్చిందంటే ప్రజా ప్రతినిధులు నామమాత్రం అయిపోతారు. దాదాపు ప్రభుత్వ విభాగాలన్నీ ఎన్నికల కమిషన్ పరిధిలోకి వస్తాయి.

పోలింగ్ కోసం ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషిన్లు ఉపయోగిస్తారు. పోలింగ్ ముగిశాక వీటిని అత్యంత జాగ్రత్తతో భద్రపరుస్తారు. ఎన్నికలు అయిన తరువాత, ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషిన్లను, ప్రకటింపబడిన వోట్లలెక్కింపు రోజున తెరచి వోట్ల లెక్కింపు కార్యక్రమాన్ని చేపడుతారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలలో గెలిచినవారి జాబితాను గవర్నరుకూ, రాష్ట్రపతికీ అందజేస్తారు. ఇంతటితో ఎన్నికల కమిషన్ బాధ్యత తీరుతుంది. ఆ తరువాత కార్యక్రమాన్ని లోక్‌సభకు సంబంధించి రాష్ట్రపతి కేంద్రస్థాయిలోనూ, శాసనసభలకు సంబంధించి గవర్నర్లు రాష్ట్రస్థాయిలోనూ చేపడుతారు.

లక్షల మంది ఉద్యోగులు పగలనకా, రాత్రనకా కష్టపడితేనే ఇంత పెద్ద కార్యక్రమం విజయవంతంగా ముగుస్తుంది. ఇదంతా చూడడానికి పక్కాగా ఉన్నదనిపిస్తున్నప్పటికీ ఎన్నికల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం వల్ల నైతేనేమి, ఎన్నికల వ్యవస్థలో ఉన్న డొల్లతనం వల్ల నైతేనేమి అక్రమార్కులకు చక్కటి అవకాశాలను దక్కడం విచారకరం. ఎంతో కష్టపడి చక్కటి ప్రణాళికలు వేసుకున్నా, క్షేత్రస్థాయిలో కొన్ని సమస్యలను ఉత్పన్నమవుతున్నాయి. వాటిని పరిష్కరించుకోగలిగితేనే దేశంలో ప్రజాస్వామ్యం ఫరిడవిల్లుతుంది.

అందులో మొదటిది- మన ఓటు హక్కును మనం పోలింగ్ కేంద్రంలోకి పోయేలోగానే ఎవరో తస్కరించడం లేదా మన ఓటు గల్లంతై ఉండడం. ఇటీవల తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పెద్ద ఎత్తున ఓట్లు తొలగించారని ఇటు ప్రతిపక్ష పార్టీలు , గెలిచిన తరువాత అధికార పార్టీ పేర్కొనడం గమనార్హం. ఒక పక్క పోలింగ్ జరుగుతుండగానే తమ ఓట్లు గల్లంతైనట్టు లేదా ఎవరో వేశారంటా అని కొందరు ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేసిన దృశ్యాలు టీవీలలో ప్రత్యక్ష ప్రసారం అయినాయి. ఇష్టమైన నాయకుడికి ఓటు వేసి మద్దతు తెలియజేయాలన్న ఆశతో ఎక్కడెక్కడినుండో ప్రయాణం చేసి అలసిన శరీరాలతో, ఎంతో ఓపికగాక్యూలో తన వంతు వచ్చే వరకు నిలబడి తీరా లిస్టులో పేరు కనబడకపోతే ఓటరు పొందే నైరాశ్యానికి కారకులు ఎవరు? తన ప్రమేయం లేకుండా తన ఓటు ఎలా పోతుంది? వీటికి కారణాలు తెలుసుకోవాలన్నా, ఎవరిని ప్రశ్నించాలో తెలియక మొత్తం ఎన్నికల వ్యవస్థను , అధికారులను ఓటర్లు ఆడిపోసుకుంటారు. ఇది ప్రధాన లోపం. అప్పటికప్పుడు ఓటర్ల సమస్యని గుర్తించి,ప్రత్యమ్నాయం చూపించే వ్యవస్థని ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అలా చేయాలంటే, ఓటు నమోదు చేయడానికి అన్ని స్థాయిలలో ఎంత మంది అధికారులు ,ఎన్ని ప్రశ్నలు వేసే వారు,ఎన్నెన్నో తనిఖీ పేపర్లు ,తనిఖీలు చేసే అధికారులు ఇంత సమగ్రంగా చర్యలు తీసుకొని ప్రతి ఒక్కరికీ ఓటు ఇవ్వడానికి అధికారులు రాత్రింబవళ్ళు కష్టపడతారు. మరి ఓట్లను తీసేటప్పుడు కనీస సమాచారం ఇవ్వక పోవడం ఇంత పెద్ద ప్రజాస్వామ్య దేశంలో శోచనీయం. తనకు తెలియకుండా,కనీసం సమాచారం ఇవ్వకుండా ఎలా తీస్తారు? అనే ప్రశ్న సామాన్యుడికు కచ్చితంగా ఉదయించక మానదు!

మన దేశంలో కోట్ల సంఖ్యలో బ్యాంకు ఖాతాలు ఉన్నా మన అకౌంట్లో దేనిలోనైనా ఒక్క రూపాయి తీసినా, వేసినా మనకు అలర్టు వచ్చే సదుపాయం ఉన్నప్పుడు మన ఓటు తీసేస్తే మనకు సందేశం వచ్చే ఏర్పాటు చేయలేమా? వేలి ముద్రతో లక్షలకు లక్షలు ఒక ఖాతా నుండి ఇంకొక ఖాతాకు తరలించే అవకాశం ఉన్న దేశంలో వేలి ముద్ర ద్వారా మన ఓటును వేరే వారు వేయకుండా ఆపలేమా? ఆ వ్యవస్థను తెచ్చుకోలేమా? వీటిని అధిగమించాలంటే కావాల్సింది రాజకీయ నాయకులకు పట్టుదల, ప్రజాస్వామ్యం మీద ధృడమైన నమ్మకం. అవే ఉంటే ఈపాటికి ఎపుడో న్యాయంజరిగి ఉండేది.

డబ్బు వెదజల్లారు, ఓటర్లను మభ్య పెట్టారు , మందు పోశారు అనే ఫిర్యాదులు ఒకరి మీద ఒకరు వేసుకోవడం రాజకీయాలలో సహజం. అటువంటి వాటిని అధికారులు, నాయకులు చివరికి ప్రజలు కూడా మామూలే అని పట్టించుకోవడం మానేశారు. సాక్షాత్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రే రెండు వేర్వేరు చిరునామాలతో ఓటు హక్కు కలిగి ఉండడం అనే ఫిర్యాదు ఎలాంటి అనుమానాలకు దారి తీస్తుంది. ఇటువంటి వాటిని సుమోటోగా స్వీకరించి వాస్తవాలు బయట పెట్టే అవసరం లేదా? దర్యాప్తు చేసే అధికారం నిజంగా ఎన్నికల కమిషన్‌కు లేదా? అనే సందేహాలు సహజంగా సామాన్య ప్రజలకు కలుగుతాయి. ఇదే సందర్భంలో ఒక సాధారణ పౌరుడు ఒక బ్యాంకులో వంద రూపాయలు వెయ్యాలన్నా, ఒక వెయ్యి రూపాయలు తియ్యాలన్నా , పిల్లలను స్కూల్లో చేర్పించాలన్నా ప్రతి దానికీ ఆధార్ నెంబర్‌తో లింకు చెయ్యమని, అసలు ఆధార్ నెంబర్ లేకపోతే ఎలాంటి పథకాలు దక్కవని పాలకులు అంటున్నారు. రాజకీయ పక్షాలు ఓటర్ కార్డును ఎందుకని ఆధార్‌కు లింకు చెయ్యమని కోరడం లేదు. వారి ఆటలు సాగవనా? తమకు పనికిరాని ఓటర్లుంటే గుంప గుత్తగా ఓట్లు తీసేసే అధికారం ఎవరికి ఉంది? అసలు ఇటువంటి ప్రచారం నిజమా? అబద్దమా? అనేవి ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి రోజుల వ్యవధిలో నిజాలు బయట పెట్టాలి. తప్పు నిజంగా జరిగిందా? అయితే అందుకు కారకులెవరు? తప్పు ఎలా జరిగింది ? ఆ వివరాలు తెలుసు కొని వారికి శిక్ష విధించాలి. తప్పు నిజంగా జరగకపోతే ఎన్నికల అధికారులపై అభాండాలు వేసిన పార్టీలకు,నాయకులకు, ఫిర్యాదుదారులకు శిక్ష విధిస్తే ఇటువంటి తప్పుడు వార్తలు ప్రచారం కావు. లేదంటే ఈ రాజకీయ నాయకులు చేసే తప్పుడు ప్రచారం వల్ల ఎంతో నీతిగా, నిజాయితీతో కష్టపడ్డ ఎన్నికల అధికారుల మీద సామాన్య ప్రజలకు తప్పుడు అభిప్రాయం కలిగే అవకాశం ఉంది. అది మన ప్రజాస్వామ్యానికి తీవ్ర ప్రమాదం.

ఇక ముసలివారు, కంటి చూపు మందగించిన వారికి ఇవీఎం యంత్రంలో బాలెట్ పేపర్ నలుపు, తెలుపు రంగులలో కనిపిస్తుంది. ట్రక్ సింబల్ వల్ల తమ కారు గుర్తుకు పడాల్సిన వోట్లు పడలేదని తెరాస నాయకులు వాపోయారు!. నలుపు,తెలుపులో బాలెట్ పేపర్ కనిపిస్తే గుర్తుల దగ్గర చాలా తికమక ఉంటుంది. ఒకరి ఓట్లు మరొకరికి పడే అవకాశం ఉంది. దీన్ని ఉపయోగించుకొని కొన్ని పార్టీలు కూడా కావాలని డమ్మీ అభ్యర్థులను నిలిపి వారికి కావాల్సిన వారికి , అవతలి వారి గుర్తును పోలి ఉన్న గుర్తు వచ్చేటట్లు చేయడానికి ఆస్కారం ఉంది. కొంత ఖర్చుతో కూడినదైనా బాలెట్ పేపర్ లో గుర్తులు రంగుల పేపర్లో ఉంటే కచ్చితంగా తేడా అనేది స్పష్టంగా ఉంటుంది. గులాబి రంగు కారుకి, పచ్చ రంగు ఆటో కి , ఎర్ర రంగు ట్రక్కు కి తేడా అనేది స్పష్టంగా ఉంటుంది. అప్పుడు ఎవరికి పడాల్సిన ఓటు వారికే పడుతుంది. ప్రజాస్వామ్యం లో ఓటు అనేది వజ్రాయుధం. ఒక్కొక్కసారి ఒక్క ఓటు అభ్యర్థుల తలరాతలను మారుస్తుంది, ారి భవిష్యత్తును నిర్దేశిస్తుంది. అందుకే ప్రతి ఓటు కీలకం. మన తప్పిదాల వల్ల ఒకరి ఓటు ఇంకొకరికి పడడం ప్రజాస్వామ్యంలో సరికాదు.

ఈరోజుల్లో మనం ఇంట్లో కూర్చొనే షాపింగ్ చేస్తున్నాము, సెల్‌ఫోన్ తోనే ఒక అకౌంట్ నుండి ఇంకొక అకౌంట్ కు క్షణాల వ్యవధిలో లక్షలకు లక్షలు మార్పిడి చేయగలుగుతున్నాము. అటువంటిది ఇంట్లో కూర్చొనే , చేతిలో సెల్ ఫోన్ తోనో మన ఓటు మనం వెయ్యలేమా? అప్పుడు పోలింగ్ శాతం కూడా భారీగా పెరుగుతుంది. తన ఓటు తను వేసుకోవాలని ఉన్నా ఎన్నెన్నో కారణాల వల్ల ఆరోజు పోలింగు బూత్ వరకు వెళ్ళే అవకాశం లేని వారికి, అనివార్య కారణాల వలన దూర ప్రదేశాలకు వెళ్లిన వారికి ఇలా చాలా మందికి ఆన్‌లైన్ వోటింగ్ అనేది బహుళ ప్రయోజనం. పోలింగ్ బూత్‌ల సంఖ్య తగ్గడం వల్ల నిర్వహణ ఖర్చు కూడా భారీగా తగ్గే అవకాశం ఉంది. ఈ దిశగా చర్యలు చేపడితే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అయిన భారతదేశం ప్రతిష్టను నిలబెట్టిన వారమవుతాము. ఈ భాధ్యత అందరి పైనా ఉంది. దీనికి కావాల్సిందల్లా ధృడమైన సంకల్పం , కొంచెం ఓర్పు, మరికొంత నేర్పు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత.

-కాళంరాజు వేణుగోపాల్ 81062 04412



హసీనా ఘన విజయం

• బంగ్లాలో నాలుగోసారి పట్టం • చిత్తయిన విపక్షాలు

ఢాకా, డిసెంబర్ 31: బంగ్లాదేశ్ జాతీయ ఎన్నికల్లో షేక్ హసీనా వరుసగా నాలుగోసారి ఘనవిజయం సాధించారు. అత్యంత వివాదాస్పదంగా మారిన ఈ ఎన్నికల్లో తన ప్రత్యర్థి ఖలీయాజియాను భారీ మెజారిటీతో ఓడించిన హసీనా వరుసగా నాలుగోసారి కూడా అవామి లీగ్ పార్టీకి తిరుగులేని అధికారాన్ని కట్టబెట్టారు. షేక్ హసీనా విజయంతో భారత్-బంగ్లా మధ్య సుహృద్భావ సంబంధాలకు మరింతగా అవకాశం ఏర్పడింది. అవామి లీగ్ సారథ్యంలోని కూటమి 300 స్థానాలు కలిగిన పార్లమెంట్‌లో 288 సీట్లను కైవసం చేసుకుంది. తీవ్రస్థాయి హింస, విధ్వంసకాండ నేపథ్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో 82 శాతం ఓట్లను అధికార కూటమి దక్కించుకుంది. ఇంతకుముందు జరిగిన ఎన్నికల విజయాల కంటే కూడా తాజా ఎన్నికల్లో హసీనా పార్టీ మరింతగా తన బలాన్ని పెంచుకుంది. ప్రతిపక్ష జాతీయ ఐక్యతా ఫ్రంట్ 15 శాతం ఓట్లతో ఎనిమిది సీట్లను మాత్రమే దక్కించుకుంది ఎన్నికల కమిషన్ కార్యదర్శి హెలాలుద్దీన్ అహ్మద్ తెలిపారు. మరోమూడుస్థానాలను ఇతర పార్టీలు గెల్చుకున్నాయన్నారు. అభ్యర్థి



మరణించిన కారణంగా ఒక నియోజకవర్గ ఫలితాన్ని వాయిదా వేసినట్టు తెలిపారు. అఖండ విజయం సాధించిన హసీనాను ప్రధాని మోదీ అభినందించారు. బంగ్లా అభివృద్ధిలో భారత్ పూర్తిగా సహకరిస్తుందని హామీనిచ్చారు. హసీనా సారథ్యంలోని బంగ్లాతో భారత్ సంబంధాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని తెలిపారు. గత కొన్ని సంవత్సరాల్లో భారత్,బంగ్లాలు ఎన్నో సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించుకోగలిగాయి. కాగా, తమ భూభాగాన్ని ఎట్టి పరిస్థితుల్లో భారత్ వ్యతిరేక కలాపాలకు అనుమతించబోమని స్పష్టం చేసిన హసీనా ప్రభుత్వం అందుకు సంబంధించి ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకుంది. తాజా విజయం నేపథ్యంలో మాట్లాడిన హసీనా తమ పార్టీ సాధించిన ఈ ఘన విజయం ప్రజావిజయమని అభివర్ణించారు. 1971లో జరిగిన బంగ్లాదేశ్ విజయంతో దీనిని పోల్చారు. అయితే ఇది తన వ్యక్తిగత విజయాలకు ఉద్దేశించినది కాదని, దేశాభివృద్ధి, ప్రజలకే దీనిని అంకితం చేస్తున్నానని అన్నారు. ఈ ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చేందుకు ప్రయత్నించిన ప్రత్యర్థి ఖలీదా జియా పార్టీ బీఎంపీకి తిరుగులేని దెబ్బ తగిలినట్టయ్యింది. అవినీతి కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న ఖలీదాజియా భవితవ్యం అగమ్యంగా మారింది. కాగా, ఈ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందన్న ఆరోపణలను ఎన్నికల కమిషన్ కొట్టివేసింది. మళ్లీ ఎన్నికలు జరిపే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది.

రాఫెల్‌పై చర్చకు మేమూ సిద్ధమే



• మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటనపై స్పందించిన కాంగ్రెస్ నేత ఖర్గే

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: రాఫెల్ ఒప్పందంపై బుధవారం జరిగే చర్చకు తాము సిద్ధమేనని, లోక్‌సభలో కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే ప్రకటించారు. 'మంత్రి జైట్లీ మనకు ఈ విషయంలో సవాల్ విసిరారు. జనవరి 2న జరిగే చర్చకు మేము సిద్ధమే. టైం నిర్ణయించండి' అని సోమవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఖర్గే పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు గ్రాంట్సు కోసం సప్లిమెంటరీ డిమాండ్లపై జరుగుతున్న చర్చ సందర్భంగా రాఫెల్ ఒప్పందంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలన్న డిమాండ్‌ను పునరుద్ధరించారు. దీనిపై స్పందించిన ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ రాఫెల్‌పై ఖర్గే వెంటనే చర్చను ప్రారంభిస్తే దానికి సమాధానం ఇవ్వడానికి తాము సిద్ధమేనని ప్రకటించారు. తాము సమాధానం చెప్పే విషయంలో పారిపోవడం లేదని, దీనిపై చర్చ జరిగితే కాంగ్రెస్ ప్రచారం చేస్తున్న అసత్యాలను వెల్లడిస్తామన్నారు. ఒక అబద్ధాన్ని పదేపదే ప్రస్తావించినంత మాత్రాన అది నిజం కాదని పేర్కొన్నారు. దీంతో సభ రేపటికి వాయిదాపడుతున్న సమయంలో ఖర్గే రఫేల్‌పై చర్చ విషయంలో తేదీ, సమయాన్ని ప్రకటించాల ని స్పీకర్ సుమిత్రా మహజన్‌ను కోరారు. తేదీ, సమయాన్ని తాను నిర్ణయిస్తాను కాని ఈ విషయంలో ఒత్తిడి తేవద్దని ఖర్గేకు సూచించారు. 'మీ సవాళ్లు మీ దగ్గరే ఉంచుకోండి.. నన్ను మాత్రం సవాల్ చేయవద్దు' అని ఆమె ఖర్గేను ఉద్దేశించి పేర్కొన్నారు. లోక్‌సభలో అంతకుముందు జరిగిన చర్చలో రాఫెల్ ఒప్పందంలో కుంభకోణం దాగి ఉందని, దాని ధరను బహిర్గత పర్చడానికి బీజేపీ ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని ఖర్గే కేంద్రాన్ని ప్రశ్నించారు.

గ్యాస్ పేలుడులో నలుగురు దుర్మరణం

• శిథిలాల కింద మరో 50 మంది?

మాస్కో, డిసెంబర్ 31: రష్యాలోని ఒక నివాసిత భవనంలో కొత్త సంవత్సరం సంబరాల్లో మునిగి తేలుతున్న సమయంలో జరిగిన గ్యాస్ పేలుడు నలుగురి ప్రాణాలను హరించింది. ఈ సంఘటనలో దాదాపు 70 మంది ఆచూకీ లభ్యం కాలేదు. పారిశ్రామిక పట్టణమైన మాగ్నిటోగోర్స్క్‌కు 1700 కిలోమీటర్ల దూరంలోని యూరల్ కొండ ప్రాంతంలో గల తూర్పు మాస్కోలో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం దాదాపు 6 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. గ్యాస్ పేలుడుతో భవనంలోని చాలా భాగం కుప్పకూలింది. ఈ సంఘటనలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించగా తీవ్రంగా గాయపడిన ఇద్దరు చిన్నారులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. దాదాపు 70 మంది వరకు ఆచూకీ లభించలేదు. ఏడుగురు చిన్నారులు సహా 16 మందిని సంఘటన స్థలం నుంచి ఖాళీ చేయించారు. జాతీయ టెలివిజన్ కథనం ప్రకారం..దాదాపు 50 మంది వరకు శిథిలాల కింద చిక్కుకుపోయినట్టు తెలుస్తోంది. అయితే, ఎంతమంది అదృశ్యమైనదీ అధికారికరంగా వెల్లడికాలేదు. సంఘటన జరిగిన ప్రాంతంలో మైనస్ 18 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు ఉండడంతో సహాయక చర్యలు చేపట్టడంలో కాస్త జాప్యం జరుగుతోందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

రైతును ఆకట్టుకునేదెలా?

• నేరుగా నెలవారీ నగదు చెల్లింపు • ప్రభుత్వ సేకరణ-అమ్మకం ధర మధ్య తేడా భర్తీ

• బీమా పరిధిలోకి మరిన్ని పంటలు, కౌలు రైతులు • చురుగ్గా పరిశీలిస్తున్న సర్కార్

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: దేశ వ్యాప్తంగా రైతాంగంలో వెల్లువెత్తుతున్న ఆగ్రహాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి సత్వర ప్రాతిపదికన మేలు కలిగించేందుకు మూడు అంశాలను కేంద్ర ప్రభుత్వం చురుగ్గా పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. సంక్షోభంలో పడ్డ రైతాంగాన్ని ఆదుకోవడంతో పాటు రానున్న లోక్‌సభ ఎన్నికల్లో వీరి మద్దతును విశేషంగా చూరగొనే లక్ష్యంతోనే ఈ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్టు స్పష్టం అవుతోంది. వీటిలో మొదటిది రైతులకు నెలవారీ ఆదాయాన్ని కల్పించడం, రెండోది పంటల వాస్తవ అమ్మకం ధర ప్రభుత్వ సేకరణ ధరకు మధ్య ఉండే తేడాను భర్తీ చేయడం, మూడోది బీమాను రైతాంగానికి మరింత ప్రయోజనం కలిగేలా తీర్చిదిద్దడం. ప్రభుత్వం అంతిమంగా తీసుకునే నిర్ణయం ఈ మూడింటి మేలుకలయికగానో లేదా వీటిలో ఏదో ఒకటిగానో ఉండవచ్చునని అభిజ్ఞ వర్గాల కథనం. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పరాజయం చవిచూసిన నేపథ్యంలో రైతులకు నేరుగా నగదు లబ్ధి చేకూర్చాలన్న ఆలోచన తెరపైకి వచ్చింది. అత్యవసర ప్రాతిపదికన దిద్దుబాటు చర్యలు చేపట్టే అంశంపై ప్రధాని మోదీ దృష్టి పెట్టారు. ఆదాయ మద్దతు పథకంలో భాగంగా నెలవారీగా రైతులకు కొంత మొత్తాన్ని అందించవచ్చునని, దీని వల్ల 150 మిలియన్ల రైతు కుటుంబాలకు మేలు జరుగుతుందని చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించాలంటే దేశంలోని రైతుల మద్దతును గణనీయంగా పొందడం అత్యంత కీలకమన్న భావనతోనే బీజేపీ నాయకత్వం ముందుకు సాగుతోంది. అంచనా ఉత్పాదక వ్యయం కంటే 50 శాతం ఎక్కువ మొత్తాన్ని రైతులకు లభించే విధంగా పత్తి, సోయాబీన్, వరి మద్దతు ధరను కేంద్రం గత జూలై నెల్లో పెంచింది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మద్దతు లభించక పోవడంతో రైతులు అందినకాడికి ఉత్పత్తులను అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా సుధీర్ భార్గవ

• మరో నలుగురు కమిషనర్ల నియామకం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా సుధీర్ భార్గవను కేంద్రం నియమించింది. ఆయనతోపాటు నలుగురు కమిషనర్లను కూడా నియమించారు. భార్గవ ప్రస్తుతం ఇన్ఫర్మేషన్‌ను కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దీనితో ఇన్ఫర్మేషన్ కమిషన్‌లో సభ్యుల సంఖ్య 11కు చేరింది. ఈ నియామకాలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సోమవారం ఆమోదముద్ర వేశారు. నలుగురు కమిషనర్లలో యశ్వర్ధన్ కుమార్ సిన్హా (ఐఎఫ్‌ఎస్), వనజా ఎన్.శర్మా (మాజీ ఐఆర్‌ఎస్), నీరజ్ కుమార్ గుప్తా (మాజీ ఐఏఎస్), సురేష్ చంద్ర (మాజీ లా సెక్రటరీ) ఉన్నారు. యశ్వర్ధన్ కుమార్ సిన్హా 1981 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ అధికారి. యునైటెడ్ కింగ్‌డమ్‌లో భారత హైకమిషనర్‌గా విధులు నిర్వహించారు. విదేశాంగ మంత్రిత్వ శాఖలో అనేక కీలక పదవుల్లో పని చేశారు. కమిషనర్లలో ఒకే ఒక మహిళ వనజా ఎన్.శర్మా. 1980 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ అధికారిణి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్, కస్టమ్స్ చీఫ్‌గా విధులు నిర్వహించారు. 1982 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి నీరజ్ కుమార్. ఇన్వెస్ట్‌మెంట్, పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ విభాగంలో కార్యదర్శిగా విధులు నిర్వహించారు. సురేష్ చంద్ర ఇండియన్ లీగల్ సర్వీస్ అధికారిగా 2002-2004లో విధులు నిర్వహించారు. న్యాయ శాఖ మంత్రిగా అరుణ్ జైట్లీ వద్ద కార్యదర్శి హోదాలో పనిచేశారు. వీరంతా ఈ ఏడాదిలోనే రిటైరయ్యారు. చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా పనిచేసిన ఆర్.కే.మాథుర్‌తోపాటు కమిషనర్లు యశోవర్ధన్ ఆజాద్, శ్రీధర్ ఆచార్యులు, అమితవ భట్టాచార్య ఇటీవలే పదవీ విరమణ చేశారు. అయితే వీరి నియాకాల్లో ఆలస్యం జరుగుతుడడంతో ఈ ఖాళీలను భర్తీచేయాలని కొంతమంది ఆర్టీఐ కార్యకర్తలు సుప్రీంను ఆశ్రయించారు. వీరి నియామకాలు వెంటనే జరపరడంతోపాటు పారదర్శకత పాటించాలని సుప్రీం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీచేసింది.

లొంగిపోయిన సజ్జన్ కుమార్

• మండోలి జైలుకు పంపాలని మేజిస్ట్రేట్ ఆదేశం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసు (1984)లో యావజ్జీవ కారాగార శిక్ష పడిన కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకుడు సజ్జన్ కుమార్ సోమవారం ఢిల్లీ హైకోర్టులో లొంగిపోయాడు. సజ్జన్ కుమార్‌ను ఈశాన్య ఢిల్లీ ప్రాంతంలోని మండోలి జైలుకు పంపాలని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అదితి గార్గ్ ఆదేశించారు. తనను భారీ భద్రత మధ్య తిహార్ జైలుకు పంపాలని సజ్జన్ కుమార్ చేసిన విజ్ఞప్తిని మేజిస్ట్రేట్ తోసిపుచ్చారు. అయితే, ఒక ప్రత్యేక వాహనంలో తగిన భద్రతతో జైలుకు పంపించేందుకు మాత్రం కోర్టు అనుమతి ఇచ్చింది. సజ్జన్ కుమార్ తరపున వాదిస్తున్న లాయర్ కోర్టు రూమ్‌లో మాట్లాడుతూ సిక్కు వ్యతిరేక అల్లర్లతో సంబంధం ఉన్న మరో కేసులో సైతం సజ్జన్ కుమార్ నిందితుడిగా ఉన్న నేపథ్యంలో అతనిపై వ్యతిరేక వర్గం వారు దాడి చేసే అవకాశం ఉండడంతో తగిన భద్రతను కోరినట్టు తెలిపారు. పటిష్ట భద్రత మధ్య తనను తీహార్ జైలుకు తరలించాలన్న అభ్యర్థనను కోర్టు తిరస్కరించడంతో నిబంధనలకు అనుగుణంగా మండోలి జైలుకు తరలించేందుకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. లొంగిపోయేందుకు తనకు మరికొంత గడువు కావాలని సజ్జన్ కుమార్ డిసెంబర్ 21న చేసిన విజ్ఞప్తిపై డిసెంబర్ 31వరకు హైకోర్టు డెడ్‌లైన్ విధించింది. 73 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ మాజీ నేత సజ్జన్ కుమార్ తనకు హైకోర్టు విధించిన యావజ్జీవ కారాగారాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. సిక్కు వ్యతిరేక అల్లర్లలో దోషిగా నిర్ధారిస్తూ సజ్జన్ కుమార్‌కు డిసెంబర్ 17న ఢిల్లీ హైకోర్టు జీవిత ఖైదును విధించిన విషయం తెలిసిందే. ఈ శిక్ష ఖరారుతో సజ్జన్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు.

నిందితులెవర్నీ వదలం..

1984 సిక్కు వ్యతిరేక అల్లర్లతో సంబంధం ఉన్న ఏ ఒక్కరిని కూడా వదలబోమని పలువురు సిక్కు నాయకులు హెచ్చరిస్తున్నారు. ఈ అల్లర్లతో ప్రధాన బాధ్యుడిగా వెలుగులోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకుడు సజ్జన్ కుమార్‌కు కోర్టు యావజ్జీవ కారాగారాన్ని విధించడంతో తమకు చాలావరకు ఊరట లభించినా, ఈ సంఘటనతో సంబంధం ఉన్న వ్యక్తులందరికీ శిక్ష పడేవరకు తాము విశ్రమించబోమని వారు స్పష్టం చేశారు. సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగిన తర్వాత గత 34 ఏళ్లుగా తాము ఎన్నో పోరాటాలు చేస్తున్నామని, సజ్జన్ కుమార్‌కు హైకోర్టు జీవిత ఖైదు విధించడంతో తమకు ఎంతో ఊరట కలిగిందని శిరోమణి అకాలీదళ్ సభ్యుడు మన్‌జిందర్ సింగ్ సిర్సా తెలిపారు. కోర్టు తీర్పు 1984 నుంచి మిలియన్ల మంది ప్రజల హృదయాలకు కలిగిన దెబ్బ నుంచి ఉపశమనం కలిగిందని పేర్కొన్నారు. సజ్జన్ కుమార్ కోర్టులో లొంగిపోవడంతో పాటు అతనికి శిక్ష ఖరారు కావడం శుభపరిణామంగా పేర్కొన్నారు. అయితే, 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితులకు న్యాయం జరిగేవరకూ తాము విశ్రమించబోమని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ జాతీయ కార్యదర్శి ఆర్పీ సింగ్ పీటీఐ ప్రతినిధితో మాట్లాడుతూ సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కోర్టు తీర్పు సిక్కుల ఘన విజయంగా అభివర్ణించారు. అయితే, ఈ సంఘటనతో సంబంధం ఉన్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్, కాంగ్రెస్ నాయకుడు జగదీష్ టైట్లర్‌ను కూడా దోషులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రాజ్యసభలో 'తలాక్'

బిల్లుపై ఎలాంటి చర్చ జరగకుండానే వాయిదా

• సెలెక్ట్ కమిటీకి పంపించాలన్న విపక్షం • ససేమిరా అన్న అధికారపక్షం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: దేశంలోని కోట్లాది మంది ముస్లిం మహిళల ప్రయోజనాలు పరిరక్షించేందుకు ఉద్దేశించిన ట్రిపుల్ తలాక్ బిల్లుకు ప్రతిపక్షం మెజారిటీలో ఉన్న రాజ్యసభలో చుక్కెదురైంది. ట్రిపుల్ తలాక్ బిల్లును చేపట్టి చర్చ జరపకుండానే రాజ్యసభ బుధవారానికి వాయిదా పడింది. కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ ట్రిపుల్ తలాక్ బిల్లును ప్రతిపాదించేందుకు కూడా ప్రతిపక్షం సభ్యులు ససేమిరా అంగీకరించలేదు. ట్రిపుల్ తలాక్ బిల్లును నేరుగా రాజ్యసభ సెలెక్ట్ కమిటీకి పంపించాలంటూ తాము ప్రతిపాదించిన తీర్మానంపై చర్చ జరపాలని ప్రతిపక్షం నాయడు గులాం నబీ ఆజాద్, టీఎంసీ నాయకుడు డెరిక్ ఓబ్రేన్ డిమాండ్ చేశారు. లోక్‌సభ ఆమోదించిన సవరించిన ట్రిపుల్ తలాక్ బిల్లును న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సోమవారం రాజ్యసభలో ప్రతిపాదించేందుకు ప్రయత్నించినప్పుడు ప్రతిపక్షం దానిని కలిసికట్టుగా ప్రతిఘటించింది. ప్రతిపక్షం నాయకుడు గులాం నబీ ఆజాద్, ఉపనాయకుడు ఆనంద్ శర్మ, తృణమూల్ కాంగ్రెస్ పక్షం నాయకుడు డెరిక్ ఓబ్రేన్, పలువురు ఇతర సభ్యులు ట్రిపుల్ తలాక్ బిల్లును గట్టిగా వ్యతిరేకించారు. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించే సంప్రదాయాన్ని ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని గులాం నబీ ఆజాద్ తదితరులు ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రతిపక్షాల అభిప్రాయాలను పట్టించుకోకుండా ట్రిపుల్ తలాక్ బిల్లును బలవంతంగా ఆమోదింపజేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దీనితో సభలో గొడవ జరిగింది. అన్నాడీఎంకే సభ్యులు పోడియం వద్దకు వచ్చి కర్నాటక ప్రభుత్వం కావేరీ నదిపై చేపట్టిన మేకదాటు నీటిపారుదల ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు ఇచ్చారు. దీనితో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సింగ్ సభను పదిహేను నిమిషాలపాటు వాయిదా వేశారు. ఈ సమయంలో హరివంశ్ సింగ్ వివిధ పక్షాల నాయకులతో తన చాంబర్‌లో సమావేశమై సభను సజావుగా కొనసాగించే అంశంపై చర్చించారు. సభ తిరిగి సమావేశం కాగానే రవి శంకర్ ప్రసాద్ మరోసారి ట్రిపుల్ తలాక్ బిల్లును ప్రతిపాదించేందుకు ప్రయత్నించారు. తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరిక్ ఓబ్రేన్ లేచి బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలంటూ తాను ప్రతిపాదించిన తీర్మానం ఏమైందని ప్రశ్నించారు. గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ సవరించిన ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాల్సిందేనని స్పష్టం చేశారు. దీనికి పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి గోయల్ స్పందిస్తూ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలంటూ గులాం నబీ ఆజాద్ ప్రతిపాదించిన తీర్మానమేదీ ప్రభుత్వం వద్ద లేదన్నారు. గులాం నబీ ఆజాద్ స్పందిస్తూ టీఎంసీ నాయకుడు డెరిక్ ఓబ్రేన్ ప్రతిపాదించిన తీర్మానం ప్రతిపక్షం తీర్మానం కాదా? అని విజయ్ గోయల్‌ను నిలదీశారు. ట్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభ సెలెక్ట్ కమిటీకి పంపించాలన్న ప్రతిపక్షం డిమాండ్‌ను విజయ్ గోయల్ తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షం దురుద్దేశ్యంతో ఈ బిల్లును అడ్డుకుంటోంది.. బిల్లును ఆమోదించడం కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలకు ఇష్టం లేదని ఆయన ఆరోపించారు. దేశంలోని కోట్లాది మంది ముస్లిం మహిళల ప్రయోజనాలను పరిరక్షించేందుకు సంబంధించిన బిల్లును ప్రతిపక్షం సమర్థించాల్సింది పోయి వ్యతిరేకించటం ఎంతమాత్రం మంచిది కాదని అన్నారు. దీనికి గులాం నబీ ఆజాద్ స్పందిస్తూ బిల్లును తాము వ్యతిరేకించటం లేదు.. బిల్లుపై కూలంకషంగా చర్చ జరిపేందుకు దీనిని సెలెక్ట్ కమిటీకి పంపించాలని అడుగుతున్నామని వివరించారు. బిల్లు ఇదివరకే సెలెక్ట్ కమిటీకి వెళ్లివచ్చింది.. గత సెలెక్ట్ కమిటీ చేసిన సిఫారసులను బిల్లులో పొందుపరిచి సవరించిన బిల్లును మొదట లోక్‌సభలో ప్రతిపాదించాం.. లోక్‌సభ ఆమోదం లభించిన తరువాతనే రాజ్యసభకు తెస్తున్నామని గోయల్ వివరించారు. అయితే ప్రతిపక్షం ఈ వాదనతో ఏకీభవించలేదు. ట్రిపుల్ తలాక్ బిల్లును మొదట రాజ్యసభ సెలెక్ట్ కమిటీకి పంపించవలసిదేనని గులాం నబీ ఆజాద్, డెరిక్ ఓబ్రేన్ స్పష్టం చేశారు. మొత్తం ప్రతిపక్షమంతా ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తోందని గులాం నబీ ఆజాద్ స్పష్టం చేశారు. ఇదే సమయంలో అధికార, విపక్షాల మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. ఈ గందరగోళంతో డిప్యూటీ చైర్మన్ సభను బుధవారం ఉదయం పదకొండు గంటల వరకు వాయిదా వేసి వెళ్లిపోయారు. నూతన సంవత్సరం మూలంగా రాజ్యసభకు మంగళవారం సెలవు ప్రకటించారు.

సవరణలు చేయాల్సిందే : సుజనా చౌదరి

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: రాజ్యసభలో కేంద్రం ప్రతిపాదించిన ట్రిపుల్ తలాక్ బిల్లులోని కొన్ని అంశాలకు సవరణలు చేయాలని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సూచించారు. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు సుజనా చౌదరి మాట్లాడుతూ తలాక్ బిల్లు లోపభూయిష్టంగా ఉందని, ఆ బిల్లును సవరించాల్సిందేనని తెగేసి చెప్పారు. ఈ బిల్లును రాజ్యసభలో చాలాపార్టీలు వ్యతిరేకిస్తున్నాయని, దీన్ని సెలెక్ట్ కమిటీకి పంపాల్సిందేనని డిమాండ్ చేశారు. ఎన్డీయే ప్రభుత్వం లోక్‌సభలో బలవంతంగా ఈ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించిందని, రాజ్యసభలో బిల్లుకు ఆమోదం తెలిపేముందు అందులోని కొన్ని అంశాలకు సవరణలు చేయాలని అన్నారు. ఆ సవరణలు చేయనిపక్షంలో దీన్ని అడ్డుకుని తీరుతామని సుజనా చౌదరి స్పష్టం చేశారు. లోక్‌సభ సభ్యుడు కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ ముస్లిం మహిళలకు న్యాయం చేయడానికి ఆ మతంలోని పురుషులకు అన్యాయం చేయవద్దని కేంద్రానికి సూచించారు. స్త్రీ పురుషులకు సమాన న్యాయం జరిగేలా బిల్లు ఉండాలని కేంద్రాన్ని కోరారు. ఈ బిల్లును చట్టం చేయడానికి ముందు కేంద్ర ప్రభుత్వం మరింత అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఈ బిల్లును చట్టం చేసే ముందు ముస్లిం దేశాలలో ఆయా చట్టాలను క్షుణంగా పరశీలించాకే బిల్లుకు రాజ్యసభలో ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎవరినీ ప్రలోభ పెట్టడం లేదు

• కర్నాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు లంచం ఆరోపణపై యెడ్యూరప్ప

బెంగళూరు, డిసెంబర్ 31: కర్నాటకలో అధికారంలో ఉన్న జేడీ (ఎస్)-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోయడానికి తమ పార్టీ ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని బీజేపీ నేత, మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యెడ్యూరప్ప ఖండించారు. సంకీర్ణ ప్రభుత్వానికి చెందిన కొందరు నేతలను బీజేపీ ప్రలోభపెడుతోందని మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన ఆరోపణలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ సంకీర్ణ ప్రభుత్వాన్ని పడగొట్టాల్సిన అవసరం తమకు లేదని, ఆ రెండుపార్టీల మధ్య ఉన్న పొత్తు దానికదే విచ్ఛిన్నమవుతుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరికీ 25 నుంచి 30 కోట్ల రూపాయలు ముట్టచెబుతామని బీజేపీ బేరసారాలు ఆడుతోందని, అక్రమ మార్గంలో అధికారంలోకి రావాలని ప్రయత్నం చేస్తోందని ఆదివారం సిద్ధరామయ్య ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన యెడ్యూరప్ప 'ఆయన (సిద్ధరామయ్య) నిత్యం ఇలాంటి అసత్య ఆరోపణలు ఎందుకు చేస్తున్నారు? మేము మళ్లీమళ్లీ చెబుతున్నాం.. కర్నాటకలోని సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోయాల్సిన అవసరం మాకు లేదు' అని ఆయన స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఏమన్నా సాక్ష్యాలు ఉంటే వెంటనే వాటిని చూపాలని డిమాండ్ చేశారు. స్థాయిని దిగజార్చుకుని ఆయన ఇలాంటి ఆరోపణలు చేయడం తగదని యెడ్యూరప్ప హితవు పలికారు. ప్రస్తుత ప్రభుత్వం అస్తవ్యస్తంగా ఉందని, ఎమ్మెల్యేలు, మంత్రులు ఏమాత్రం సంతృప్తిగా లేరని ఆయన అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ ప్రభుత్వాన్ని అస్థిరపర్చడానికి బీజేపీ ప్రయత్నం చేయనక్కరలేదని పేర్కొన్నారు. ఏదిఏమైనా బీజేపీ జోక్యం లేకుండానే వచ్చే అసెంబ్లీ సమావేశాలకు ముందే పెనుమార్పు జరగవచ్చునని జోస్యం చెప్పారు. అసంతృప్త ఎమ్మె ల్యే రమేష్ జార్కిహోలి సహా కాంగ్రెస్‌తో గాని, జేడీ (యూ) పార్టీ ఎమ్మెల్యేలతో గాని తాము ఎలాంటి సంబంధం పెట్టుకోలేదని యెడ్యూరప్ప స్పష్టం చేశారు. సంకీర్ణ ప్రభుత్వం విచ్ఛిన్నమైతే బీజేపీ అధికారం చేపడుతుందా? అన్న ప్రశ్నకు 'అవకాశమిస్తే అధికారం చేపట్టకుండా ఉండటానికి మా ఎమ్మెల్యేలేమీ సన్యాసులు కాదు' అని యెడ్యూరప్ప వ్యాఖ్యానించారు.

ప్రత్యేక రైల్వే జోన్ ఏమైంది? : అవంతి

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని తెలుగుదేశం సభ్యుడు అవంతి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శ్రీనివాస్ సోమవారం లోక్‌సభ జీరో అవర్‌లో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక రైల్వే జోన్ ఇస్తామంటూ రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోరా అని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. విజయవాడ, గుంటూరు, గుంతకల్, వాల్తేర్ డివిజన్లతో ప్రత్యేక రైల్వే జోన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన మాట మరిచారా అని ఆయన వ్యంగ్య బాణాలు విసిరారు. విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయాలని గత పదేళ్లనుండి డిమాండ్ చేస్తున్నా కేంద్రం పట్టించుకోకపోవటం సిగ్గుచేటని శ్రీనివాస్ విమర్శించారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ నుండి అత్యధిక ఆదాయం వస్తోంది, వాల్తేర్ డివిజన్ నుండి రూ.6,280 కోట్ల ఆదాయం ఈస్ట్‌కోస్ట్ డివిజన్‌కు వస్తోందని ఆయన చెప్పారు. విశాఖపట్నానికి సహజసిద్ధ ప్రయోజనాలున్నాయి.. ఇక్కడ రెండు పెద్ద ఓడరేవులున్నాయి. అతిపెద్ద భూబ్యాంకు ఉన్నది. వీటితోపాటు ఇక్కడ అతిపెద్ద లోకోషెడ్, నాణ్యమైన కోచ్ నిర్వహణ డిపో ఉన్నాయని అవంతి శ్రీనివాస్ వివరించారు. ఆసియా మొత్తంమ్మీద అతివేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నం నగరంలో తూర్పు నావికాదళ కేంద్రం, ఎన్ఎస్‌టీఎల్, బీహెచ్ఈఎల్, బార్క్, హెచ్‌పీసీఎల్ రిఫైనరీ, హిందుజా విద్యుత్ కేంద్రం ఉన్నాయి. వీటితోపాటు ప్రస్తుత వాల్తేర్ డివిజన్‌లో వైద్య, విద్య, క్రీడా సౌకర్యాలు, మౌళిక సదుపాయాలు ఉన్నాయని అన్నారు.

రక్షణ ఒప్పందాల్లో సోనియా, రాహుల్ జోక్యం లేదు

• స్పష్టం చేసిన మాజీ మంత్రి ఆంటోని

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: యూపీఏ ప్రభుత్వ హయాంలో జరిగిన రక్షణ ఒప్పందాల్లో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ గాని, రాహుల్‌గాంధీ గాని ఎన్నడూ జోక్యం చేసుకోలేదని కేంద్ర రక్షణశాఖ మాజీ మంత్రి ఏకే ఆంటోని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఆవరణలో సోమవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కొనుగోలు వ్యవహారంలో బీజేపీ ప్రభుత్వం అసత్యాలను పుట్టిస్తోందని విమర్శించారు. అబద్ధపు ప్రచారాలతో బీజేపీ ప్రభుత్వం కొన్ని సంస్థలను తప్పుబడుతోందని, ఏమీ లేకపోయినా ఏదో ఉందనేలా అబద్ధాలు సృష్టిస్తూ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన అన్నారు. తాను రక్షణ మంత్రిగా వ్యవహరించినంత కాలం సోనియా గాని, రాహుల్ గాని రక్షణ ఒప్పందాల్లో ఎన్నడూ వేలుపెట్టలేదని ఆయన స్పష్టం చేశారు. వారి ఆరోపణల్లో లేశమాత్రమైనా నిజం లేకున్నా కక్షపూరిత రాజకీయాలతో బీజేపీ తమ పార్టీపై ఆరోపణలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కొనుగోలులో అక్రమాలు జరిగినట్టు వెలుగుచూసిన వెంటనే అప్పటి యూపీఏ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతేకాకుండా ఆ కంపెనీనీ బ్లాక్‌లిస్టులో పెట్టామన్నారు. అంతేకాకుండి మిలాన్ కోర్టులో ఆ కంపెనీకి వ్యతిరేకంగా అసాధారణ రీతిలో న్యాయపోరాటం చేసి గెలిచామని ఆయన చెప్పారు. తర్వాత ఆ కంపెనీతో ఒప్పందాన్ని రద్దు చేసుకున్నామని, తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆ కంపెనీపై ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదని పైగా, ఆ కంపెనీకి అనుకూలంగా వ్యవహరించిందన్నారు. దీని నుంచి బయటపడటానికి ఆ పార్టీ కాంగ్రెస్‌పై లేనిపోని ఆరోపణలకు పాల్పడుతోందని, నిజంగా తాము ఇందులో అక్రమాలకు పాల్పడ్డామని వారు భావిస్తే కేంద్రంలోఅధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వెంటనే దీనిపై సీబీఐ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పుడు పూర్తి వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆంటోని అన్నారు. రాఫెల్ కుంభకోణంపై జేపీసీ వేయాలని తాము చేస్తున్న డిమాండ్‌ను పక్కదోవ పట్టించడానికే బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్‌పై అసత్య ఆరోపణలు చేస్తోందని ఆంటోని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో మీడియాలో కాని, మరోచోట కాని ఏమన్నా ఆరోపణలు వచ్చిన వెంటనే తాము చర్యలు చేపట్టేవారమని, అవసరమైతే విచారణ జరిపేవారమన్నారు.

కారిన్యం కరిగిపోయింది!

❖ గుక్క పెట్టిన అనాధ పాప..పాలుపట్టిన పోలీసమ్మ ❖ మాటలకందని మానవీయత ❖ పోలీసు దంపతులకు ప్రశంసల జల్లు

హైదరాబాద్, డిసెంబర్ 31: పేగు తెంచుకుని పుట్టిన పిల్లలు వద్దంటూ పారేసే వారు కొందరైతే...విదేశీ సంస్కృతికి అలవాటు పడి శిశువులకు సైతం పాలు పట్టని తల్లులున్న ఈ రోజుల్లో.. గుక్కపట్టి ఏడుస్తున్న ఓ పాసిపాపకు ఓ మహిళా కానిస్టేబుల్ పాలు పట్టి 'కంటేనే అమ్మ..'కాదన్న మాతృత్వ భావనను చాటిచెప్పారు. పోలీసులంటే కర్కశ మనస్తత్వం కల్గిన వారే కాదని, వారిలోనూ మానవత్వం ఉందని నిరూపించిన ఈ ఘటన హైదరాబాద్‌లోని అఫ్జల్‌గంజ్ పోలీస్స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి తొమ్మిదిన్నర గంటల ప్రాంతంలో ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి వద్ద యాకుత్‌పురా ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇర్ఫాన్ అనే వ్యక్తి నిల్చున్నాడు. అంతలో అక్కడకు మద్యం సేవించి ఓ మహిళ రెండు సంవత్సరాల పాపతో వచ్చింది. ఆ పాపను ఇర్ఫాన్‌కు అప్పగించి ఇప్పుడే వస్తానని వెళ్లిపోయింది. ఆమె వెళ్లిపోయిన కొద్ది సేపటికే పసిపాప గుక్కపట్టి ఏడవటం మొదలుపెట్టింది. దీంతో ఏం చేయాలో తెలియని ఇర్ఫాన్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చాడు. దీంతో అఫ్జల్‌గంజ్ పోలీసులు కంట్రోల్ నుంచి కాల్ రిసీవ్ చేసుకుని రవీందర్ అనే కానిస్టేబుల్ ఫోన్‌లో మాట్లాడాడు. సమాచారం తెల్సుకున్న రవీందర్ హుటాహుటీన ఉస్మానియాకు చేరుకున్నాడు. గుక్కపట్టి ఏడుస్తున్న పాపను తీసుకుని రవీందర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. పాప ఏడుపు మాన్పించేందుకు పోలీసులు స్నాక్స్, బిస్కట్లు వంటివి తెచ్చి తినమని బుజ్జగిస్తూ చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. దీంతో ఆ పాప తల్లిపాల కోసం ఎడుస్తున్నట్లు గుర్తించిన రవీందర్ రాత్రి పదకొండున్నర గంటల సమయంలో వెంటనే తన ఇంటికి ఫోన్ చేసి భార్య ప్రియాంకను అర్జెంటుగా అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించాడు. బేగంపేటలోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆయన భార్య ప్రియాంక, స్టేషన్‌కు రాగానే పసిపాప ఏడుస్తుండటాన్ని చూసి కరిగిపోయింది. రవీందర్ జోక్యం చేసుకుని పాపకు పాలుపట్టమని కోరడంతో ప్రియాంక ఆలస్యం చేయకుండా పాలుపట్టి అమ్మతనాన్ని అందించింది. అరగంట సేపు ఆ తల్లిపాలు తాగిన చిన్నారి ఆ తర్వాత ఒక్కసారిగా ఏడుపు మానింది.



మహిళా కానిస్టేబుల్ ప్రియాంక, అమె భర్త రవీందర్‌తో పాటు చిన్నరి బాలికను అభినందిస్తున్న హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్

నా బిడ్డలా భావించా: ప్రియాంక

స్టేషన్‌కు రాగానే పాప ఏడుస్తుంటాన్ని గమనించిన తాను ఆ పాపను తన బిడ్డలా భావించి పాలు పట్టానని ప్రియాంక వివరించారు. ఏ మాత్రం వెనకా ముందు ఆలోచించకుండా పాపను ఏడుపు మాన్పించేందుకు పాలు పట్టడం మినహా వేరే మార్గం లేదని ఓ తల్లిగా తనకు అనిపించిందని చెప్పారు.


పోలీసులను గెలిపించింది: సీపీ అంజనీకుమార్

గుక్కపట్టి ఏడుస్తున్న ఓ పాసిపాపను స్టేషన్‌కు తీసుకువచ్చి, తన భార్యను పిలిపించి పాలు పట్టించిన రవీందర్, ఆయన భార్య ప్రియాంకను హైదరాబాద్ పోలీసు కమిషనర్ అంజనీకుమార్ ప్రత్యేకంగా అభినందించారు. వారిద్దర్ని బషీర్‌భాగ్‌లోని పోలీస్ కమిషనరేట్‌కు పిలిపించి కమిషనర్, ఈస్ట్ జోన్ డీసీపీ రమేష్, సుల్తాన్‌బజార్ ఏసీపీ చేతన ప్రత్యేకంగా అభినందించారు. 2018లో తాము నేరాలు తగ్గించామని, శాంతిభద్రతలను పరిరక్షించామని గొప్పగా చెప్పుకున్న నగర పోలీసుల ఖ్యాతిని ప్రియాంక మరింత చాటిందని వ్యాఖ్యానించారు. పోలీసులు ఈ రకంగా కూడా ప్రజలకు సేవ చేస్తారని నిరూపించిన ప్రియాంకకు కృతజ్ఞతలు తెలిపారు. కానిస్టేబుల్ రవీందర్, అతని భార్య ప్రియాంకను అఫ్జల్ గంజ్ ఇన్‌స్పెక్టర్ జీ.వెంకటేశంతో పాటు సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది అభినందించి ప్రశంసల జల్లు కురిపించారు.

అతి వేగం.. నలుగుర్ని చిదిమేసింది!

గుంటూరు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం ◆ నలుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు దుర్మరణం
170కిలోమీటర్ల వేగంతో డివైడర్, లారీని ఢీకొన్న కారు ◆ లారీ బోల్తా.. డ్రైవర్, క్లీనర్‌కూ తీవ్ర గాయాలు

గుంటూరు, డిసెంబర్ 31: గుంటూరు నగరానికి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగానికి నలుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. గుంటూరు-చిలకలూరిపేట జాతీయ రహదారిపై గుంటూరు రూరల్ లాలుపురం వద్ద సోమవారం 170 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన కారు మలుపువద్ద అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొని, అంతే వేగంతో ముందుగా వెళుతున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. కారు ఢీకొట్టిన వేగానికి లారీ సైతం బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో నగరానికి సమీపంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్సకోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఒకే కారులో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేందుకు విజయవాడ వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదంలో గుంటూరు విద్యానగర్‌కు చెందిన ధనుష్, పెదకూరపాడు మండలం కంభంపాడుకు చెందిన సాయిరామ్, శావల్యాపురానికి చెందిన కోటేశ్వరరావు, గఫూర్ అనే మరో విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన శివాజీ, కౌశిక్ గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో, హీరేంద్ర నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరంతా 19, 20 సంవత్సరాల్లోపు వయస్సువారే. కారు ఢీకొన్న ధాటికి లారీ బోల్తాపడటంతో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని జిల్లా అర్బన్ ఎస్పీ సీహెచ్ విజయారావు సందర్శించారు. మృతదేహాలను జీజీహెచ్‌కు తరలించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాద తీవ్రతకు నుజ్జునుజ్జయిన కారు

మీడియా అకాడమీ కొత్త భవనానికి రూ.15 కోట్లు

త్వరలో శంకుస్థాపన ★ మరణించిన 150 మంది జర్నలిస్టులకు రూ.1.50 కోట్లు ★ అనారోగ్యానికి గురైన వారికి రూ.26 లక్షలు
జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.34.50 కోట్ల విడుదల ★ చైర్మన్ అల్లం నారాయణ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: తెలంగాణ మీడియా అకాడమీ భవనానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. సమాచార భవన్‌లోని బోర్డు రూంలో సోమవారం జరిగిన మీడియా అకాడమీ పాలకమండలి సమావేశంలో మాట్లాడుతూ, పాతభవనం కూల్చివేత పూర్తయిందని, సీఎం కేసీఆర్ అనుమతి తీసుకుని కొత్త భవనానికి శంకుస్థాపన చేస్తామన్నారు. కొత్త భవనం పూర్తయితే వందకోట్ల నిధి నుండి ఇదే భవనంలో జర్నలిజం కోర్సును ప్రారంభిస్తామన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం వందకోట్ల రూపాయలు ఇస్తామంటూ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు 34.50 కోట్ల రూపాయలు విడుదల చేశారన్నారు. ఏడాది కాలంలో మీడియా అకాడమీ భవన నిర్మాణం పూర్తి చేసి, జర్నలిజం కోర్సును ప్రారంభిస్తామన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న జర్నలిస్టుల్లో ఇటీవల మరణించిన 47 మంది జర్నలిస్టులపేరుతో వారి కుటుంబాలకు ఆర్థిక సాయం మంజూరు చేశారు. మరణించిన జర్నలిస్టుల పేరుతో వారి కుటుంబానికి లక్ష రూపాయల నగదు ఇస్తున్నామని, అలాగే నెలకు మూడువేల రూపాయల చొప్పున ఐదేళ్లపాటు పింఛన్ కూడా ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు మరణించిన 150 మంది జర్నలిస్టుల పేరుతో వారి కుటుంబాలకు మీడియా అకాడమీ తరపున ఆర్థికంగా చేయూత ఇచ్చామన్నారు. అలాగే తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న 16 మంది వర్కింగ్ జర్నలిస్టులకు 50 వేల రూపాయల చొప్పున సోమవారం మంజూరు ఇచ్చారు. ఇప్పటి వరకు 52 మంది జర్నలిస్టులకు 50 వేల రూపాయల చొప్పున 26 లక్షల రూపాయల మొత్తాన్ని అందించామని అల్లం నారాయణ వివరించారు.



మీడియా అకాడమీ పాలక మండలి సమావేశంలో పాల్గొన్న అల్లం నారాయణ తదితరులు

మీడియా అకాడమీ తరపున ఇప్పటి వరకు నిర్వహించిన జర్నలిస్టుల శిక్షణా తరగతుల్లో 5361 మంది లబ్ధి పొందారని అల్లం నారాయణ తెలిపారు. మీడియా అకాడమీ ప్రచురించిన తొమ్మిది రకాల పుస్తకాలను శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికీ అందించామన్నారు.

ఈ సమావేశంలో పాలక మండలి సభ్యులు మల్లెపల్లి లక్ష్మయ్య, కే. శ్రీనివాస్, కట్టా శేఖరరెడ్డి, గౌరీ శంకర్, టంకశాల అశోక్, సత్తిరెడ్డి, ఉదయ్ శంకర్, నాగయ్య కాంబ్లే, అకామడీ కార్యదర్శి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

బాబుతో జై తెలంగాణ అనిపించిన ఘనత కేసీఆర్‌దే..

ఆంధ్రభూమి బ్యూరో

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 31: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో 'జై తెలంగాణ' అనిపించిన ఘనత తమ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావుదేనని టీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్ గౌడ్ అన్నారు. ఆంధ్ర ప్రజలే చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన సోమవారం విలేఖరుల సమావేశంలో తెలిపారు. హైకోర్టు విభజనపై చంద్రబాబు ప్రజలను మోసగించేలా మాట్లాడారని ఆయన విమర్శించారు. హైకోర్టు విభజన తప్పదని తెలిసినా ఎన్నో కుట్రలు చేశారని ఆయన మండిపడ్డారు. చంద్రబాబుకు పూటకోమాట మాట్లాడే అలవాటు ఉందని, తమ నేత, సీఎం కేసీఆర్‌కు అటువంటి అలవాటు లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం లోగడ కాంగ్రెస్, టీడీపీతో పొత్తు పెట్టుకున్నామని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కేసీఆర్ దేశంలోని 36 పార్టీలను తెలంగాణకు అనుకూలంగా ఒప్పించి రాష్ట్రాన్ని సాధించారని ఆయన తెలిపారు. పరిపాలన అంటే ఎలా ఉండాలో కేసీఆర్‌ను చూసి నేర్చుకోవాలని ఆయన చంద్రబాబునుద్దేశించి అన్నారు.

మాకు సంస్కారం అడ్డొస్తోంది: టీడీపీ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావులా మాట్లాడేందుకు తమకు సంస్కారం అడ్డు వస్తున్నదని తెలంగాణ టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడునుద్దేశించి ముఖ్యమంత్రి కేసీఆర్ వాడిన భాష చాలా దారుణంగా ఉందని ఆయన సోమవారం ఆంధ్రభూమి ప్రతినిధితో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. ఏదైనా కేసీఆర్‌కు నచ్చకపోతే విమర్శించాలే తప్ప పరుష పదజాలం, మీడియ కూడా రాయలేని భాష, పదాలు వాడడం భావ్యం కాదన్నారు. తామూ మాట్లాడగలం కానీ సంస్కారం అడ్డు వస్తున్నదని ఆయన చెప్పారు. తామూ అలా మాట్లాడితే విలువ ఏముంటుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో యాగాలు చేసి, పండితులు, పీఠాధిపతుల నుంచి నేర్చుకున్నది ఇదేనా? అని ఆయన ప్రశ్నించారు. 1982 సంవత్సరంలో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగు దేశం పార్టీలో కేసీఆర్ చేరిన తర్వాత రాజకీయంగా ఎదిగారని ఆయన గుర్తు చేశారు. టీడీపీలో రాజకీయ అరంగేట్రం చేసిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా చంద్రబాబును విమర్శించడం విస్మయం కలిగిస్తున్నదని అన్నారు. చూసుకుందాం, రా అని తలసాని సవాల్ విసిరారని ఆయన తెలిపారు. కర్రు కాల్చి వాత పెడతారట, టీడీపీ నాయకులు, కార్యకర్తలంతా ఎక్కడికి రావాలో చెబితే అక్కడికి చేరుకుంటారని, వాత ఎలా పెడతారో తామూ చూస్తామని బక్కని నర్సింహులు ఎమ్మెల్యే తలసానిని హెచ్చరించారు.

1వ పేజీ తరువాయి

ఇక పంటల కాలనీలు

అవశ్యకత ఉందని ఆయన చెప్పారు. రైతులంతా ఒకే రకమైన పంటలు వేయడం వల్ల జరిగే లాభనష్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, రైతులను సంఘటిత పరచడం ద్వారానే గొప్ప ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు, సంబంధిత ఇతర శాఖలు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఆయన తెలిపారు. దీని కోసం ఏమి చేయాలో ఆలోచించాలని అన్నారు. దీని ద్వారా రైతుల్లో అశాంతి పూర్తిగా తొలగి పోతుందన్నారు. దీనికి మొదటి అడుగుగా రైతు సమన్వయ సమితుల ఏర్పాటు జరిగిందని, వాళ్ళకు క్రమపద్ధతిలో శిక్షణ ఇవ్వాలని అన్నారు. వ్యవసాయ విస్తరణాధికారులను నియమించడం జరిగిందని, భూమి లెక్కలు కూడా తేల్చడం జరిగినందున వ్యవసాయ అనుకూల భూమి ఎంత ఉందో తేలిందని ఆయన చెప్పారు.

ఏ పంటలు వస్తే లాభం కలుగుతుందో వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించి, నమ్మకం కలిగించాలని ఆయన సూచించారు. ముల్కనూరు గ్రామం అనుభవాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత అశోక్ గులాటీని ఇటీవల ఢిల్లీలో తాను కలిసినప్పుడు ఈ విషయాలపై వర్క్ షాప్ నిర్వహించాల్సిందిగా ఆహ్వానించానని, త్వరలోనే మన రాష్ట్రానికి వస్తారని కేసీఆర్ తెలిపారు.

వీడిన బంధం

ఇతర మౌలిక వసతులు పూర్తయ్యే వకరూ హైకోర్టు విభజనను వాయిదా వేయాలని కూడా న్యాయవాదుల సంఘం కోరింది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు జనవరి 2వ తేదీన సాధారణ విచారణ చేపడతామని పేర్కొంది. అయితే ఏపీ హైకోర్టు న్యాయవాదులు దాఖలుచేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం తరపున న్యాయవాదులు కేవియట్‌ను దాఖలు చేశారు. హైకోర్టు విభజన అవసరమేనంటూ తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది.

న్యాయవాదుల ఆందోళన

కొద్ది రోజులు తమకు గడువు కావాలని కొంతమంది ఆంధ్రా న్యాయవాదులు, రాయలసీమ న్యాయవాదులు సైతం డిమాండ్ చేస్తూ హైకోర్టు విభజనను నిరసిస్తూ వారంతా ఆందోళనకు దిగారు. రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని కోరుతూ హైకోర్టు వద్ద రాయలసీమకు చెందిన న్యాయవాదులు డిమాండ్ చేశారు. రాష్ట్రపతి నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హైకోర్టు విభజనకు కొంత సమయం కావాలని కోరుతూ ఏపీ న్యాయవాదులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరించడంతో విభజనకు లైన్ క్లియరైనట్టయింది. దీంతో ఏపీకి చెందిన న్యాయవాదులు, న్యాయసిబ్బంది అమరావతికి తరలివెళ్లక తప్పలేదు. ఇదిలా ఉండగా సహచర ఉద్యోగులు తరలివెళ్లడంతో హైకోర్టు వద్ద ఉద్విగ్న పరిస్థితి ఏర్పడింది. కొందరు న్యాయమూర్తులు తమ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఏపీకి తరలివెళ్తున్న న్యాయవాదులకు తెలంగాణ సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో మంగళవారం నాడు ఏపీ న్యాయమూర్తులతో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కాగా ఏపీ ప్రభుత్వం హైకోర్టు న్యాయమూర్తులకు తాత్కాలికంగా ఒక హోటల్‌లో బస ఏర్పాట్లు చేసింది.

తగ్గిన ఎల్‌పీజీ ధరలు

వంట గ్యాస్ ధరల తగ్గేందుకు దోహదం చేసిందని తెలిపింది. అంటే సబ్సిడీ రహిత వంట గ్యాస్ ధర ఇక దేశ రాజధానిలో సిలిండర్‌పై రూ.689గా ఉంటుంది. డిసెంబర్ 1న ఈ గ్యాస్ ధరను సైతం సిలిండర్‌పై 133 రూపాయలు తగ్గించడం జరిగింది. ప్రతి వినియోగదారునికి యేడాదికి పన్నెండు సిలిండర్లు సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన సబ్సిడీ సొమ్ము నేరుగా బ్యాంకుల్లో జమవుతోంది.

తక్షణ విచారణకు నో

ఏపీ న్యాయవాదుల పిటిషన్‌పై సుప్రీం

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న భవనం పూర్తయ్యే వరకు హైదరాబాద్ నుంచి హైకోర్టు తరలింపు నిర్ణయం వాదా వేయాలని ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు విభజనపై అత్యవసరంగా విచారణ చేపట్టాలని ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం న్యాయవాదులు కె.సీతారాం, కె జగన్మోహన్‌రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించినప్పటికి, అత్యవసర విచారణ చేపట్టలేమని స్పష్టం చేసింది.

ఈ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు న్యాయవాదుల తరపున సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ వద్ద అడ్వొకేట్ అన్ రికార్డ్సు ప్రవీణ్ చతుర్వేది పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ హౌస్‌మోహన్‌గా స్వీకరించాలని రిజిస్ట్రార్‌ను కోరారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఉదయం సుప్రీంకోర్టు రిజిస్ట్రీ కార్యాలయంలో పిటిషన్ దాఖలు చేయాలని సూచించారు. దీంతో సోమవారం ఈ పిటిషన్ దాఖలు కాగా రిజిస్ట్రి అధికారులు పిటిషన్ స్వీకరించి నంబరు ఇచ్చి జనవరి 2న విచారణ జాబితాలో చేరుస్తున్నట్టు వెల్లడించారు. దీంతో హైకోర్టు విభజనుకు అడ్డకులు తొలిగినట్టు అయింది. ఉమ్మడి హైకోర్టు విభజన ప్రక్రియ యథాతథంగా కొనసాగనుంది.

కేంద్రం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం రెండు హైకోర్టు విభజన జరగనుంది. మంగళవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అలాగే హైకోర్టు తరలింపునకు సంబంధించి ఎలాంటి పిటిషన్ దాఖలైన తమకు తెలిజేయాలని సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం కెవియేట్ దాఖలు చేసింది. అమరావతిలో ఏపీ హైకోర్టు భవనాలు పూర్తిస్థాయిలో నిర్మాణాలు పూర్తయ్యే వరకు ఏపీ హైకోర్టు తరలింపు గెజిట్ నోటిఫికేషన్ అమలు నిలిపివేస్తూ స్టే ఇవ్వాలని, అమరావతిలోని పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ఏపీ న్యాయవాదులు పిటిషన్‌లో పేర్కొన్నారు.

మహారాష్ట్రకే ఐఎన్ఎస్ విరాట్

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: నౌక దళం సేవల నుంచి ఉపసంహరించిన విమాన వాహక యుద్ధ నౌక ఐఎన్ఎస్ విరాట్ ఆంధ్రప్రదేశ్ చేజారిపోయింది. విరాట్ తమ రాష్ట్రానికి అప్పగించాల్సిందిగా మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతిపాదనకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ వెల్లడించారు. రూ.850 కోట్లు వెచ్చించి ఐఎన్ఎస్ విరాట్‌ను హోటల్, మ్యూజియంగా మార్చడానికి ఆసక్త కనబరుస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం రక్షణ మంత్రిత్వశాఖకు ప్రతిపాదనలు పంపిన విషయం వాస్తవమేనా.. అదే నిజమైన ప్రతిపాదనకు సంపాదించిన వివరాలు ఏమిటని రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు.

విశాఖ-రాజమండ్రి టోల్ వసూళ్లు రూ.1775కోట్లు

విశాఖపట్నం-రాజమండ్రి మధ్య జాతీయ రహదారిపై ఉన్న మూడు ప్రధాన టోల్‌గేట్ల నుంచి ఇప్పటివరకు రూ.1775 కోట్ల టోల్ వసూలు చేసినట్లు ఉపరతల రవాణా శాఖ సహాయ మంత్రి మన్సుఖ్ మాండవీయ సోమవారం రాజ్యసభలో తెలిపారు.



తూర్పుగోదావరి జిల్లా కడియంలోని సత్యదేవా నర్సరీలో బెంగుళూరు గులాబీ పూలతో నూతన సంవత్సర వేడుకలను చాటుతున్న దృశ్యం

ఎదురుచూస్తున్న విద్యా సమస్యలు

❖ ఇక విద్యారంగం సీఎం చేతిలోనేనా? ❖ వీసీలకు దిక్కులేని వర్శిటీలు ❖ అతీగతీలేని ఇసీలు, అకడమిక్ సెల్స్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: తెలంగాణ విద్యారంగం సంస్కరణలకు ఎదురుచూస్తోంది. రాష్ట్ర విభజన జరిగినా, సకాలంలో ఉన్నత విద్యామండలి , సీనియర్ అధికారులు స్పందించినా, సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. పాఠశాల విద్యలో ఉమ్మడి సర్వీసుల వివాదం, పదోన్నతులు, ఎంఈఓ, డీఈఓల పూర్తికాలిక నియామకాలు, సొంత భవనాలు నిర్మాణం జరగాల్సి ఉంది. నిరంతర మూల్యాంకన విధానాన్ని సమీక్షించాల్సి ఉంది. ఇక పాలిటెక్నిక్‌లు, ఐటీఐలు మౌలిక సదుపాయాల కొరతతోనూ, సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నెట్టుకొస్తున్నాయి. జూనియర్ కాలేజీల అనుబంధ వివాదం, ఫీజుల వివాదం ఉండనే ఉంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో , డిగ్రీ కాలేజీల్లో వేలాది పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. కాలేజీలకు ఇస్తున్న నిధులు చాలక విద్యార్థుల ఇబ్బందులు చెప్పనలవికానివిగా ఉన్నాయి. వృత్తి, సాంకేతిక విద్యాసంస్థల్లో ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్ల సమస్యలు షరామామూలే. చాలా కాలేజీలకు కనీసం కాంపౌండ్ గోడలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇక యూనివర్శిటీల్లో సీనియర్లు అంతా రిటైర్ అవుతున్నా, కేవలం కాంట్రాక్టు సిబ్బందితో చాలా డిపార్టుమెంట్లు కుంటినడక నడుస్తున్నాయి. వందేళ్ల ఉస్మానియా యూనివర్శిటీలో కొన్ని డిపార్టుమెంట్‌లలో కనీసం ఒక్కరు కూడా రెగ్యులర్ సిబ్బంది లేని దుస్థితి నెలకొంది. గత నాలుగైదు ఏళ్లుగా కొన్ని యూనివర్శిటీలు ఇన్‌ఛార్జి వీసీలతోనే నెట్టుకొస్తున్నాయి. ముఖ్యంగా శాతవాహన విశ్వవిద్యాలయం వీసీ నియామకానికి దరఖాస్తులు స్వీకరించి ఏడాది గడుస్తున్నా వాటి అతీగతీ లేకుండా పోయింది. దీనికి కారణం వీసీల నియామకాలపై రాష్ట్రప్రభుత్వం ఒంటెద్దుపోకడకు పోవడంతో వ్యవహారం సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. వీసీలుగా నియమితలైన వారి పదవీకాలం పూర్తయిన తర్వాత కూడా వారి నియామకాలను సుప్రీంకోర్టు రద్దు చేసినా ఆశ్చర్యపడక్కర్లేదని విద్యానిపుణులు చెబుతున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఏ యూనివర్శిటీలోనూ పీహెచ్‌డీ అడ్మిషన్లు సక్రమంగా జరగడం లేదు. మూడేళ్ల పీహెచ్‌డీ అడ్మిషన్లతో కాకతీయ యూనివర్శిటీ, ఉస్మానియా యూనివర్శిటీల్లో అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. చాలా వర్శిటీలకు కొత్తగా ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్ల నియామకాలు జరగలేదు. పూర్వ ఈసీ సభ్యులే నేటికీ కొనసాగుతున్నారు. అకడమిక్ బోర్డుల నియామకం జరగనే లేదు. ప్రతి ఏటా అనుబంధ గుర్తింపు పెద్ద వివాదమై కూర్చుంటున్నా, రెండు దశాబ్దాలు గడచినా, వర్శిటీలు గుణపాఠం నేర్చుకోకపోవడంతో సకాలంలో అడ్మిషన్లు జరగడం లేదు. ప్రవేశపరీక్షల నిర్వహణలో దేశానికే తెలంగాణ ఒక ఆదర్శ రాష్ట్రంగా ఉన్నా, అడ్మిషన్లు మాత్రం తీవ్రమైన జాప్యం జరుగుతున్నాయి. గత ఏడాది దోస్త్ అడ్మిషన్లలో కొన్ని సమస్యలను పరిష్కరించినా, ఈ ఏడాది మరింకొంత మెరుగుపరచాల్సి ఉంది. కేజీ టూ పీజీ ఉచిత విద్య అందని ద్రాక్షగా ఊరిస్తోంది. రాష్ట్రంలో ఆరు సంప్రదాయ వర్శిటీలు, 9 స్పెషాలిటీ వర్శిటీలు, ఒక టెక్నాలజీ వర్శిటీ, ఒక జాతీయ స్థాయి సంస్థ, మూడు సెంట్రల్ యూనివర్శిటీలు, రెండు డీమ్డ్ వర్శిటీలు పనిచేస్తున్నాయి. రాష్ట్ర సంప్రదాయ వర్శిటీలు మాత్రం సమస్యల కుప్పగా ఉన్నాయి. కొన్ని వర్శిటీల్లో ఒకొక్కరే మూడు నాలుగు పోస్టులకు ఇన్‌చార్జిలుగా ఉంటూ విద్యార్థులకు, సహ సిబ్బందికి దొరక్కుండా తప్పించుకుంటున్నారు. రానున్న రోజుల్లో విద్యాసంస్థలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని సీఎం చెప్పడంతో విద్యాసంస్థలు, ఉపాధ్యాయ సంఘాలు సంతోషాన్ని వ్యక్తం చేశాయి. కనీసం ముఖ్యమంత్రి స్వయంగా విద్యారంగాన్ని పర్యవేక్షించినా, మరింత మెరుగైన ఫలితాలను సాధించగలమని వారు చెబుతున్నారు.

క్రీడాభూమి

వన్డే, టెస్టు ఫార్మాట్లలో కోహ్లీ టాప్

• 2018 అత్యుత్తమ ఆటగాళ్ల జాబితా విడుదల చేసిన ఐసీసీ



ఇమ్రాన్ తాహిర్



రషీద్ ఖాన్



ఫఖర్ జమాన్





టామ్ లాథమ్



కగిసో రబడా



కేశవ్ మహరాజ్

దుబాయ్, డిసెంబర్ 31: వన్డే, టెస్ట్ ఫార్మాట్లలో 2018 సీజన్‌లో అత్యుత్తమంగా రాణించిన ఆటగాళ్ల వివరాలను ఐసీసీ సోమవారం అధికారికంగా విడుదల చేసింది. ఇందులో భాగంగా 2018లో అత్యధిక పరుగులు సాధించిన క్రికెటర్‌గా టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీని పేర్కొంది. కోహ్లీ మొత్తం 1202 పరుగులతో ఈ జాబితాలో ఉన్నాడు. జింబాబ్వేతో బులవాయోలో జరిగిన మ్యాచ్‌లో 210 పరుగులు చేసి ఒకే మ్యాచ్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా పాకిస్థాన్‌కు చెందిన ఫఖర్ జమాన్‌ను ఐసీసీ జాబితాలో చేర్చింది. అలాగే అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన రషీద్ ఖాన్ ఉండగా, బౌలింగ్‌లో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసిన ఆటగాడిగా దక్షిణాఫ్రికాకు చెందిన ఇమ్రాన్ తాహిర్ ఈ జాబితాలో చోటు సంపాదించుకున్నాడు. తాహిర్ జింబాబ్వేపై 24 పరుగులిచ్చి 6 వికెట్లు తీసుకున్నాడు.

ఇక టెస్టుల్లోనూ టీమిండియా కెప్టెన్ హవానే కొనసాగింది. 1322 పరుగులతో కోహ్లీ జాబితాలో చోటు దక్కించుకున్నాడు. ఇటీవల శ్రీలంకతో వెల్లింగ్టన్‌లో జరిగిన టెస్ట్ మ్యాచ్ డబుల్ సెంచరీ (264) చేసి 2018లో ఒకే మ్యాచ్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా టామ్ లాథమ్ నిలిచాడు. అలాగే ఈ ఏడాది టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా దక్షిణాఫ్రికాకు చెందిన కగిసో రబడా ఐసీసీ జాబితాలో చోటు దక్కించుకోగా, దక్షిణాఫ్రికాకే చెంది న కేశవ్ మహరాజ్ శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. ఈ మ్యాచ్‌లో కేశవ్ మహరాజ్ 129 పరుగులిచ్చి 9 వికెట్లు తీశాడు.



ఐసీసీ టీ20లో చోటు సంపాదించుకున్న హర్మన్ ప్రీత్ కౌర్, స్మృతీ మంధాన, పూనమ్ యాదవ్

ఐసీసీ టీ20 కెప్టెన్‌గా హర్మన్ ప్రీత్ కౌర్

• టీ20లో ముగ్గురు, వన్డేల్లో ఇద్దరికి చోటు

దుబాయ్, డిసెంబర్ 31: భారత మహిళా క్రికెటర్ హర్మన్ ప్రీత్ కౌర్ ఐసీసీ టీ20 కెప్టెన్‌గా ఎంపికైంది. ఈ ఏడాదికి గాను అత్యుత్తమ మహిళా క్రికెట్ జట్టును ఐసీసీ ఎంపిక చేయగా, టీ20 విభాగంలో హర్మన్ ప్రీత్ కౌర్‌ను కెప్టెన్ నియమించబడింది. ఈ మేరకు సోమవారం అత్యుత్తమ మహిళా వన్డే, టీ20 జట్లను ఐసీసీ ప్రకటించింది. టీ20 ఫార్మట్‌లో భారత్ నుంచి హర్మన్‌తో పాటు స్మృతీ మంధాన, పూనమ్ యాదవ్‌లకు మాత్రమే చోటు దక్కింది. వన్డేల్లో భారత్ నుంచి స్మృతీ మంధాన, పూనమ్ యాదవ్‌కు మాత్రమే చోటు దక్కింది. కాగా కెప్టెన్‌గా న్యూజిలాండ్ మహిళా క్రికెటర్ సుజీ బేట్స్ నియమించబడింది. 2018 గాను క్రీడాకారిణుల ప్రదర్శనలో భాగంగా మీడియా బ్రాడ్‌కాస్టర్స్ సభ్యులతో కూడిన బృందం విడివిడిగా రెండు అత్యుత్తమ జట్లను ఓటింగ్ ద్వారా ఎన్నుకుంది. నవంబర్‌లో జరిగిన ఐసీసీ మహిళల వరల్డ్ టీ20లో భారత జట్టు సెమీ ఫైనల్స్‌కు చేరడంలో హర్మన్ ప్రీత్ కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. టోర్నమెంట్‌లో కౌర్ 160.5 స్ట్రైక్‌రేట్‌తో 183 పరుగులు చేయగా, 2018లో 25 టీ20 మ్యాచ్‌లు ఆడి 126.1 స్ట్రైక్‌రేట్‌తో 663 పరుగులు చేసింది. మరోవైపు ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో కౌర్ మూడో స్థానంలో కొనసాగుతోంది.

ఐసీసీ మహిళల టీ20 జట్టు: హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్, భారత్). స్మృతీ మంధాన (భారత్), అలైస్సా హేలీ (ఆస్ట్రేలియా), సుజీ బేట్స్ (న్యూజిలాండ్), నాటేటీ స్కీవర్ (ఇంగ్లాండ్), ఎలైసె పెర్రీ (ఆస్ట్రేలియా), అష్లే గార్డనర్ (ఆస్ట్రేలియా), కాస్పెర్క్ (న్యూజిలాండ్), మెగాన్ స్కట్ (ఆస్ట్రేలియా), రుమానా అహ్మద్ (బంగ్లాదేశ్), పూనమ్ యాదవ్ (భారత్)

ఐసీసీ వన్డే జట్టు: సుజీ బేట్స్ (న్యూజిలాండ్), స్మృతీ మంధాన (భారత్), టామీ బీమౌంట్ (ఇంగ్లాండ్), డేన్‌వాన్ నీకెర్క్ (దక్షిణాఫ్రికా), సోఫీ డివైన్ (న్యూజిలాండ్), అలైస్సా హేలీ (వికెట్ కీపర్, ఆస్ట్రేలియా), మారింజన్నే కాప్ (దక్షిణాఫ్రికా), డాటిన్ (వెస్టిండీస్), సానా మిర్ (పాకిస్థాన్), సోఫీ ఎకేస్టోన్ (ఇంగ్లాండ్), పూనమ్ యాదవ్ (భారత్)

మొదటి మూడు వన్డేలకు కమిన్స్, స్టార్క్, హజెల్‌వుడ్‌కు విశ్రాంతి

మెల్‌బోర్న్, డిసెంబర్ 31: టీమిండియాతో జరగబోయే వన్డే సిరీస్‌లో మొదటి మూడు వన్డేలకు ఆస్ట్రేలియా సీమర్లు కమిన్స్, స్టార్క్, హజెల్‌వుడ్‌లకు విశ్రాంతి కల్పించనున్నారు. రానున్న కీలక సిరీస్‌ల దృష్ట్యా వారికి విశ్రాంతి కల్పించినట్లు కోచ్ జస్టిన్ లాంగర్ తెలిపారు. లాంగర్ సిడ్నీ హెరాల్డ్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 2019లో వరల్డ్ కప్‌తో పాటు పలు కీలక సిరీస్‌లు జరగనున్న నేపథ్యంలోనే వారికి విశ్రాంతి నిచ్చినట్లు స్పష్టం చేశారు. మరోవైపు కమిన్స్ నాణ్యమైన ఆటగాడని మూడు టెస్టుల్లో 20.07 యావరేజ్‌తో 14 వికెట్లు తీసిన విషయాన్ని గుర్తు చేశాడు.

సిడ్నీ టెస్టుకు రోహిత్ శర్మ దూరం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: టీమిండియా బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ ఆస్ట్రేలియాతో జనవరి 3నుంచి సిడ్నీలో ప్రారంభమయ్యే ఆఖరిది, నాలుగో టెస్టులో ఆడే అవకాశం లేదు. రోహిత్ భార్య ఆదివారం ముంబయిలో ఆడపిల్లకు జన్మనిచ్చిన నేపథ్యంలో ఆఖరి టెస్టును మిస్ అవుతున్నాడని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ప్రకటించింది. అంతేకాకుండా తండ్రిగా కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న రోహిత్‌ను బీసీసీఐ అభినందించింది. అయితే, జనవరి 12 నుంచి ఆతిథ్య జట్టుతో జరిగే మూడు వన్డే ఇంటర్నేషనల్ సిరీస్‌లో ఆడేందుకు వీలుగా జనవరి 8 నుంచి జట్టుకు అందుబాటులో ఉంటాడు. నాలుగో టెస్టులో రోహిత్ స్థానంలో ఎవరిని జట్టులోకి తీసుకునేది ఇంకా భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ప్రకటించలేదు.

‘ఫించ్‌ను పక్కన పెట్టండి’

మెల్‌బోర్న్, డిసెంబర్ 31: మొదటి మూడు టెస్టుల్లో విఫలమైన ఆస్ట్రేలియా ఓపెనర్‌ను నాలుగో టెస్టులో ఆడించొద్దంటూ మాజీ కెప్టెన్లు స్టీవ్ వా, రికీ పాంటింగ్ పేర్కొన్నారు. అతడి స్థానంలో ఆల్‌రౌండర్ మార్నస్ లాబుచాగ్నేను తీసుకోవాలని సూచించారు. ఓపెనర్లుగా హారిస్, షాన్ మార్ష్‌ను పంపించాలని, వీరి తర్వాత ఉస్మాన్ ఖ్వాజాను పంపితే ప్రత్యర్థి జట్టుపై భారీ చేసే అవకాశముంటుందని వా అభిప్రాయపడ్డాడు. నాలుగో స్థానంలో ట్రావిస్ హెడ్, ఆ తర్వాత కెప్టెన్ టిమ్ పైన్, లాబుచాగ్నేతో బ్యాటింగ్ బలంగా ఉంటుందన్నాడు. పాంటింగ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

బులియన్

ముంబయిలో	
బంగారం (22 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,066.00
8 గ్రాములు:	రూ. 24,528.00
10 గ్రాములు:	రూ. 30,660.00
100 గ్రాములు:	రూ. 3,06,600.00
బంగారం (24 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,279.144
8 గ్రాములు:	రూ. 26,233.152
10 గ్రాములు:	రూ. 32,791.440
100 గ్రాములు:	రూ. 3,27,914.40
వెండి	
8 గ్రాములు:	రూ. 332.20
10 గ్రాములు:	రూ. 415.00
100 గ్రాములు:	రూ. 4.150.00
ఒక కిలో:	రూ. 41,500.00

హైదరాబాద్‌లో	
బంగారం (22 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,017.00
8 గ్రాములు:	రూ. 24,136.00
10 గ్రాములు:	రూ. 30.170.00
100 గ్రాములు:	రూ. 3,01,700.00
బంగారం (24 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,226.738
8 గ్రాములు:	రూ. 25,813.904
10 గ్రాములు:	రూ. 32,247.35
100 గ్రాములు:	రూ. 3,22,673.30
వెండి	
8 గ్రాములు:	రూ. 332.20
10 గ్రాములు:	రూ. 415.00
100 గ్రాములు:	రూ. 4.150.00
ఒక కిలో:	రూ. 41,500.00.

ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఆస్తులు అమ్మకానికి..

❖ బ్యాంకు అప్పులు తీర్చేందుకు పాట్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: అప్పుల్లో కూరుకుపోయిన ది ఇన్ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఐఎల్ అండ్ ఎఫ్ఎస్) గ్రూప్ సంస్థ ఆస్తుల అమ్మకం ద్వారా నిధులు సమీకరించుకోవాలని నిర్ణయించింది. తద్వారా రుణాలను తీర్చాలని తీర్మానించింది. ఈ క్రమంలో ఈ సంస్థ ముంబయి, కేరళలో గల వాణిజ్య, నివాస ఆస్తుల విక్రయానికి టెండర్లు ఆహ్వానించింది. ముంబయిలోని మలబార్ హిల్స్ ప్రాంతంలో 1,376 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న మూడు వాణిజ్య స్థలాలను, అలాగే కోల్‌కతాలోని మరో వాణిజ్య పరమైన స్థలాన్ని ఈ సంస్థ విక్రయానికి పెట్టింది. జనవరి 15లోపు ఇందుకు సంబంధించిన బిడ్లు సమర్పించాల్సివుంది. ఇలా వుండగా ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంస్థ మొత్తం 91 వేల కోట్ల రూపాయల మేర బ్యాంకుల నుంచి రుణాలుగా పొందడం జరిగింది. ఈ అప్పులు మరోవిధంగా మార్పుచేసేందుకు సైతం వీలులేనివిగా మారడంతో ఇక తప్పని సరిగా తీర్చేందుకు ఆస్తుల అమ్మకమే శరణ్యమని యాజమాన్యం నిర్ణయించింది. ఇదివరకే ఈ సంస్థ అనేక రోడ్డు, సౌరశక్తి విభాగాలు, విద్యా సంస్థల ఆస్తులను విక్రయానికి పెట్టింది. అలాగే లగ్జరీ కార్లు, కార్యాలయ ఫర్నిచర్ తదితరాలను సైతం అమ్మకానికి పెట్టింది. కాగా తాజాగా ఈ కంపెనీ అమ్మజూపిన ఆస్తుల ద్వారా రూ.200 కోట్లు సమీకరించేందుకు వీలుందని విశ్వసనీయ వర్గాల సమాచారం.



హాంకాంగ్‌లోని హాంకాంగ్ బ్యాంక్ వద్ద కనిపిస్తున్న షేర్ల సూచీ. ఈ ఏడాది చివరి రోజైన సోమవారం హాంకాంగ్ షేర్ మార్కెట్ 1.3 శాతం లాభపడింది. అందులో భారత్ వాటా 0.3 శాతం కావడం విశేషం. భారీగా నష్టపోయిన దేశాల్లో ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉంది.

హెల్త్‌కేర్‌కు ఉజ్వల భవిత!

❖ 2019లో మరింత బలోపేతమయ్యే అవకాశం ❖ వేధిస్తున్న వైద్యులు, నర్సుల కొరత

❖ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో మరిన్ని భాగస్వామ్యాలు, విలీనాలు

❖ జీఎస్టీ, నగదు లావాదేవీలపై ఆంక్షలతో చిన్న సంస్థల మనుగడ ప్రశ్నార్థకం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: అత్యధిక పోటీ ఉన్న మార్కెట్లో కొత్త యేడాదిలో ఆరోగ్య సంరక్షణ (హెల్త్‌కేర్) రంగం మరింతగా బలపడే అవకాశాలున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ రంగంపై నియంత్రణను ప్రభుత్వం మరింత కఠినతరం చేసిన దృష్ట్యా చిన్నాచితకా వ్యాపారులు పోటీకి నిలవలేని పరిస్థితులు ఏర్పడవచ్చని అంటున్నారు. ఈ రంగంలో కొత్త సంవత్సరంలోప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాలు మరింతగా పెరగనున్నాయి. మలేషియాకు చెందిన ఐహెచ్‌హెచ్ హెల్త్‌కేర్ ఈ రంగంలో నెలల తరబడి గట్టిపోటీని ఎదుర్కొని సుమారు రూ.4వేల కోట్లతో ఫోర్టిస్‌లో 31 శాతాన్ని భాగస్వామి అయింది. మరో 26 శాతాన్ని సైతం కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేకేఆర్ వెన్నుదన్నుగా సాగుతున్న ఆస్పత్రి యాజమాన్య సంస్థ రేడియంట్ లైఫ్‌కేర్ త్వరలో మేక్స్ హెల్త్‌కేర్‌లో అత్యధిక వాటాలను తీసుకోనున్నట్లు ఇప్పటికే ప్రకటించడం జరిగింది. ఇలా ఈ రెండు సంస్థలూ ఏకమై సుమారు 7,242 కోట్ల రూపాయల విలువైన వ్యాపారాన్ని విస్తరించవచ్చని అంచనా వేస్తున్నాయి. ‘ఇప్పటికే మేము ఈరంగంలో అనేక విలీనాలు, సమీకరణలు చూశాం. అయితే పెద్ద సంస్థలు ఏకమై హెల్త్‌కేర్‌ను బలోపేతం చేయడం అరుదు’ అని మణిపాల్ హాస్పిటల్ ఛైర్మన్ హెచ్.సుదర్శన్ భల్లాయ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ పెట్టుబడుల సంస్థ టీపీజీ సహకారంతో నడుస్తున్న మణిపాల్ గ్రూప్ సైతం ఫోర్టిస్‌లో భాగస్వామి కావాలని ఆశిస్తోంది. డీమానిటరైజేషన్, జీఎస్టీ, నగదు లావాదేవీలపై నియంత్రణ వంటి అంశాలు చిన్న చిన్న వ్యాపార సంస్థల మనుగడకు విఘాతం కలిగించే అవకాశాలున్నాయని ఆయన అన్నారు. అయితే భవిష్యత్తులో హెల్త్‌కేర్ రంగంలో హైవాల్యూమ్, లోమార్జిన్ విభాగాలు ప్రభుత్వ చురుకైన పాత్రతో విశ్వవ్యాప్తమయ్యే అవకాలున్నాయని విశ్లేషించారు. వ్యక్తిగత నిర్వహణలోని కొన్ని చిన్నచిన్న సంస్థలు మూతపడవచ్చన్నారు. కాగా ఫోర్టిస్‌లో భాగస్వాములు కావడానికి ఐదు వ్యాపార సంస్థలు ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఇందులో మణిపాల్ గ్రూప్, ఐహెచ్‌హెచ్ హెల్త్‌కేర్ బెర్‌హాద్, చైనాకు చెందిన పెట్టుబడిదారు ఫోసున్ ఇంటర్నేషనల్, అంతర్జాతీయ ఈక్విటీ సంస్థ కేకేఆర్ సహకారం ఉన్న రేడియంట్ లైఫ్ ఉన్నాయి. అంతేకాకుండా భారత వాణిజ్య కుటుంబాల కన్సోర్టియం సైతం ఇందుకు ఆసక్తి కనబరుస్తుండటం గమనార్హం. ఇందులో హీరో ఎంటర్‌ప్రైజెస్‌కు ముంజాల్స్, దాబర్ సంస్థకు చెందిన బర్మన్స్ భాగస్వాములు. రేడియంట్ లైఫ్, మేక్స్ మధ్య డీల్ కొన్ని వరుస లావాదేవీల అనంతరం కుదురుతుందని, అలాగే రేడియంట్ లైఫ్‌కేర్ ప్రమోటర్ అభయ్ సోయ్ ఛైర్మన్‌గా కొనసాగనున్న కంబైన్డ్ సంస్థలో కేకేఆర్ మెజారిటీ షేర్ హోల్డర్ కానుంది. ఇలా విలీనమయ్యే ఈ సంస్థ దేశ వ్యాప్తంగా 16 ఆస్పత్రుల్లో 3,200 బెడ్లను నిర్వహించనుంది.

రానున్న సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాలు హెల్త్‌కేర్ రంగంలో ఏర్పడే అవకాశాలున్నాయని వోఖార్డిట్ హాస్పిటల్స్ ఎండీ జహాబియా కొరాకివాలా అభిప్రాయపడ్డారు. దీనిద్వారా ఆరోగ్య సంరక్షణ సమీప భవిష్యత్తులోనే విశ్వవ్యాప్తం అవుతుందని అంచనా వేశారు. కాగా మన దేశంలో హెల్‌కేర్ రంగంలో పెట్టుబడులు ఇప్పటికీ తక్కువ స్థాయిలోనే ఉన్నాయని అపోలో ఆస్పత్రి వైస్ ఛైర్‌పర్సన్ ప్రీతా రెడ్డి అన్నారు. హెల్త్‌కేర్ విషయంలో సేవలకు అనుగుణంగా చాలినంతమంత డాక్టర్లు, నర్సులు మనకు లేరని ఆమె అన్నారు. అంతేకాకుండా మారుతున్న రోగాల వ్యాప్తికి అనుగుణంగాప్రాథమిక వైద్యం, నాణ్యతతో కూడిన వైద్య సేవలు కూడా పెరగాల్సివుందన్నారు. అలాగే జీఎస్టీ, వైద్యం, వైద్య పరికరాలపై ధరల నియంత్రణ అంశాలు కూడా హెల్త్‌కేర్ రంగంలో సవాళ్లుగా మారాయన్నారు. వీటిపై ప్రధానంగా చర్చలు జరిపి సానుకూల నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందన్నారు. కాగా పార్మా రంగంలో సైతం భారత దేశంలో మంచి ప్రగతికి అవకాశం ఉందని, వచ్చే యేడాది ఈ వృద్ధి రెండంకెలకు చేరవచ్చని, అలాగే కొత్త ఉత్పత్తులు సైతం అనేకం ఆవిష్కృతం అయ్యే అవకాశం ఉందని గ్లెన్‌మార్క్ పార్మాస్యూటికల్స్ ఛైర్మన్ కం ఎండీ గ్లెన్ సల్డాన్హా తెలిపారు. అమెరికా జనరిక్ ఔషధాల మార్కెట్ కూడా ధరల పెరుగుదల వల్ల కొంత వత్తిడికి గురయ్యే వీలుందన్నారు.

భారత ఆర్థిక రంగానికి తిరుగులేదు

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: డాలర్ బలపడడం, చమురు ధరలు, వచ్చే ఏడాది జరిగే ఎన్నికలు రూపాయి విలువ, దిశ, దశను నిర్దేశించనున్నాయని ఆర్థిక వేత్తలు భావిస్తున్నారు. వచ్చే ఆరు నుంచి 12 నెలలు కూడా దేశ ఆర్థిక రంగం బాగా ఉంటుందని, ఊపులో ఉండే అవకాశం ఉందని స్టాండర్డ్ చార్టర్డ్ నివేదికలో పేర్కొంది. భారత కరెన్సీ రూపాయి కళకళలాడుతుందంటున్నారు. వృద్ధిరేటు, విదేశీ మారకద్రవ్య నిల్వలు 394 బిలియన్ డాలర్లకు చేరడం వల్ల మంచి సెంటిమెంట్ మార్కెట్లో ఉందని నివేదికలో అంచనా వేశారు. 2010 ఇండియా అవుట్‌లుక్ పేరుతో ఈ నివేదికను విడుదల చేశారు. 2019లో కూడా జీడీపీ దూసుకుపోతుందని విశ్లేషించారు. భారత ఆర్థిక రంగానికి ఎటువంటి ఢోకాలేదంటున్నారు. అన్నీ మంచి శకునాలేనని, ఆర్థిక రంగం పరుగులుపెడుతుందంటున్నారు. ఆర్థిక సంస్కరణలు వేగవంతమవుతున్నాయి. జీఎస్టీ రికార్డు స్థాయి వసూళ్లవుతున్నాయి. దివాలాప్రక్రియ స్మృతిని చక్కగా అమలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఆర్థిక రంగం మెరుగుపడడం మంచి సంకేతమని నివేదికలో పేర్కొన్నారు. వినియోగదారుల ధర ద్రవ్యోల్బణం 2019లో నాలుగు శాతంగా నమోదు కావచ్చు. చమురు ధరలు దిద్దుబాటుకు లోనై స్థిరంగా ఉండడం సెంటిమెంట్‌ను పండించింది. చమురు ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగుతాయని ముందు భావించారు. భారత స్టాక్ మార్కెట్ నిలకడగా సాగుతుంది. 2018లో కొన్ని ఒడిదుడుకులకు లోనైనా, స్థిరత్వంతో మార్కెట్ కొనసాగుతుందని స్టాండర్డ్ చార్టర్డ్ హెడ్ ఎండీ నితిన్ సింగ్ చెప్పారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు ఒడిదుడుకులకు లోనవుతున్నాయని, కాని రిస్క్ నుంచి బయటపడుతాయన్నారు. 2019లో డబుల్ డిజిట్ వృద్ధిరేటు నమోదవుతుందన్నారు.

వాణిజ్యభూమి

నామమాత్ర పతనంతో ముగిసిన సెన్సెక్స్



ముంబయి, డిసెంబర్ 31: ఈ ఏడాది చివరి రోజైన సోమవారం సెన్సెక్స్ నామమాత్ర పతనంతో ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ సూచీలు సానుకూలంగానే స్పందించినప్పటికీ, కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు సమాయత్తమైన మదుపరులు స్టాక్ మార్కెట్‌లో లావాదేవీలపై అంతగా ఆసక్తి కనబరచలేదు. ఫలితంగా 30 షేర్ బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బీఎస్ఈ) సూచీ 8.39 పాయింట్లు లేదా 0.02 శాతం పతనమై, 36,068.33 పాయింట్ల వద్ద ముగిసింది. అదే విధంగా నిఫ్టీ 2.65 పాయింట్లు లేదా 0.02 శాతం నష్టపోయి, 10,862.55 పాయింట్లుగా నమోదైంది. కాగా, సోమవారం నాటి ఇన్‌ట్రాడేలో డాలర్‌కు రూపాయి మారకపు విలువ 69.90గా స్థిరపడింది. ఇలావుంటే, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు (ఎఫ్‌పీఐ) సోమవారం 119.60 కోట్ల రూపాయ ల విలువైన వాటాలను అమ్మడం గమనార్హం. అయితే, దేశీయ మదుపరులు చేసిన లావాదేవీల విలువ 1,199.40 కోట్ల రూపాయలు కావడంతో, సెన్సెక్స్ భారీ పతనం లేకుండా, అత్యంత స్వల్ప నష్టాలతో బయటపడింది.

నీరసించిన ఎలక్ట్రానిక్స్!

సుమారు దశాబ్దకాలం లాభాల బాటలో పరుగులు తీస్తూ, కోట్లకు కోట్ల రూపాయలను ఆర్జించిపెట్టిన ఎలక్ట్రానిక్స్ పరికరాల పరిశ్రమ ఈ ఏడాది ఎవరూ ఊహించని విధంగా నీరసించింది. ఏడాది మొదట్లో వేసుకున్న అంచనాలు, నిర్ధారించుకున్న లక్ష్యాలు తారుమారయ్యాయి. ఎలక్ట్రానిక్స్, కమ్యునికేషన్స్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నప్పటికీ, అమ్మకాల గణనీయంగా తగ్గాయి. ప్రత్యేకించి ఎలక్ట్రానిక్స్‌లో అమ్మకాల పత నం స్పష్టంగా కనిపించింది. వాషింగ్ మెషిన్లను మినహాయిస్తే, మిగతా అన్ని రకాలా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు ఈ ఏడాది డిమాండ్ తగ్గిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కొత్త సంవత్సరం ప్రారంభానికి ముందు కూడా స్టాక్ మార్కెట్‌లో ఎలక్ట్రానిక్స్ కంపెనీల వాటాలకు పెద్దగా డిమాండ్ లేకపోవడంతో, మంగళవారం నుంచి మొదలయ్యే కొత్త ఏడాదిలో పరిస్థితి ఏ విధం గా ఉంటుందోనన్న ఆందోళన నెలకొంది.

ఈ రంగంలోని ఉత్పత్తిదారులు భారీ నష్టాలను ఎదుర్కోకపోయినా, అనుకున్నంత లాభాలను ఆర్జించలేకపోయా రు. కొత్త సంవత్సరం లో డిమాండ్ పెరుగుతుందని, అమ్మకాలు భారీగా పెరుగుతాయని ఆశిస్తున్నారు.

Printed and Published by
T. Venkateswarlu on behalf of
Deccan Chronicle Holdings Ltd.
Printed at Deccan Chronicle Press
situated at Plot No. 9, Alwal Village,
Vallabh Nagar Taluk, Medchal Malkajgiri Dist.,
Telangana and Published at
36, S.D. Road, Secunderabad-3,
Chief Editor T.V.Ravi Reddy,
PBX 27803930 (6Lines), Editorial: 27805056,
Regd.No.H/SDHO-4/2K RNI Regd.No.5595/60

విద్యుత్ రంగంలో తెలంగాణ చారిత్రిక విజయం

కేసీఆర్ మార్గదర్శకత్వంలో విద్యుత్ సంస్థల విజయనాదం



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి రోజుల్లో భయంకరమైన విద్యుత్ సంక్షోభం ఎదుర్కొన్నది. దార్శనిక నాయకుడు, గౌరవ ముఖ్యమంత్రి **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు** గారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలు అతి తక్కువ సమయంలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించి ఈ సంక్షోభాన్ని పరిష్కరించాయి. నేడు తెలంగాణ రాష్ట్రం వ్యవసాయంతో పాటు అన్ని రంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నది. ఈ విజయపరంపరలో తెలంగాణ రాష్ట్రం విద్యుత్ రంగంలో అనేక కొత్త రికార్డులు సృష్టించింది.

తెలంగాణ ప్రజలకు నూతన సంవత్సర కానుక
800 మెగావాట్ల కెటిపిఎస్ 7వ దశ ప్లాంటు

అతి తక్కువ సమయంలో నిర్మించిన విద్యుత్తు ప్లాంటుగా కొత్త చరిత్ర

తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రారంభించి, పూర్తి చేసిన మొదటి ప్రాజెక్టు

మిగులు విద్యుత్ రాష్ట్రం దిశగా తెలంగాణ రాష్ట్రం మరో ముందడుగు

తెలంగాణ రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో చేపట్టిన విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నది. రూ.6,405 కోట్ల వ్యయంతో చేపట్టిన కెటిపిఎస్ 7వ దశ నిర్మాణాన్ని కేవలం 42 నెలల్లోనే పూర్తి చేసి, 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని తెలంగాణ జెన్‌కో అందుబాటులోకి తెచ్చింది. ఇంత తక్కువ సమయంలో భారతదేశంలో రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో మరే విద్యుత్ ప్లాంటు నిర్మాణం జరగలేదు. 2015 జనవరి 1న ఈ ప్లాంటు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 2018 జూన్ 30 నాటికి ప్లాంటు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ మార్గదర్శకాల అనుగుణంగా, 48 నెలల్లోనే ప్లాంటు పూర్తి చేసి, ఉత్పత్తి ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్రం విద్యుతు ప్లాంట్ల నిర్మాణంలో దేశానికే ఆదర్శంగా నిలిచింది.



విద్యుత్ రంగంలో తెలంగాణ సృష్టించిన సరికొత్త రికార్డులు

తలసరి విద్యుత్ వినియోగం వృద్ధిరేటులో దేశంలో నెంబర్ వన్

ప్రగతి సూచికల్లో అతి ముఖ్యమైన తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ రాష్ట్రం రికార్డు స్థాయి వృద్ధి సాధించింది. 2014లో 1,084 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగం ఉంటే 2018 నాటికి 1,727 యూనిట్లకు చేరింది. ఏడాదికి వెయ్యి యూనిట్లకు పైగా తలసరి వినియోగం జరిగే రాష్ట్రాల్లో తెలంగాణ అత్యధికంగా 11.34 శాతం వార్షిక వృద్ధిరేటు సాధించి దేశంలో ప్రథమ స్థానంలో నిలిచింది.

దేశ సగటును మించి గరిష్ట డిమాండ్ వృద్ధి

2016-17లో తెలంగాణలో 9,187 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదు కాగా, 2018-19 సంవత్సరంలో 10,818 మెగావాట్లకు చేరింది. దేశ సగటు వృద్ధి శాతం 2.43 అయితే, తెలంగాణ వృద్ధి రేటు 17.75 శాతంగా నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా నేడు 10,818 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ఏర్పడినా కోత లేకుండా విద్యుత్ సరఫరా చేయగలిగింది.

సోలార్ పవర్‌లో దేశంలోనే అగ్రగామి

3,416 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తితో దేశంలోనే 2వ స్థానంగా నిలిచింది.

వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం

రాష్ట్రంలోని మొత్తం 23 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా అవుతున్నది. ఈ ఘనత సాధించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ కొత్త చరిత్రను సగర్వంగా లిఖించింది.

లోటు నుంచి మిగులు వరకు

2014లో స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 7,778 మెగావాట్లు ఉండేది. 2,700 మెగావాట్ల లోటు ఏర్పడేది. ఇప్పుడు 110 శాతం పెరిగి 16,307 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది.

రూ. 21,970 కోట్లతో పంపిణీ, సరఫరా వ్యవస్థలు పటిష్టం

రూ.21,970 కోట్ల వ్యయంతో పంపిణీ, సరఫరా వ్యవస్థలను ప్రభుత్వం పటిష్టం చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఆరో నెల (2014, నవంబర్ 20) నుంచే కోతల్లేని విద్యుత్ సరఫరా జరుగుతున్నది.

శరవేగంగా విద్యుత్ ప్లాంట్‌ల నిర్మాణం

తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో 5,880 మెగావాట్ల సామర్థ్యంతో జెన్‌కో మూడు కొత్త విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టింది. 4,000 మెగావాట్ల రికార్డు స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో యాదాద్రి అల్ట్రా మెగా పవర్ ప్లాంటు, 1080 మెగావాట్ల సామర్థ్యంతో భద్రాద్రి పవర్ ప్లాంటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కెటిపిఎస్-7 ప్లాంటు విద్యుత్ సరఫరా ప్రారంభించింది.

తెలంగాణ చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్‌ల అనుసంధానం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్‌ల మధ్య వార్ధా నుండి హైదరాబాద్-765 కెవి డిసి లైన్ ప్రారంభం పి.జి.సి.ఐ.ఎల్ ద్వారా నిర్మించబడింది. దేశంలో ఎక్కడి నుంచైనా విద్యుత్‌ను ఇచ్చిపుచ్చుకునే సౌలభ్యం ఈ లైన్ వల్ల కలిగింది.

రికార్డు స్థాయిలో ఉద్యోగాల కల్పన - దళారీ వ్యవస్థ నిర్మూలన

జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కమ్ లలో కొత్తగా 13,357 మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నది. వేల మందికి ఏకకాలంలో పదోన్నతి కల్పించింది. 22,500 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసింది. దళారీ వ్యవస్థను నిర్మూలించింది. ఉద్యోగులకు 35 శాతం ఫిట్‌మెంటు, అదనపు ఇంక్రిమెంట్లతో వేతనాలు భారీగా పెంచింది.

ఎత్తిపోతల పథకాలకు 9 వేల మెగావాట్ల విద్యుత్

కోటి ఎకరాలకు సాగునీరు అందించే సంకల్పంతో ప్రభుత్వం నిర్మిస్తున్న భారీ ఎత్తిపోతల పథకాలకు అవసరమైన 9వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేయడానికి పంపిణీ, సరఫరా వ్యవస్థలను పటిష్టం చేసింది.

పవర్ బ్యాంకింగ్ విధానానికి శ్రీకారం

తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా పవర్ బ్యాంకింగ్ విధానానికి విద్యుత్ సంస్థలు శ్రీకారం చుట్టాయి. 500 మెగావాట్ల మిగులు విద్యుత్‌ను రాజస్థాన్‌కు అందించి అధిక డిమాండ్ ఉన్న యాసంగి సీజన్‌లో ఆ విద్యుత్‌ను రాజస్థాన్ నుంచి తిరిగి తీసుకుంటుంది.

విద్యుత్తు వెలుగులో బంగారు తెలంగాణ రూపుదిద్దుకుంటున్నది



తెలంగాణ రాష్ట్ర పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ | ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ | సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ | తెలంగాణ స్టేట్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్

RO No: 60/18

C M Y K

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టిపోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే


ఆంధ్రభూమి

మంగళవారం, 1 జనవరి 2019



బి(న్యూ) పాజిటివ్

-ఎం.ఎస్.కె. కౌముది
7673931505



"నాన్నా, ఇవాళ సాయంత్రం నిధి వాళ్ళింట్లో పార్టీ, కాలేజీ ఫ్రెండ్స్ అంతా కలుస్తారు, నేనూ వెళ్తా నాన్నా, ప్లీజ్.. ఈ ఒక్కసారికి వద్దనకు, మరెప్పుడూ అడగను, ప్రామిస్" అని పొద్దున్న లేస్తూనే ఏడుపు, జాలి కలగలిపిన చిలిపిమొహంతో అడిగింది స్ఫూర్తి.

"ఎందుకు తల్లీ, ఇంట్లో నీకు కావాల్సినవన్నీ అమ్మ చేసిపెడుతుంది, చక్కగా ఎంతసేపైనా తమ్ముతో ఆడుకో, లేదంటే మన లక్ష్మితో కబుర్లు చెప్పు, కథలు చెప్తుంది ఎంచక్కా. అదే పెద్ద పార్టీ" అన్నాడు మధు.

"ఇంజనీరింగ్ అమ్మాయితో మాటాడుతున్నట్టు లేదు అబ్బాయి, ఐదవ తరగతి పిల్లని బుజ్జగిస్తున్నట్లుంది నీ తీరు" జోక్‌చేస్తూ పేపర్ను అడ్డుపెట్టుకున్నాడు మాధవ తండ్రి సూర్యమూర్తి.

"నువ్వూరుకో నాన్నా!" నీకేం తెలీదు. అన్నిటికీ సపోర్టు చేయకు" అని విసుక్కున్నాడు మధు. చిన్నబుచ్చుకున్నా ఏమనకుండా నిమ్మకున్నాడు మూర్తి. జానకి వంట గదిలోంచి హడావుడిగా వచ్చి "నిధివాళ్ల ఇల్లు దగ్గరేనండి, క్యాబ్‌లో అరగంటకంటే పట్టదు. వెళ్లనివ్వండి ఈసారి" అని వెళ్లిపోయింది. ఇంట్లో అందరూ కూతురికి వంతపాడేసరికి చేసేది లేక "సరే! వెళ్లిరా కానీ త్వరగా ఇంట్లో ఉండాలి, లేదంటే నా సంగతి తెలుసుకదా" అన్నాడు మధు.

"ఏంటి అమ్మాయిగారూ! ఇంతసక్కా ముస్తాబవుతున్నారు, పార్టీ అంట కదా, తాతయ్య సెప్పేరు. నాన్నగోరు ఒప్పుకోటమే పెద్దిసయం, భద్రం ఎల్లిరండమ్మా" అంటూ ఆ ఇంట్లో పనిచేసే లక్ష్మి కూడా ఉత్సాహపడింది.

లక్ష్మమ్మకు ముగ్గురు కొడుకులు, ఓ కూతురు. కొడుకుల భవిష్యత్తుకున్నదంతా ఖర్చుబెట్టి కూతుర్ని మూడో పెళ్లివాడికిచ్చి చేసింది. వయసుడిగి ఆ అల్లుడు కాలం చెల్లించేడు, కూతురు రెక్కల కష్టంతో సంసారాన్ని నడుపుకొస్తోంది. పదేళ్లనుంచి మధు ఇంట్లో పనిచేస్తున్నందువల్ల ఇంట్లో మనిషయిపోయింది లక్ష్మమ్మ. సాయంత్రం ఆరు గంటలయింది. భుజంపైన ఉండాల్సిన కండువాను తలక్కట్టుకుని మధు కాలుకాలిన పిల్లినా అటుఇటు పచార్లు చేస్తున్నాడు. "ఏరా అబ్బాయి నేను అలా వెళ్లి నా ఫ్రెండ్స్‌ని కలిసొస్తా, స్ఫూర్తి వెళ్ళేక అరికాళ్ళకి కాస్త కొబ్బరి నూనె రాసుకో, లేదంటే నిద్రపట్టదు" అన్నాడు.

"నాన్నా, ఇంట్లో ఆడపిల్ల మనెవరి తోడులేకుండా పార్టీ అని మొదటిసారి బయటికెళ్తోందని నేను టెన్షన్ పడుతుంటే, నీకు కనీసం ఆ అక్కర కూడా ఉన్నట్టు కనిపించట్లేదు, పైగా వెటకారం".

"చూడు మధు, తను చిన్నపిల్ల కాదు, మంచి చెడు తెలుసు, ధైర్యవంతురాలు. కాలం బావులేదని పేపర్లో రోజూ చూసి నీకలా భయం ఉండిపోయింది. తనకేం కాదులే. నా మనుమరాలు క్షేమంగా ఇంటికొస్తుంది" అని బయటికెళ్లిపోయాడు.

"నే పార్టీకెళ్ళొస్తా నాన్నా, టెన్షన్ పడకండి, త్వరగా వచ్చేస్తా, బాయ్"- బంగారపు ఛాయపైన, లేత గులాబీ రంగు కుర్తా, పైజమా, చందనం కలర్‌చున్నీలో మెరిసిపోతూ చెప్పింది స్ఫూర్తి.

"అరేయ్ రిషి, అక్కను దింపేసిరారా అని కేకేసేడు".

"వాడెందుకు నాన్నా ఇపుడు, అయినా చిన్నవాడిని నాకు తోడు వెళ్ళమంటావేంటి" అంది.

"నేనేం చిన్నపిల్లాడిని కాదు, అయినా నే వెళ్లను నాన్నా" అని విసవిసలాడుతూ వెళ్లిపోయేడు రిషి.

"సరే" అని తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో కూతుర్ని సాగనంపేడు మధు.

"లక్ష్మి! త్వరగా ఇల్లంతా ఊడ్చేసి, ఈ కాస్త గిన్నెలు కడిగి వెళ్ళు" అరిచింది జానకి. సమాధానం రాలేదు. ఏమాట్లాడవేం అంటూ వెళ్లి చూసేసరికి పెరట్లో ఓ మూల కంట తడిపెడుతున్న లక్ష్మి కనబడింది. ఏమైందని అడిగితే, "అమ్మా! అన్నీ కొడుకులే అని నా శక్తంతా ధారపోసేను, చివరకు ఉన్న ముగ్గురు కొడుకులు కాదంటే నా బిడ్డ నన్ను సాకుతోందమ్మా. పైగా గర్భవతి, అట్లే పనిలోకెళ్తుంది. దాని బాధ తల్చుకుంటేనే దానికి చేసిన అన్యాయం గుర్తొచ్చి గుండె సెరువవుతోందమ్మా" అంది. ఆమెకు సమాధానపరిచి, లక్ష్మికి ఆడపిల్లల గొప్పతనం అంటూ క్లాస్ చెప్పింది జానకి.

రాత్రి పదవుతోంది. స్ఫూర్తి ఇంకా ఇంటికి రాలేదు. జానకి మెల్లగా మధు దగ్గరకొచ్చి "ఏమండీ! అమ్మాయి ఆలస్యమవుతుందని ఫోన్ ఏమన్నా చేసిందా" అడిగింది. అసలే పిల్ల ఇంకా ఇంటికి రాలేదన్న టెన్షన్ మొహంలో బయటపడనీకుండా గంభీరంగా అప్పటిదాకా కూచున్న మధు ఇక ఆపుకోలేక "ఇపుడు గుర్తొచ్చిందా పిల్ల సేఫ్టీ, ఈ పార్టీలేవీ వద్దు అంటే విన్నారా, తగుదునమ్మా అని ఆ ముసలాయన దగ్గరనుంచి లక్ష్మమ్మదాకా 'వెళ్లిరమ్మని' సాగనంపేరు కదా. ఇక అనుభవించండి, నే పడుకుంటున్నా" అంటూ బుసలుకొడుతున్న పాములే వెళ్లిపోయాడు. "ఈ మాత్రానికే అంత కోపం అవసరమా" అన్నట్టు అంతా విస్తుపోయారు. కానీ, మధు టెన్షన్‌వారికి అర్థమయింది. "మామయ్యా! పార్టీ ఇంతసేపు అవుతుందంటారా, నాకెందుకో కాస్త కంగారొస్తోంది. ఏం చేద్దాం" కూతురిమీదున్న బెంగ కళ్ళనిండా నింపుకునున్న జానకి అడిగింది.

"ఏమిటమ్మా నువ్వు కూడా వాడిలాగా, నేనున్నానుకదా, నే చూసుకుంటాలే. నువ్వు లోపలికెళ్లి ఆ మంట చల్లార్చు. పిల్ల కోసం బెంగ అని పైకి చెప్పుకోలేడు పిచ్చివాడు" అని జానకిని పంపేశాడు సూర్యమూర్తి.

టైం 11, రిషి పరీక్షకి చదువుకుంటున్నాడు. జానకి, మధులు అలసిపోయుండటంతో మేలుకుని ఉందామనుకున్నా నిద్రాదేవి ఆవహించేసింది, ఈ స్ఫూర్తి ఇంకా రాలేదు, మధుకు తెలిస్తే ఎంత పెద్ద గొడవవుతుందో అనుకుంటూ రిషి దగ్గరికెళ్లి "రిషి! నీకు అక్క ఫ్రెండ్ ఇల్లు తెలుసా నాన్నా" అడిగాడు.

"తెలుసు తాతయ్యా, నేను కూడా చాలాసార్లు వెళ్ళా" అని ఇంకా తను పూర్తిచేయకుండానే 'సరే' మరి బండి తీయి, ఓసారి అలా వెళ్ళొద్దాం" అన్నాడు సూర్యమూర్తి.

"సరే నాన్నకి చెప్పొస్తా ఉండు" అంటూ లేబోయాడు రిషి.

"ఒరేయ్ బాబూ, కొంపముంచేలా ఉన్నావ్, మీ నాన్నకి నేను చెప్తాలే కానీ చప్పుడు చేయకుండా చెప్పులేసుకుని రా, నే భయటుంటా" అన్నాడు.

నిధి ఇంటికి వీళ్ళు చేరుతుండగానే దారిలో ఓ క్యాబ్ ఆగి ఉండడం కనిపించింది, డ్రైవర్ టైరును తీక్షణంగా పరిశీలిస్తున్నాడు. పక్కనే స్ఫూర్తి బిక్క మొహమేసుకుని మొబైల్ వేపు, ఆకాశంవైపు మార్చి మార్చి చూస్తూ ఉంది.

"తాతయ్యా! అది అక్క" అని అరిచాడు రిషి.

"ష్.. నిశ్శబ్దం" అన్నట్టు సైగ చేశాడు సూర్యం.

ఇంతలో స్ఫూర్తి పక్కగా ఓ కారొచ్చి ఆగింది. అందులోంచి డ్రైవర్ కాకుండా ఇంకొకతను దిగి స్ఫూర్తితో ఏదో మాట్లాడేడు. ఓ పావు గంట సేపు డిస్కషన్ జరిగింది. స్ఫూర్తి వెళ్లి కార్‌లో కూచుంది. సూర్యానికి గుండె జారినంత పనయింది.

"పద, రిషి కార్‌ని ఫాలోచేయి" అన్నాడు.

"మనింటికే వెళ్తున్నట్టున్నారు తాతయ్యా".

మధు ఇంటి దగ్గర కారు ఆగకుండా పదడుగులు ముందుకెళ్లింది. రిషి కంగారుగా బండి స్పీడు పెంచడు. ఇంతలో కారు వెనక్కొచ్చి ఇంటికి ముందు ఆగింది. స్ఫూర్తి దిగగానే కారు వెళ్లిపోయింది. ఇంతలో వీళ్లిద్దరు కూడా ఇంటికి చేరారు. సూర్యాన్ని చూస్తూనే "తాతయ్యా, మీరేంటి ఇక్కడ, అసలేం అయిందంటే" అంటూ స్టోరీ చెప్పుకొచ్చింది.

పొద్దున్న లేచి కాఫీ కప్పు తీసుకుంటూనే అందుకున్నాడు మధు-" జానకి! మీ ముద్దుల కూతురు ఇంటికి ఎన్నిగంటలకొచ్చింది. నిద్రలేవనీ దాని సంగతి చెప్తా" అన్నాడు.

జానకి బెరకుగా మామగారి వంక చూసింది.

అప్పుడే మార్నింగ్ వాక్‌కి వెళ్ళొచ్చి కాఫీ తాగుతున్న సూర్యమూర్తి "ఏరా మధు, పొద్దున్న లేచి ఈ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించక, ఎందుకురా నీకు ఆ ముక్కుమీద కోపం. అబ్బాయి! రోజూ చదివే వార్తల్లో బలాత్కారమో, హత్యో లేక మోసం చేసాడని మగవాళ్లకు సంబంధించిన వార్తను మాత్రమే చూస్తావెక్కువ. మోసాలు చేసి లేక వేరే సంబంధాలు పెట్టుకున్న ఆడవాళ్ళు లేకపోలేరు. కానీ మన పరిస్థితి, పరిసరాలను బట్టి మనకి ఒక కోణమే కనిపిస్తుంది. కన్నతల్లికి మాత్రమే కాదు, తండ్రికి కూడా ఆడపిల్ల నడవడిక, కదలికల గురించి ఎంత అక్కర ఉంటుందని నిన్ను చూస్తే నాకర్థమయింది. ఆడది కనుక తల్లి తన బెంగను, బాధను కన్నీళ్ల ద్వారానో, మాటల ద్వారానో వ్యక్తపరుస్తుంది. తండ్రి పైకి చెప్పుకోలేక దాన్ని కోపం రూపంలో వ్యక్తపరుస్తాడు. ఆడపిల్ల అంటే చాలు వయసుతో నిమిత్తం కూడా లేకుండా పశువుల్లా ప్రవర్తిస్తున్న ఈ సమాజంలోనే, అర్ధరాత్రి తన క్యాబ్‌లో ఒంటరిగా దొరికిన ఆడకూతుర్ని జాగ్రత్తగా ఇంటికి చేర్చాలనునేవారూ ఉన్నారు. నిన్న అటువంటి కారులో బయల్దేరుతుండగానే ట్రబుల్ ఇచ్చింది. అంతలో స్ఫూర్తి స్నేహితులిద్దరు వచ్చి తన పరిస్థితి చూసి లిఫ్ట్ ఇచ్చి ఇంటి దగ్గర దింపేరు, తనకు ఎటువంటి హాని చేయకుండా. ఫోన్‌లో ఛార్జ్ అయిపోవడంవలన మీకు చెప్పడానికి కుదరలేదు తాతయ్యా అంటూ తననెక్కడ అపార్థం చేసుకుంటామో అని బోరుమంటూ జరిగిందిది అని చెప్పింది పిచ్చి పిల్ల.

ఇంతలో లక్ష్మమ్మ వచ్చి "అయ్యా! ఇదిగో నోరు తీపి చేస్కోండి" అంటూ స్వీట్ అందించింది.

"ఏమిటే ఇంత ఆనందం, ముందు విషయం చెప్పు" అంది జానకి.

"నా కూతురికి ఆడబిడ్డ పుట్టిందమ్మా" అంది ఆనందంగా. అంతా అవాక్కయ్యారు. లక్ష్మి మామూలుగా తన పనిలో మునిగిపోయింది. తనతో లక్ష్మి చెప్పుకుని ఏడ్చిందంతా జానకి ఇంట్లోవాళ్లకి చెప్పింది.

"చూసేవా మధు, లక్ష్మిలో ఎంత మార్పొచ్చిందో. ఇంతకంటే ఇంకో రుజువేం కావాలి ఈ నూతన సంవత్సరం అద్భుతంగా ప్రారంభమయింది అనడానికి. హ్యాపీ న్యూ ఇయర్ మధు" అన్నాడు.

"స్ఫూర్తిపైన నాకున్న ప్రేమను ఎంత బాగా అర్థం చేసుకున్నావ్ నాన్నా. నిజమే, తను పార్టీకి వెళ్లడం ఇష్టం లేక కాదు, నా చిట్టి తల్లి ఇంటికి జాగ్రత్తగా రావాలన్న బెంగ నా చేత అలా మాట్లాడిస్తుంది. ఆడపిల్ల కదా అని ఇంటికే పరిమితం చేసే ఉద్దేశ్యమున్న మనిషినైతే ఇంజనీరింగ్‌కే పంపేవాడిని కాదు. నీ మాటలు నాకెంతో స్వాంతననిచ్చాయి. తనపైన బెంగతో అటు ఇటు తిరుగుతూ హడావిడి పడ్డానే తప్ప, నీలాగా సరైన టైంలో సరైన పని చేయలేదు నాన్నా. అన్నిటికీ సరదాగా మాట్లాడతావని ఇన్నాళ్లు నిన్ను విస్కుంటూ ఉన్నా, నన్ను క్షమించు, నాలో కూడా మార్పును చూస్తావ్ ఈ రోజునుంచి" అని సూర్యమూర్తి చేతులు పట్టుకుని, "హ్యాపీ న్యూ ఇయర్ నాన్నా" అన్నాడు.

ఇంతలో స్ఫూర్తినిద్రలేచి భయం భయంగా హాల్లోకి వచ్చింది. "నాన్నా! అసలేం జరిగిందంటే" అని చెప్పబోతుండగానే ఆపి, "నువ్వేం చెప్పక్కర్లేదు తల్లీ. హ్యాపీ న్యూ ఇయర్ రా, మనకు మాత్రమే కాదు, ఈరోజే భూమిమీద పడిన మొట్ట మొదటి అదృష్టవంతురాలు లక్ష్మి మనుమరాలికి, ఇంకా తమ పిల్లలను ధైర్యంగా ఎంత రాత్రైనా బైటకు పంపచ్చు అనే ధైర్యాన్నిచ్చిన నీ క్యాబ్ డ్రైవర్ లాంటి మంచి మనసులకు.. ఒంటరిగా కనపడినా సరే మరొక ఆలోచన లేకుండా నిన్ను భద్రంగా ఇంటిదగ్గర దింపిన నీ స్నేహితుల్లాంటి మంచి మనుషులకు, అటువంటి మంచి కూడా ఉంది సమాజంలో, మన దృష్టికోణాన్ని విస్తరించి చూడాలని నా కళ్లు తెరిపించిన తాతయ్య లాంటి పెద్దవాళ్లకు, ఆడపిల్లవి, పార్టీలేమిటని అనకుండా.. పర్వాలేదు పంపమని నాకే ధైర్యం చెప్పిన మీ అమ్మలాంటి సాటి తల్లులందరికీ హ్యాపీ న్యూ ఇయర్ తల్లీ. ఈ ప్రసార మాధ్యమాల ప్రభావంవలన చెడుకి అలవాటుపడినట్లు, మన కళ్ళు, చెవులు మంచికి అలవాటుపడలేదింకా. ఈ న్యూ ఇయర్ నుంచి ఐనా, పైపైన జరిగేవాటిని చూసి మనుషుల పట్ల అభిప్రాయాన్ని ఏర్పర్చుకోకుండా వాస్తవాన్ని గమనించగలిగేలా మారాలి మన దృష్టికోణం. మోసం, ద్వేషం, స్వార్థం, అన్యాయం, ఇటువంటివన్నీ సమసిపోవాలి. వెతికి పట్టుకుందామనుకున్నా చెడు వార్త కనపడకూడదు, పేపర్, టీవీ.. ఈ మాధ్యమాలనిండా మంచి మాత్రమే వినపడాలి, కనపడాలి. మన మనసుల్లో పేరుకున్న నెగెటివ్ ఆలోచనలని చెరిపేస్తూ అంతటా పాజిటివ్ వాతావరణం నెలకొనాలి" అంటూ కూతుర్ని దగ్గరకు తీసుకున్నాడు సంతోషంగా.

★

కార్యాలయంలో కొత్త ఏడాది నిర్ణయాలు





కొత్త ఏడాదిలో అడుగుపెట్టేశాం. ఎంత వద్దనుకున్నా ఈ సమయంలో గతకాలపు సంఘటనలు, పెట్టుకున్న లక్ష్యాలు, తీసుకున్న మంచి, ఫలించని నిర్ణయాలు గుర్తుకు రాకమానవు. గత సంవత్సరం వ్యక్తిగత విషయాలతో పాటు వృత్తిపరమైన అంశాలను మదింపు చేసుకునేందుకు ఇది మంచి సందర్భం. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు ఉపయోగపడే కొన్ని అంశాల గురించి తెలుసుకుందాం..

⁘ ఉద్యోగులు ఇప్పుడు చేస్తున్న ఉద్యోగాన్ని కొనసాగిస్తూనే మరింత ప్రతిభను ప్రదర్శించే ప్రయత్నం చేయాలి. అందుకు ఇప్పుడున్న చోట ఉన్న అవకాశాలను గుర్తించాలి. ఈ క్రమంలో అర్హత, అనుభవం ప్రాతిపదికగా వీలున్న ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకునే ప్రయత్నం చేయాలి.

⁘ ఉద్యోగులు కార్యాలయంలో ఎదురయ్యే ఒత్తిళ్లను అధిగమించేందుకు నవ్వు ఎంతగానో దోహదం చేస్తుంది. ఖర్చులేని, సులువైన, పంచే కొద్దీ పెరిగే నవ్వు కోసం రోజులో కనీసం 20 నిముషాలైనా కేటాయించాలి. సహోద్యోగులతో సరదాగా మాట్లాడటం, జోక్స్ పంచుకోవడం, భోజన విరామ సమయంలో వారితో కలిసి పావుగంట పాటు బయట పచ్చని చెట్ల మధ్య తిరిగి రావడం వంటి అలవాట్లు వృత్తిపరమైన ఒత్తిడిని గణనీయంగా తగ్గిస్తాయి. అలాగని పనివేళల్లో కాదు సుమా.. విరామ సమయంలో మాత్రమే..

⁘ అవకాశం కల్పించుకుని వారాంతంలో లేదా సెలవుల్లో ఏదైనా కొత్త ప్రదేశాలకు కుటుంబంతో వెళ్లి సరదాగా గడపటం, స్నేహితులను కలవటం వల్ల వంటి వ్యాపకాలు ఒత్తిడిని గణనీయంగా తగ్గిస్తాయి. ఈ తరహా ప్రయాణాలను ఇప్పటినుంచే ప్లాన్ చేసుకోవాలి.

⁘ ఆసక్తి, వయసు, కేటాయించే సమయాన్ని బట్టి ఏదైనా కొత్త అంశాన్ని హాబీగా మలచుకునేందుకు ఇదే మంచి సమయం.

⁘ సమయం లేదనే సాకును పక్కనబెట్టి రోజూ కనీసం గంటపాటు పుస్తక పఠనానికి కేటాయించాలి. మీకు నచ్చిన అంశాలను ఎంచుకుని వాటికి సంబంధించి సమగ్ర అధ్యయనం చేయటం ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. ఈ అలవాటు వల్ల ఒత్తిడి దరిజేరకపోగా ఆత్మవిశ్వాసం ఎంతగానో ఇనుమడిస్తుంది. భవిష్యత్తులో ఈ జ్ఞానం ఏదో ఒక సందర్భంలో ఉపయోగపడుతుంది.

⁘ ఈ రోజుల్లో స్మార్ట్‌ఫోన్ మన జీవితంలో ఓ భాగంగా మారింది. కూర్చున్న చోటు నుంచే కదలకుండా అనేక బాధ్యతలు ఏకకాలంలో నిర్వర్తించే వెసులుబాటు వచ్చింది. వ్యాయామం, ఆరోగ్యం, వృత్తిపరమైన అంశాలకు సంబంధించిన ఎన్నో యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో కొన్నింటిని ఎంచుకుని మీ వృత్తిపరమైన బాధ్యతలను నిర్వర్తిస్తూనే, నైపుణ్యాన్ని మరింత పెంచుకోవచ్చు. దీనివల్ల ఒత్తిడి తగ్గుతుంది.

-మహి

నేస్తమా సాగిపో..

సాగిపో.. సాగిపో.. సాగిపో..
మిత్రమా... సాగిపో..

గమనమే గమ్యంగా మలచుకుని,
సాగిపో.. సాగిపో...

గతుకుల దారి అయినా,
ముళ్ళు నిండిన బాటైన,

నీ ధర్మం మరవకూ,
నీ ధ్యేయం మార్చకూ..

సాగిపో... సాగిపో..
నేస్తమా సాగిపో...

మన మిత్రులు చెప్పింది కాదు,
ఉగ్గుపాలతో అమ్మ చెప్పిందే ధర్మమూ,

నీవేమిటో నీకు తెలుసు, అంతరాత్మ
సాక్ష్యమూ,
నీ విజ్ఞత నీకు తెలిపిందే ధ్యేయమూ,

ధర్మము మారదు మనిషి మారినా,
ధ్యేయం మార్చకు మబ్బులు
కమ్మినా ...

నీ గమన మే నీ గమ్యమూ,
సాగిపో.. సాగిపో.. సాగిపో..
సోదరా సాగిపో...

విప్లవాగ్నితో విశ్వశాంతి రాదూ,
వివక్షతతో విశ్వం కుశలం కాదూ,

విరజల్లు ప్రేమ కుసుమాలనూ,
విడిచిపెట్టు అసూయా ద్వేషాలనూ,

పంచితే పెరిగేది ప్రేమ,
పెంచితే త్రుంచేది దూరమూ,

నీ మంచే నీకు శ్రీరామ రక్ష,
అది మాత్రమే నీకు గమ్య కక్ష్య,

సాగిపో.. సాగిపో.. సాగిపో..
మానవా సాగిపో...

నీ గమనమే నీ గమ్యమూ,
సాగిపో.. సాగిపో.. సాగిపో...

- నండూరి రామచంద్ర రావు
9949188444

రంగవల్లి



భరణి
హైదరాబాద్



15చుక్కలు
7వరుసలు
7వరకు-సరిచుక్కలు

ముగ్గులకు ఆహ్వానం

నింగిలోని హరివిల్లులను నేలపైన పేర్చి.. కనులకింపైన రంగుల్ని అందంగా అద్దితే అది రంగుల మాలికవుతుంది. ముంగిట్లో రంగవల్లిక అవుతుంది. ధనుర్మాసం సందర్భంగా తెలుగు ముంగిళ్లలో రంగవల్లులను తీర్చిదిద్దడం ఆనవాయితీ.. ఆ సందర్భంగా ముగ్గులకు ఆహ్వానం పలుకుతోంది మాతృభూమి. ఆసక్తి కలవారు కింది చిరునామాకు ముగ్గులను పంపగలరు.

సూచనలు

★ ముగ్గులను పంపేవారు ఎ4 సైజు తెల్లకాగితంపై వేయాలి.

★ ముందుగా నల్లని ఇంక్‌తో ఔట్ లైన్ గీసిన తరువాత అందులో రంగుల్ని నింపాలి.

★ ఎన్ని చుక్కలను పెట్టి ముగ్గులు వేశారో.. అంటే సరిచుక్కలా, బేసి చుక్కలా, సందు చుక్కలా.. అనే విషయం స్పష్టంగా రాయాలి.

★ ముగ్గుతో పాటు, మీ పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫొటోని, చిరునామాని జతచేయాలి.

★ డౌన్‌లోడ్ చేసిన ముగ్గులు కాక, స్వయంగా చేతితో వేసిన ముగ్గులనే పంపాలి. అదీ చుక్కల ముగ్గులకే ఆహ్వానం.

ముగ్గులు పంపాల్సిన చిరునామా:
ఎడిటర్,
ఆంధ్రభూమి దినపత్రిక, సరోజినీదేవి రోడ్,
సికింద్రాబాద్- 500 003.

కర్మభూమి

రచనో, చిత్రమొ నాట్యమొ
రుచి పెంచెడి కర్మమొకటి ఋతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కాచుచుబ్రోచుచు మనుజుల కాంక్షలు తీర్చున్

శ్రీనరసింహ శతకము

సీ. తల్లిగర్భమునుండి ధనము తేఁడెవ్వఁడు
వెళ్ళిపోయెడి నాడు - వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమె కాని
మెఱుఁగుబంగారంబు మ్రింగబోఁడు
విత్తమార్జన చేసి విఱ్ఱవీగుటెగాని
కూడఁబెట్టిన సొమ్ము కుడువఁబోఁడు
పొందుగా మఱుగైన భూమిలోపలఁబెట్టి
దానధర్మము లేక దాచి దాచి
తే. తుదకు దొంగలకిత్తురో దొరలకవునొ
తెనె జంటీగలియ్యవా - తెరువరులకు!
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార; నరసింహ! దురితదూర!

భావం:పుట్టేటపుడు ధనమెవ్వరూ తీసుకొని రారు. వెళ్లేనాడు తీసుకొని పోరు. ఎంత డబ్బున్నా తినేది వరిఅన్నమేకాని బంగారం కాదు. డబ్బుసంపాదించి గర్వాన్ని పెంచుకోవడం కనబడుతుంది కాని ఆ సొమ్ము తింటాడా లేదా అన్నది అనుమానమే ఉదాతెనేటీగలు కష్టపడి తెనెను సంపాదించి దాచి చివరకు పరులకిచ్చినట్టుఅవుతుందేమో.



అనంతం

24 -గోపరాజు నాగేశ్వరరావు

నిజంగానే అతను చాంద్‌నీ పట్ల కోపంతో వుంటే, అతని ద్వారా చాంద్‌నీ మీద ప్రతీకారం తీర్చుకోవచ్చు. కావలసిన కార్యం గంధర్వులే తీర్చినట్టవుతుంది!

పైగా గరుడాచలానికి సహకరించిన కీర్తీ దక్కుతుంది!

చాంద్‌నీవల్ల తనకు జరిగిన అవమానాన్ని బైటికి చెప్పకుండా 'చాంద్‌నీ అంటే ఎవ్వరు' అని అడిగాడు ఎమ్మెల్యే.

''రాగ్యా తెలుసు కదా, వాడు కోరుకున్న పిల్ల. అదే తండాలో వుంటుంది. తలబిరుసు ఎక్కువ. పెద్దవాళ్ళంటే గౌరవం లేదు..''

''దానికీ నీకూ మధ్య ఏం జరిగింది'' అని సూటిగా అడిగాడు గరుడాచలం.

''సహకరిస్తానంటేనే చెప్తాను''

''తప్పకుండా'' అన్నాడు ఎమ్మెల్యే.

మనసులో ఏదీ దాచుకోకుండా జరిగినదంతా వివరంగా ఎమ్మెల్యేతో చెప్పాడు.

''దాన్నెందుకూ కొరగాకుండా చెయ్యాలి. దాని జీవితం నాశనం చెయ్యాలి. గొప్పవాళ్ళని ధిక్కరించినందుకు తగిన శాస్తి చెయ్యాలి.''

''ఏం చేద్దామంటావు'' మధ్యలోనే ఎమ్మెల్యే అడిగాడు.

''అదే ఆలోచిస్తున్నాను''

''రాగ్యా ఏమంటాడో''

''మనం చెప్పింది వినటం తప్ప 'అనటం' యీ జన్మలో వాడికి సాధ్యం కాదు''

''ఆడదాని విషయం! అంత తేలిక కాదు''

''అది నాకు వొదిలెయ్యి! వాడి విషయం నేను చూసుకుంటాను''

''ఐతే, చాంద్‌నీ వ్యవహారం నేను చూస్తాను'' అన్నాడు ఎమ్మెల్యే.

గరుడాచలం స్థిమితంగా కూర్చున్నాడు.

''చాంద్‌నీ వివరాలు పూర్తిగా చెప్పు'' అన్నాడు ఎమ్మెల్యే.

''రెడ్డియానాయక్ తండాలో పుట్టింది. నగ్గూరాం కూతురు. తల్లి లేదు. చాలా కాలం క్రితమే అడవిలో పులి మింగింది. అందంగా ఉంటుంది. మాటకారి పిల్ల. ధైర్యస్థురాలు. భయం తెలియదు. ఎదిరించే గుణం వుంది. తండ్రీ కూతుళ్ళు తప్ప దగ్గరి బంధువుల్లేరు. ఎక్కడో లోతట్టు అడవిలో వున్న భూక్యానాయక్ తండాలో కొద్దిమంది దూరపు బంధువులున్నారు. రాగ్యా దానిమీద మనసు పడ్డాడు. వాడంటే దానికి ఇష్టం లేదు. అదీ దాని కథ'' అని చెప్పాడు గరుడాచలం.

''నగ్గూరాం ఎలాంటివాడు? వాడి స్థాయి ఏమిటి? అడవిలో వున్న తండాల్లో వాడికి పలుకుబడి వుందా?''

''మంచివాడు. అమాయకుడు.. వాడి స్థానం అంతే! తండాల్లో గుర్తింపు పొందినవాడేమీ కాదు. సామాన్యుడు.''

కీ.శే. పెద్దిరెడ్డి కొడుకు ఎమ్మెల్యే పెంటారెడ్డి గరుడాచలంతో మాట్లాడుతూనే ముగ్గులోకి దించే సమయం కోసం ఎదురుచూస్తున్నాడు.

ఎప్పుడేం మాట్లాడాలో, ఎప్పుడేం చెయ్యాలో రాజకీయానుభవం అతనికి నేర్పింది!

అసలు విషయం చెప్పే సమయం వచ్చిందని గ్రహించాడు!

''నీకు జరిగిన అవమానం తల్చుకుంటేనే రగిలిపోతున్నది. చాంద్‌నీని విడిచిపెట్టను. ప్రతీకారం తీర్చుకుంటాను.. స్నేహితుడిగా నీకు నేను చేసే సహాయం అదే'' అన్నాడు. గరుడాచలం వైపు సూది కళ్ళతో చూస్తూ.

గరుడాచలం మొహం విప్పారింది.

''ఏం చేద్దాం'' అని ఆసక్తిగా అడిగాడు.

''జోగిన్ని చేద్దాం''

బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు గరుడాచలం!

హఠాత్తుగా ఎమ్మెల్యే అలా చెప్పింది నమ్మలేక, జీర్ణించుకోలేక సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ, 'నిజంగానే?'' అన్నాడు గరుడాచలం.

''నీకోసం''

లోలోపల గరుడాచలానికి సంతోషంగా ఉంది!

నమ్ముకున్న రాగ్యా ఆశించిన అమ్మాయిని కోరుకోవటం తప్పంటారని బైటపళ్ళేదు కానీ, చాంద్‌నీ గరుడాచలం కళ్ళల్లో మెదుల్తూనే వుంది!

నీటికొలను దగ్గర తొలిసారి చూసిన క్షణమే అతను మనసు పారేసుకున్నాడు. చాంద్‌నీ అందానికి ముగ్ధుడై చూపులు మరల్చుకోలేకపోయాడు. అనుభవిస్తే దాన్నే అనుభవించాలనుకున్నాడు మనసులో! రాగ్యాతో ఆ విషయం చెప్పలేకపోయాడు.

ఎమ్మెల్యే అన్నట్టు జరిగి, చాంద్‌నీ జోగినీ ఐతే సమస్య తీరిపోతుంది. అందరూ దాన్ని అనుభవించొచ్చు!

రాగ్యా కూడా ఏమీ అనుకోడు. 'దైవకార్యం' కనుక తప్పనడు!

''అలా చేస్తే అందరి పంటా పండినట్టే'' అన్నాడు సంతోషంతో తబ్బిబ్బవుతూ గరుడాచలం.

''రాగ్యాని డీల్ చేసే బాధ్యత నీది. దాన్ని జోగిన్ని చేసే బాధ్యతనాది'' అన్నాడు ఎమ్మెల్యే.

''నీకు రుణపడి వుంటాను'' అనటం తప్ప, గరుడాచలం గొంతులోనుంచి మాటలు వెలువడలేదు. ఆనందంతో గొంతు పూడుకొనిపోయింది. తబ్బిబ్బవుతూ కంగాళీగా మారాడు.

''త్వరలో జరగబోయే కొండదేవర జాతరకి నీ కోర్కె నెరవేరుతుంది'' అని నిజంగానే హామీ ఇచ్చాడు ఎమ్మెల్యే.

***

గరుడాచలం గుడారానికి వెళ్లిన తర్వాత రాగ్యా ఇంటికి బయల్దేరాడు. తండా దగ్గర పడుతున్న కొద్దీ అతనికి భయంగా వుంది.. కోపంగానూ వుంది.

ఎంత పని చేసింది చాంద్‌నీ!

తనను రాయితో కొట్టటమే కాకుండా గరుడాచలాన్ని కూడా అవమానించింది. తీవ్రంగా పరాభవించింది.

అతను చాలా గొప్పవాడు. ఎంతకైనా సమర్థుడు.

చాంద్‌నీని విడిచిపెడతాడా? అతను ప్రతీకారం తీర్చుకుంటే ఏమైపోతుందో ఆమె!

అప్పటికే చాంద్‌నీ, వాల్యా ఇళ్ళకి చేరుంటారు.

నీటికొలను దగ్గర జరిగిందంతా తండా వాళ్ళతో చెప్తే ఏమౌతుందో?

చాంద్‌నీ ఫిర్యాదు చేస్తే తండా పెద్దలు చింతచెట్టు క్రింద పంచాయితీ పెడతారు. ఏం జరిగిందో తెలుసుకుంటారు. తప్పు నిరూపించి దండన విధిస్తారు. చింత బరికలతో కొడతారు.

ఎంత అవమానం!

చాంద్‌నీ అలా చెప్పకపోతే ప్రమాదం లేదు. ఐనా పొదల్లో లాక్కొని వెళ్ళబోయిన విషయం చెప్పింది, ఇపుడు చెప్తుందా?

ప్రమాదమల్లా అది చెప్తేనే! పరువు ప్రతిష్ఠలకు భయపడి చెప్పకపోతే ఏమీ వుండదు.

ఏమౌతుందో చూడాలి.

(ఇంకా ఉంది)



జానకి విముక్తి

-ముప్పాళ్ళ రంగనాయకమ్మ

కృత్రిమత్వం, అహజత్వం ఎక్క డ వెదికినా కనిపించవు. ఎంతో నిజాయితీతో ప్రజల మధ్యకొచ్చిన రచనగా స్పష్ట పడుతుంది జానకి విముక్తి.

ఈ దోపిడీ సమాజమే స్త్రీ బ్రతుకు నిలా ఛిద్రం చేసిందనే స్పష్టమైన, నూతన అవగాహన పాఠకుడికి నవల పూర్తయ్యేసరికి కలుగుతుంది.

బాధ్యతగల పాఠకులకూ, చదివిన దాన్నుండి కొత్త జ్ఞానం నేర్చుకోవాలనే తపన వున్నవాళ్లకు జానకి విముక్తి నవల ఎంతో మేలు చేస్తుంది. నవలలోని ప్రతి అంశం జీవంతో తొణికిసలాడుతూ పాఠకుడికి విజ్ఞానపూరిత సంభ్రమాలను కలిగిస్తుంది. ఇది శాస్త్రీయరచన. అభివృద్ధికరమైన రచన. వ్యవస్థలు మారినా తెలుగు నవలా సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయే రచన. నవలలోని వివిధ అభివృద్ధికర విషయాలే దానికా విలువని తెచ్చిపెట్టాయి.

వినమరుగైన..

-జి.మోహన్‌రావు

నవలలో పేజీ పేజీన రచయిత్రి బాధ్యత కనపడుతుంది. నిజాయితీతో కూడిన స్పందన కనబడుతుంది. పరిశుభ్రమయిన జీవితం అంటే ఏమిటో పాఠకుడికి అర్థం అయ్యేలా చేసే తపన కనబడుతుంది. వివిధ వర్గాల ప్రజల సమస్యల మధ్య సంబంధముందనీ, అవి విడివిడిగా పరిష్కారం కావనీ, అన్ని సమస్యల పరిష్కారానికి ఒక మూలం వుందనీ, రచయిత్రి స్పష్టంగా, స్ఫటికమంత స్వచ్ఛంగా చెపుతారీ నవలలో. ఈ నవల పూర్తయ్యేసరికి రాజకీయాలంటే ఏమిటో, అవి తమ జీవితాలనెలా శాసిస్తాయో పాఠకుడికి ప్రాథమిక పరిజ్ఞానం కలుగుతుంది. కళ కళ కోసంకాదు, కళ పీడిత ప్రజల అభివృద్ధి కోసం అనే నానుడికి ఈరచన నిలువెత్తు సాక్ష్యం.

ఇపుడిప్పుడే రచనా రంగంలోకి అడుగుపెడుతూ, పీడిత ప్రజల బాగు కోసం కలంపట్టేవారికి జానకి విముక్తి చక్కటి స్ఫూర్తినిస్తుందనటంలో సందేహం లేదు.

యువ రచయితలు ఈ రచన ద్వారా ఎన్నో నేర్చుకోవచ్చు. సమాజంలోని ఏ ఏ వర్గాల్ని రచయిత ఎలా చిత్రించాలో, ఆయా పాత్రలపై వ్యాఖ్యానాలు చేస్తున్నపుడు ఎలా స్పందించాలో, రచయిత మనోభావాల్లో రావాల్సిన దయ, కోపం, ద్వేషం, వెటాకారం వంటి అంశాలు కూడా మనకు అర్థమవుతాయి. సమాజంలో తారసపడే అన్నివర్గాల ప్రజల పట్ల ఒకే రకపు తత్వం, జడత్వం ప్రదర్శించకూడదని రచయిత కాబోయే పాఠకుడు జానకి విముక్తి ద్వారా గ్రహించగలుగుతాడు.

ఇప్పటి సమాజంలోని బీదలు, ముఖ్యంగా స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ ఈ నవలల్లో చూస్తాము. ఈ బ్రతుకులు ఇంత లోపభూయిష్టంగా ఎందుకు మలచబడ్డాయో అర్థం చేసుకుంటాము. ఈ లోపాల్ని సరిదిద్దటానికి ఏం చేయాలో పాఠకుడికి నవల పూర్తయ్యేసరికి కనీస అవగాహన ఏర్పడుతుంది. ఆ ప్రభావంలో నుండి ఇక పాఠకుడు బైటపడలేడు అంత తేలిగ్గా. ఇంకో రకంగా చెప్పుకోవాలంటే సత్యానికున్న ప్రభావం ఏమిటో, అది మానవ మస్తిష్కాన్ని ఎలా తన ఆధీనంలోకి తీసుకుంటుందో అర్థమైపోయి సంభ్రమాశ్చర్యాలకు లోనవుతాము.

జీవితాంశాలను సూక్తుల్లోకి మార్చి, తాత్కాలిక తార్కికానందాన్ని కలిగించే మేధావులకన్నా, జీవితాన్ని విస్పష్టంగా విశ్లేషించి విముక్తి మార్గం చూపించే ప్రజా కళాకారుల వల్ల నిజమైన మేలు జరుగుతుంది. తెలుగు ప్రజల సాంస్కృతిక వీరుడు గుడిపాటి వెంకటాచలం, స్త్రీ సమస్యను నిర్భయంగా, నిజాయితీగా వ్యాఖ్యానించిన రచయిత ఆయన. స్త్రీకి కూడా హృదయం వుంటుందనీ, మెదడు వుంటుందనీ వాటికి స్పందనా, వివేచనా కావాలనీ ఆయన చెప్పినపుడు ఆ అభ్యుదయ భావాల్నీ, రచనల్నీ చూచి తెలుగు ఛాందస సమాజం నివ్వెరపోయింది.

-సశేషం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన
శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

మాటాట

నిర్వహణ: సుధామ | 1834

■	1		2		■	3
4	■	■		■	■	
5	6	■		■	7	
■	8		■	9		■
10		■	11	■		■
	■	12		■	■	13
	■	■	14			

ఆధారాలు

అడ్డం

1.కొత్త సంవత్సరము
5.సు, మేలు
7.అభిలషించి
8.మాట, పలుకు
9.పిపీలికం
10.తమరికి
12.యవనిక
14.గ్రీటింగ్

నిలువు

2.ప్రేమ
3.చేపలు పట్టేవాడు
4.పువ్వు
6.వర్షపు చుక్క
7.సుకుమార వనిత
10.పాలపై పేరుకునేది
12.ఈ రాముడూ అవతార పురుషుడేనట!
13.లక్షణంగా కలిగిన సొమ్ము

మాటాట-1833 సమాధానాలు

అడ్డం		నిలువు	
1.వలస	8.మునుపు	1.వత్సరాంతం	6.గోపురం
4.మత్సరము	10.వేడుకలు	2.లర	9.నడుము
7.వసంతం	12.టముకు	3.సముద్రము	10.వేట
		5.కావలి	11.కకు

గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారమే జనవరి 1

ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో సంవత్సరాది పండగను వివిధ దినాలలో జరుపుకుంటారు. ఇలా జరుపుకోవడానికి కారణం సంవత్సర పరిగణనం వేరువేరు మాసాలలో జరగడమే. ప్రపంచంలో అత్యధికులు ఆచరించేది నేపుల్స్‌కు చెందిన అలోయిసియస్ అనే వైద్యునిచే రూపొందించబడి, పోప్ గ్రెగోరీ - 8చే యయారు చేయబడిన ప్రస్తుత గ్రెగోరియన్ క్యాలెండర్ క్రీ.శ.1582లో రూపొందించినది. జనవరి 1వ తేదీన నూతన సంవత్సర తొలి రోజును పండగలా జరుపుకోవడం సాపేక్షంగా కొత్త దృగ్విషయం. క్రీ.పూ.2000లో వసంత సమరాత్రి సమయాన మార్చి మధ్య కాలంలో మెసపొటేమియాలో నూతన సంవత్సర ఉత్సవాలు తొలి నాళ్ళలో జరుపుకునే వారు. ఈజిప్టియన్లు, ఫొయెనిషియన్లు, పర్షియన్లు సమరాత్రి ప్రారంభం, గ్రీకులు శీతకాల ఆయనాంత సమయాన జరుపుకునే వారు. పూర్వపు రోమన్లు మార్చి నెల 1వ తేదీని కొత్త సంవత్సర ఆరంభ దినంగా నియమం పెట్టుకున్నారు. ఆనాటి క్యాలెండర్ మార్చితో ప్రారంభమై 10నెలలతో కూడి ఉండేది. లాటిన్‌లో సెప్టెం అనగా ఏడు అని, అక్టో అనగా ఎనిమిది అని, నొవం అనగా తొమ్మిది అని, దశం అనగా పది అని అర్థం. క్రీ.పూ.153లో ప్రప్రథమంగా జనవరి 1ని నూతన సంవత్సర తొలి రోజుగా పరిగణించారు. వాస్తవానికి క్రీ.పూ.700 వరకు జనవరి మాసం ఉనికే లేదు. రోమ్ రెండవ రాజైన నుర్మా పొంటిలియస్ జనవరి, ఫిబ్రవరి మాసాలను జత చేయడం జరిగింది. రోమ్ సామ్రాజ్యంలో పౌరయుద్ధం చోటు చేసుకుని, గణతంత్ర రాజ్యంలో ఇరువురు ఉన్నతాధికారులైన అమాత్యులు కొత్తగా ఎన్నికైన సందర్భాన వారి పదవీకాలాన్ని ఏడాదిగా నిర్ణయించారు. ఆ సందర్భంగా మార్చి నుండి జనవరికి తొలి రోజును మార్చినా, అది ఖచ్చితంగా పాటించబడలేదు. అప్పటికీ మార్చి 1ననే కొత్త సంవత్సర వేడుకలు జరిగేవి. క్రీ.పూ.46లో జూలియస్ సీజర్ ప్రాచీన చాంద్రమానాధారిత రోమన్ క్యాలెండర్‌ను మెరుగు పరిచి, సౌర మాన ఆధారిత నూతన క్యాలెండర్‌ను పరిచయం చేయగా, సదరు క్యాలెండర్ జనవరి 1ననే కొత్త సంవత్సర ప్రారంభ దినంగా పరిగణింప చేయగా, అది క్రమేణ నిలకడగా పాటించ బడింది. మధ్యయుగాన ఐరోపాలో నూతర వత్సర సంబరాలు అన్యమత సంబంధమైనవిగా భావించబడగా, క్రీ.శ.567లో జనవరి 1వ తేదీన నూతన సంవత్సర ప్రారంభ దినాన్ని పాలకులచే రద్దు చేయబడింది. మధ్యయుగ క్రైస్తవ ఐరోపాలో చాలా వరకు కొత్త సంవత్సర దిన వేడుకలను జీసస్ జన్మదిన సందర్భంగా డిసెంబర్ 25న, మార్చి 1న, మార్చి 25న, ఈస్టర్ సందర్భంగా పాటించేవారు. 1582వ సంవత్సరంలో సంస్కరింపబడి, పురుద్ధరింప బడిన గ్రెగోరియన్ క్యాలెండర్ జనవరి 1వ తేదీని ప్రకటింపగా, వెనువెంటనే చాలా వరకు క్యాథలిక్ దేశాలు స్వీకరించాయి. తర్వాత క్రమంగా ప్రొటెస్టెంట్ దేశాలు కూడా స్వీకరించాయి. హోలీ రోమన్ సామ్రాజ్యం క్యాథలిక్ స్టేట్స్ 1583లో, స్పెయిన్, పోర్చుగల్, పోలండ్‌లు 1582లో, రోమన్ సామ్రాజ్యం ప్రొటెస్టెంట్ స్టేట్స్ 1700లో, స్వీడెన్ 1753లో, ఫ్రాన్స్, సదరన్ నెదర్లాండ్, లారెయిన్, డచ్ రిపబ్లిక్‌లు 1582లో, స్కాట్‌లాండ్ 1752లో, రష్యా 1918లో గ్రెగోరియన్ క్యాలెండర్‌ను స్వీకరించి, ఆచరణ ప్రారంభించాయి. అయితే 1752వరకు బ్రిటిషర్లు కూడా స్వీకరించలేదు. అప్పటికీ బ్రిటిష్ సామ్రాజ్యం, వారి అమెరికన్ కాలనీలు మార్చి మాసంలోనే నూతన సంవత్స వేడుకలు జరుపుకునే వారు. 1752 తర్వాత బ్రిటిష్ రాచరిక పాలకులు తమ ఆధీనంలోని దేశాలన్నింటిలో జనవరి 1వ తేదీని నూతన సంవత్సర తొలి రోజుగా ఆచరించే చర్యలు గైకొన్నారు. మొట్టమొదటి సారిగా గ్రెగోరియన్ క్యాలెండర్‌కు, జూలియస్ సీజర్ క్యాలెండర్‌కు గల 10రోజుల వ్యత్యాసాన్ని సవరించి, 1582 అక్టోబర్ మాసంలో 5నుండి 14వ తేదీలను ఇటలీ, పోర్చుగల్, స్పెయిన్, పోలండ్ దేశాలలో లేకుండా చేసి, 4తర్వాత 15ను మార్చడం జరిగింది. జనవరి 7 ఈజిప్టియన్లు, 11న ఓల్డ్ స్కాటిష్, 14న ఈస్టర్న్ ఆర్థడాక్స్, 21న కొరియన్లు, మార్చి 1న రోమన్లు, ఏప్రిల్ 13,14ను (బైసాకి) నానక్ సాహి క్యాలెండర్ ఆధారంగా సిక్కులు, ఉగాదిని తెలుగువారు, ఏప్రిల్ 14ను అగ్నేయాసియా దేశాలు, ఏప్రిల్ మొదటి వారంలో పౌర్ణమిని బౌద్ధులు, మొహర్రం నెల మొదటి రోజు ఇస్లాం, జూన్ 21ని ఏనిషియెంట్ గ్రీక్, జూలై 8ని ఆర్మేనియన్, ఆగస్టు 8ని మళయాళీలు, 23ను జొరాస్ట్రియన్, సెప్టెంబర్ 1ని రష్యన్ ఆర్తడాక్స్ క్రిస్టియన్, 11ను ఇథియోపియన్, అక్టోబర్ 3ను మొరాకో, నవంబర్‌లో దీపావళిని జైనులు, డిసెంబర్‌లో సిక్కిం న్యూ ఇయర్ డేగా పాటించడం అనవాయితీ.

-సంగనభట్ల రామకిష్టయ్య



రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

●**మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)** కోపాన్ని అదుపులో ఉంచుకొనుట మంచిది. మానసికాందోళనను తొలగించుకొనేందుకు దైవధ్యానం అవసరం. శారీరక అనారోగ్యంతో బాధపడతారు. కుటుంబ విషయాలు సంతృప్తికరంగా ఉండవు. వృథా ప్రయాణాలు. ధన వ్యయం తప్పదు.

●**వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)** కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆరోగ్యం గూర్చి శ్రద్ధ వహించాలి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. నూతన కార్యాలు ప్రారంభించకుండా ఉండటం మంచిది. ఆత్మీయుల సహాయ సహకారాలకై సమయం వెచ్చించాల్సి వస్తుంది.

●**మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)** ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. ఆకస్మిక భయాందోళనలు దూరమవుతాయి. రుణ ప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి. కుటుంబంలో మనశ్శాంతి లోపిస్తుంది. బంధు మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. రహస్య శతృబాధలుండే అవకాశం ఉంది.

●**కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)** అనారోగ్య బాధలను అధిగమిస్తారు. నూతన కార్యాలకు ఆటంకాలున్నా సత్ఫలితాలు పొందుతారు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. వృత్తి వ్యాపార రంగాల్లో ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించాలి. ఆత్మీయుల సహాయ సహకారాలకై వేచి ఉంటారు. దైవదర్శనం లభిస్తుంది.

●**సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)** కుటుంబంలో సుఖ సంతోషాలుంటాయి. ధన ధాన్యాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు విజయాన్ని సాధిస్తారు. ప్రయత్న కార్యాలు ఫలిస్తాయి. గృహంలో జరిగే మార్పులు సంతృప్తినిస్తాయి. బంధుమిత్రులతో కలుస్తారు. ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి.

●**కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)** నూతన వస్తు వస్త్ర వాహన ఆభరణ లాభాలను పొందుతారు. ఆకస్మిక ధనలాభ యోగముంటుంది. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. బంధుమిత్రులతో కలిసి విందులు వినోదాల్లో పాల్గొంటారు. ఒక ముఖ్య కార్యక్రమం పూర్తవుతుంది.

●**తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)** ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు ఆభరణాలను పొందుతారు. కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఇతరులకు ఉపకారం చేయుటకు వెనుకాడరు. రుణ బాధలు తొలగిపోతాయి. శత్రుబాధలుండవు.

●**వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)** కుటుంబ కలహాలు దూరమవుతాయి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. వృథా ప్రయాణాల వల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా ఉండుట మంచిది. అందరితో స్నేహంగా ఉండుటకు ప్రయత్నించాలి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా ఉంటాయి.

●**ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)** నూతన కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధుమిత్రులతో కలిసి విందులు వినోదాల్లో పాల్గొంటారు. శుభవార్తలు వింటారు. మనోల్లాసాన్ని పొంది, ఆనందంగా కాలక్షేపం చేస్తారు.

●**మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)** వృత్తి రీత్యా ఇబ్బందులను అధిగమిస్తారు. మానసికాందోళనతో కాలం గడుపుతారు. స్త్రీలు చేసే వ్యవహారాల్లో సమస్యలెదురవుతాయి. ఆకస్మిక ధననష్టం ఏర్పడే అవకాశముంటుంది. రహస్య శత్రువుల పట్ల జాగ్రత్తగా నుండుట మంచిది. ఏ విషయంలోనూ నిరుత్సాహం పనికిరాదు.

●**కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)** అద్భుతమైన అవకాశాలను పొందుతారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరుతాయి. ముఖ్యమైన శుభవార్తలు వింటారు. ఆత్మీయుల సహాయ సహకారాలు సంపూర్ణంగా లభిస్తాయి. అనుకోకుండా డబ్బు చేతికందుతుంది. నూతన వస్తు ఆభరణాలు సేకరిస్తారు.

●**మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)** స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరింపబడతాయి. నూతన గృహ కార్యాలపై శ్రద్ధ వహిస్తారు. ఆకస్మిక ధన లాభంతో ఆనందిస్తారు. బంధు మిత్రులతో కలిసి విందులు వినోదాల్లో పాల్గొంటారు. దైవదర్శనం చేసుకుంటారు. భక్తిశ్రద్ధ లధికమౌతాయి.

ధర్మభూమి

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

ఆంధ్రభూమి మంగళవారం, 1 జనవరి 2019 11

భక్త జనవరదుడు శివుడు



ఈశ్వరుడు ఉబ్బిబ్బిబ్బయిపోయి భక్తులకు కష్టాలు కలుగకుండా చేస్తాడు. శివుణ్ణి కొలిచే దంపతులకు దాంపత్య జీవితం సాఫీగా సాగిపోతుంటుంది. దంపతుల మధ్య ఎలాంటి అరమరికలు రావు. శివుడికి ఆడంబరంగా, నగలు, పూలతో పూజలు చేయాలనేది ఏమీ లేదు. పట్టువస్త్రాలు, పూలపాన్పులు అవసరం లేదు. కటికనేలపై తిరిగేవాడికి కష్టమెక్కడిది? పార్వతీదేవికి తన శరీరంలో సగ భాగమిచ్చి, గంగమ్మను తలపైన మోస్తూ తాను నడుస్తుంటే అడుగు వేసినపుడల్లా నెత్తిన వున్న గంగమ్మ ఒక్కొక్క బొట్టుగా తనపైన రాలుతుంటే ఆ ఉత్సాహంతో గంగాధరుడు వడివడిగా కదులుతుంటాడు. శివాలయాలన్నీ కూడా 'ఓం నమశ్శివాయః' అనే పంచాక్షరి మంత్రంతో మారుమ్రోగిపోతుంటాయి. ఆ మంత్రం పఠించేటపుడు నాభి నుండి శ్వాసను తీసి ఉచ్చరిస్తుంటే ఉచ్ఛ్వాస నిశ్వాసల్లో కూడా ఎంతో మాధుర్యం ఉంటుంది.

భక్తులు విష్ణుమూర్తికిఅలంకరణ చేయడంకన్నా, శివునికి అభిషేకం చేయడంలోనే తనివితీరా తృప్తిని పొందుతారు. ఎందుకంటే ఆ భగవంతున్ని తాకే అదృష్టం ఎవరికుంటుంది? ఎంతటి గొప్పవారైనా అంటే రాజకీయ నాయకులైనా, అధికారులైనా, విఐపిలైనా అలంకారప్రియుడైనటువంటి విష్ణుమూర్తివద్దకు గర్భగుడిలోకి వెళ్లి ఆ మూర్తిని తాకలేడు. కేవలం అటువంటి భాగ్యం మండపం వరకు మాత్రమే పరిమితం. నయనాలతో చూసి సంతోషించాల్సిందే మరి. అదే శివాలయాల్లోకి ప్రతిభక్తుడు కూడా వెళ్లి అభిషేకాలు చేసి, కోరికలు కోరుకునే అవకాశం ఉంటుంది. ఇలాంటి అభిషేకం తన భక్తులను ఇంకా తన దగ్గరికి చేసుకుంటుంది. ఆ లింగరూపుని తాకినంతనే భక్తులు పొంగిపోయి తమ జన్మ సార్ధకమైందనుకుంటారు. ఇక ఈజన్మకు ఇంతటి అదృష్టం చాలు అనుకుంటారు. పరమేశ్వరుని ఆలయాలు అవి గ్రామాల్లో కావచ్చు, ద్వాదశ జ్యోతిర్లింగాల్లో కావచ్చు, ఎక్కడైనా ఆ రూపాలను తాకి అభిషేకించి ఆ తృప్తిని పొందే అవకాశం ఉంటుంది. కాస్త నీళ్లు పోసి, భస్మం రాసి, బిల్వపత్రాలు పెట్టినంతనే కష్టాలను పోగొట్టి కోరిన కోర్కెలను తీర్చుతాడు. శివున్ని పూజించేవారు కోటీశ్వరులు కాకపోవచ్చు. కానీ కష్టాలనుండి బయటపడగలుగుతారు. ఇది సత్యం.

అలంకార ప్రియో విష్ణుః
అభిషేకప్రియః శివః
నమస్కారప్రిః సూర్యః
గణేశః తర్పణ ప్రియః

అలంకరణ అంటే విష్ణుమూర్తికి చాలా ఇష్టం. కాసిన్ని నీటితో అభిషేకం చేయడమంటే శివుడికి ప్రీతికరం. నమస్కారాలు చేయడమంటే సూర్యభగవానుడికి ఇష్టం. ఇప్పటికీ ఉదయం పూట, సాయంకాలంపూట సూర్యనమస్కారాలు, సంధ్యావందనం చాలామంది చేస్తుంటారు. శ్రేష్ఠం కూడా. అదేవిధంగా 54 రకాలయిన తర్పణాలు చేయడమంటే గణనాధునికి ఇష్టం.

వీటన్నింటిలోకి సాధారణ మానవునికి అతిసులువైనది, అందుబాటులో ఉండేది ఆ ఆదిశకరునికి అభిషేకం చేయడమే. శివుడి రూపాన్ని లింగరూపంలోనే చూస్తాము. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఎక్కడ ఏ పేరుతో పిలిచినప్పటికీ లింగరూపంలోనే తన భక్తులకు దర్శన భాగ్యాన్ని కలిగిస్తాడు. ఏ దేవుణ్ణి కూడా అంటే శ్రీ వెంకటేశ్వరస్వామి, సత్యనారాయణస్వామి, కృష్ణుడు, శ్రీరాముడు ఎవరినైనా చూడటం తప్ప స్పర్శించే భాగ్యం ఉండదు. వీరిని అలంకరిస్తేనే, ఆభరణాలు పెడితేనే భక్తుల కంటికి అందంగా, సుందరంగా కన్పిస్తారు. కానీ శివుడ్ని ఎవరూ కూడా అలంకరణలో చూడాలని కోరుకోరు. ఎందుకంటే ఆ పరమేశ్వరుడు నిరాడంబరుడు కావడమే. శివుణ్ణి భస్మం, నీరుతో అభిషేకించి, బిల్వం, మారేడు దళాలు తనపై ఉంచితే ఆ కాస్త భాగ్యానికే పొంగిపోతాడు ఆ భోళాశంకరుడు. మరి అంతటి అదృష్టం లభించిన భక్తుడికి ఇంకెంత సంతోషం ఉంటుంది. నీళ్లు పోసినపుడు శివుడు చిన్నపిల్లోడికి చక్కలిగింతలు పెడితే ఎటువంటి కల్మషం లేకుండా నవ్వుతాడో, అదేమాదిరిగా ఆ

-శ్రీనివాస్ పర్వతాల


సారస్వతోపాఖ్యానం



ధృతరాష్ట్రుడు కోపించి అక్కడ మరణించి ఉన్న కొన్ని ఆవులను చూపించి ఇలా అన్నాడు "బ్రాహ్మణోత్తమా! నీ కిష్టమైతే వీటిని తీసుకొనివెళ్లు". ధర్మవేత్త అయిన ఋషి ఆ రాజు మాటలు విని "అయ్యో! సభలో ఈ రాజు ఎంత క్రూరంగా మాట్లాడాడు" అని చింతించాడు. తర్వాత అతను క్రోధంతో ధృతరాష్ట్రుని నాశనం చేయాలని తలచాడు. అతను ఆ మృత పశువులను ముక్కలుగా చేసి వాటితో ఆ రాష్ట్రానికి ఆహుతి చేయసాగాడు. సరస్వతీ తీరంలోని అవాకీర్ణ తీర్థంలో అగ్నిని ప్రజ్వలింపజేసి ఆ ముక్కలని ఆ రాష్ట్రాన్ని ఆహుతి చేశాడు. అప్పుడు ధృతరాష్ట్రం క్షీణించసాగింది. అనేక ఇబ్బందులు రాజ్యానికి కలిగాయి. దానితో భయపడి రాజు, బ్రాహ్మణులు కూడా బాధపడ్డారు. ఇలా ఎందుకు జరిగిందని పండితులని ప్రశ్నించాడు. అప్పుడు వారు ఇలా చెప్పారు. "పశువులను యాచించిన బకమునికి మీరు అవమానించారు. దానితో కోపించి ఆ ముని ఆ మృతగోవులతో నీ రాజ్య నాశనానికి ఆహుతి చేస్తున్నాడు. అందువల్ల నీ రాజ్యానికి ఈ వినాశనం కలుగుతున్నది. ఆయన తపస్సు ప్రభావం వలన నీ రాజ్యానికి మహాప్రళయం సంభవించబోతున్నది. కనుక సరస్వతీ తీరానికి వెళ్ళి ఆ ముని కాళ్లమీద పడి ఆయనను ప్రసన్నుని చేసుకో".

వారి సలహా విని ధృతరాష్ట్రుడు సరస్వతీనది దగ్గరకు వెళ్ళి బకునితో మాటలాడాడు. రాజు తలను నేలకు ఆనించి, చేతులు జోడించి బకమునితో ఇలా ప్రార్థించాడు. "స్వామీ! నాయందు ప్రసన్నం కండి. నా అపరాధాన్ని క్షమించండి. మంద బుద్ధినై, నేను లోభత్వంతో, మూర్ఖత్వంతో తప్పు చేశాను. ఇప్పుడు నా రాజ్యసంక్షోభంలో నాకు మీరు తప్ప దిక్కెవరూ లేరు. నా మీద దయచూపండి". ఈ విధంగా శోకిస్తున్న రాజును చూసి బకుడు ఆయన మీద దయ తలచి రాజ్యానికి విముక్తి కలిగించాడు. రాజు ఆయనకు అనేకమైన పశువులను దక్షిణగా సమర్పించాడు. వాటిని తీసుకొని బకుడు ఆనందంతో నైమిశారణ్యానికి వెళ్లిపోయాడు. బృహస్పతి కూడా రాక్షస నాశనం కోసం అక్కడ ఆహుతులను సమర్పించాడు. సరస్వతీ తీర్థాలలో ఇంకొక తీర్థం వశిష్ఠపవాహ తీర్థం. ఈ తీర్థంలో నది అత్యంత వేగంతో ప్రవహిస్తుంది. దానికొక కారణముంది.

వశిష్ఠ మహర్షికి, విశ్వామిత్రునికి తీవ్రమైన శతృత్వముండేది. తపస్సులో పోటీపడడంతో ఈ శతృత్వం కలిగింది. స్థాణుతీర్థంలో పడమటి ఒడ్డున విశ్వామిత్రుని ఆశ్రమం, తూర్పు ఒడ్డున వశిష్ఠుని ఆశ్రమం ఉండేవి. అక్కడ పూర్వం శంకరుడు ఘోరతపస్సు చేశాడు. స్థాణువు (శివుడు) అక్కడ యాగం చేసి సరస్వతిని పూజించి ఆ తీర్థాన్ని ఏర్పరిచాడు. ఆ తీర్థంలోనే తారకుని నాశనం కోసం స్కందుని దేవసేనాధిపతిగా అభిషేకించారు. ఆ తీర్థంలోనే విశ్వామిత్రుడు తీవ్రంగా తపస్సు చేసి వశిష్ఠుని చలింపజేశాడు. ఆ మహర్షు లిద్దరూ పోటీపడి తపస్సు చేసేవారు. వశిష్ఠుని తేజస్సు చూసి విశ్వామిత్రుడు చింతకు లోనయ్యేవాడు.



అప్పుడు అతను ఇలా ఆలోచించాడు "ఈ సరస్వతీ నది తపోనిధి అయిన వశిష్ఠుని వేగంగా నా దగ్గరకు తీసుకొనిరావాలి. అప్పుడు అతన్ని తప్పక చంపివేస్తాను". ఆ ముని క్రోధంతో నదిని ధ్యానించాడు. అలా స్మరించడంతో ఆ నదీమతల్లి కలత చెందినది. ఆమె వివర్ణమైన ముఖంతో, చేతులు జోడిస్తూ విశ్వామిత్రుని దగ్గరకు వచ్చింది. ఆమె తీవ్రంగా దుఃఖిస్తూ "ఏమి చేయాలో చెప్పండి" అని ఆ మునిని వేడింది. విశ్వామిత్రుడు కోపంతో "వెంటనే వెళ్ళి వశిష్ఠుని తీసుకొనిరా" అని ఆజ్ఞాపిం చాడు.

సరస్వతి అతని మాటలతో అతను చేయబోయే పాపకర్మను తెలుసుకొని, వశిష్ఠుని తపశ్శక్తి తెలుసు కనుక, వశిష్ఠుని దగ్గరకు వెళ్ళి విశ్వామిత్రుడు తనను ఆదేశించిన విషయం చెప్పింది. ఆమె ఇద్దరి శాపాలకు భయపడి కంపించ సాగింది. భయపడి కృశించి పోతున్న నదిని చూసి ఆ తపోధనుడు వశిష్ఠుడు ఇలా అన్నాడు "నదీమ తల్లీ! నిన్ను నీవు కాపాడుకో. లేకపోతే విశ్వామిత్రుడు నిన్ను శపించవచ్చు. నా గురించి నీవు విచారించవద్దు".

అప్పుడు నదీమతల్లి ఇలా ఆలోచించింది. "వశిష్ఠుడు నాపై ఎంతో దయ చూపాడు. అతనికి హితమైన పని చేయాలి" ఇలా ఆలోచిస్తూ తన ఒడ్డున జపం చేస్తూ హోమం చేస్తున్న విశ్వామిత్రుని చూసి, ఇదే సరియైన అవకాశమని భావించి తన వేగంతో తూర్పు ఒడ్డును బ్రద్దలు చేసి ప్రవహించ సాగింది. అలా కొట్టుకుపోతున్న ఒడ్డుతో పాటు వశిష్ఠుడు కూడా కొట్టుకొనిపోయాడు. అతను అలా అలా కొట్టుకొనిపోతూ సరస్వతీనదిని ఇలా స్తుతించాడు.

"తల్లీ! నీవు పితామహుని సరస్సు నుండి ప్రభవించావు. అందుకే నీవు సరస్వతి అని పిలువబడ్డావు. నీ నీటితో ఈ విశ్వమంతా వ్యాపించింది. నీవు ఆకాశంలో ప్రవహించి, మేఘాలలో నీటిని కలిగిస్తున్నావు. ఈ జలమంతా నీ స్వరూపమే. నీ వల్లనే మేము వేదాధ్యయనం చేయగల్గుతున్నాము. పుష్టి, ద్యుతి, సిద్ధి, బుద్ధి, కీర్తి, వాణి, స్వాహా అన్నీ నీవే."

ఇలా తనను స్తుతిస్తున్న వశిష్ఠుని ఆ నది విశ్వామిత్రుని ఆశ్రమం వైపు తీసుకొని పోయింది. వశిష్ఠుడు వచ్చినట్లు విశ్వామిత్రునికి తెలిపింది. క్రోధంతో అతను వశిష్ఠుని అంతం చేయగల ఆయుధం కోసం వెతికాడు. అతని క్రోధం చూసి నది వశిష్ఠుని మరల తూర్పు దిశగా తీసుకొని పోయింది. దానితో చాలా దుఃఖించి కోపంతో విశ్వామిత్రుడు ఇలా అన్నాడు. 'తల్లీ! నీవు నన్ను మోసం చేసి వెళ్లావు. కనుక నీవు నీటి బదులు రక్తాన్ని ప్రవహించు. ఇది రాక్షసులకు ఇష్టం". ఈ విధంగా తపస్వి అయిన విశ్వామిత్రునిచే శపించబడి ఆ నది సంవత్సరం పాటు రక్తం కలిసిన నీటితో ప్రవహించింది. అప్పుడు ఋషులు, దేవతలు, గంధర్వులు అలా ప్రవహిస్తున్న నదిని చూసి ఎంతో దుఃఖిం చారు. ఆ విధంగా ఆ నది వశిష్ఠపవాహంగా లోకంలో ప్రసిద్ధి చెందినది. మరలా ఆ నది తన మార్గంలోకి వచ్చింది. ఎలా వచ్చింది?

ఇంకావుంది...

సుందరకాండ

- కాశీభొట్ల సత్యనారాయణ

వాని చదువు, లలిత కళాలాభిలాష కూడా కేవల తన భౌతికాభివృద్ధికి మాత్రమే ఉపయోగించేటట్లుంటుంది. ఎవడినో సాధించాలనే ఈర్ష్యాద్వేషాలతో చదువుతాడు. వీడు రాక్షస పండితుడే తప్ప సాత్విక పండితుడు కాడు. వీని చదువువలన దేశానికి జాతికి ముప్పే తప్ప ఇంపుండదు.


అందుకని- ఈ చదువులు ఈ కళాభిరతి స్వామిని ఆకర్షించటంలేదు. ముందుకు నడుస్తున్నాడు.

ఆవేళ శుద్ధ త్రయోదశి.

చంద్రుడు గిరి వృక్షాలపైకి వచ్చేడు.

చంద్రికలు నేలనావరించుకొంటున్నాయి.

ఇది సుందరకాండలోని అయిదవ సర్గ. వాల్మీకి మహర్షి ఎనిమిది శ్లోకాలలో చంద్రికా వర్ణన చేస్తారు.



ఎనిమిది శ్లోకాలుగా వ్రాయటంలో ఐదవ సర్గగా విభజించటంలో అన్నిటిలో ప్రాముఖ్యముంది.

అయితే ఏమిటి వెన్నెల! ఆ తల్లి అనుగ్రహరూప కాంతి.

తనకైవెదకుతూ వచ్చిన వానికి దారి చూపించటం ఆమె అనుగ్రహం. "పంచ సంఖ్య పరాయణ" అయిన ఆ తల్లి 'భాగ్యాబ్ధి చంద్రిక' ఎవరిదీ భాగ్యం?

అన్వేషణ ఫలరూపమైన స్వామి భాగ్యం. విష్ణు సాన్నిధ్య ప్రాప్త రూపమైన రావణుని భాగ్యం. రెండింటికీ కారణం ఆమెయే. అందుకే ఐదవ సర్గలో చంద్రికలు విరుస్తున్నాయి. ఆ తల్లి 'అష్టమీ చంద్ర విభ్రాజదళికస్థలశోభిత' అనుదుటి కాంతి- ఈ ఎనిమిది శ్లోకాల వెన్నెల.

ఈ చంద్రికా వర్ణన కవులకు కల్పవృక్షచ్ఛాయ. కవులంటే-భావులకు తాత్త్వికులు, తాత్త్వికులయిన భావులయితే ఋషులు. వారి వాక్కు పరమతత్త్వాన్ని చెబుతుంది. ఆ ఆనందం ముందు శబ్దాలంకారాల ఆనందం గొప్పది కాదు. సుందరకాండలో ఎవరిస్థాయి ఆనందం వారికుంది.

తతస్సమధ్యం గత మంశుమంతం
జ్యోత్స్నా వితానం మహదుద్వమంతం
దదర్శ ధీమాన్ దివి భానుమంతం
గోష్ఠే వృషం మత్తమివ భ్రమంతమ్

వెన్నెలల్ని కక్కుతూ ఆకాశంలో సంచరిస్తున్న చంద్రుడు గోశాలలో వృషభంలా ఉన్నాడట.

ఆంజనేయస్వామి తొలిసారిగా నిద్రారావణ స్వరూపాన్ని చూసి కూడా ఇలాగే అనుకొంటాడు. హారకాంతులతో నిద్రావస్థలో ఉన్న స్త్రీల మధ్య నిద్రపోతూన్న రావణుడు స్వామికి ఇలాగే కనపడ్డాడు. ఈ ఉపమానానికి అన్వయం అంతవరకూ ఉంది. ఈ చుక్కల్లో చంద్రుడు కాముకుడైన రావణుని యందూ అన్వయిస్తాడు.

మరొకమాట-

గోష్ఠం అంటే వాఙ్మయాధారమైన నోరు. దానియందు తిరుగుతూన్న వృషం అందే వేదవాక్కు. అలా చంద్రుడు న్నాడు. గోశాలలో సంచరించిందే వేదవాక్కు అంటే లలితా రూపమే. అందుకే ఆ తల్లికి గోమాత, వేదజనని అని పేర్లు.

కనుకనే మహర్షి తరువాత శ్లోకాన్ని

లోకస్య పాపాని వినాశయంతం

మహోదధిం చాపి సమేధయంతం

భూతాని సర్వాణి విరాజయం

దదర్శ శీతాం సమధాభియాంతం- అని ప్రారంభిస్తారు.

పాపానికి చీకటనే అర్థం లేదు. దోషానికి చీకటితో బాటు పాపమనే అర్థం కూడా ఉంది. కాని మహర్షి స్పష్టంగా ఇక్కడొకమాట చెప్పదలచుకొన్నారు. ఏమిటది? అంటే-

చంద్రుడు లోకం యొక్క పాపాల్ని పోగొడుతున్నాడు. కాని లోకం యొక్క పాపాల్ని పోగొట్టే సామర్థ్యం ఈ భౌతిక చంద్రునకు లేదు. పరాశక్తి అనుగ్రహరూపమైన చంద్రికకు మాత్రమే వుంది. సర్వభూతముల అజ్ఞాన రూప అంధకారాన్ని పోగొట్టి ప్రకాశింపజేసేది ఆ తల్లి మాత్రమే. అందుకే ఆమెను- సర్వ భూత తమో పహారిణీ అని సేవిస్తాం.

ఇంకావుంది...

శ్రీ పరమహంస బోధామృతము



22.నీరును అందున్న బుడగయునొక్కటియే.బుడగ నీటియందే పుట్టి, నీటిప దేలుచు, తుదకు నీటియందే అడగుచున్నది. అటులనే జీవాత్మయు పరమాత్మయు నొక్కటియే. ఐనను అంశభేదము మాత్రము కలదు. ఒకటి రెండు ఖండము, రెండవది అఖండము;ఒకటి పరతంత్రము, రెండవది స్వతంత్రము.

23.జీవాత్మ భావము ఎట్టి?గంగా అపవాహమున ఒక భాగమునకు హద్దులేర్పరచి, ఆ నాగమును 'నా గంగ' యనుటవంటిది.

24.పాదరసముగల పాత్రలో పడవేసి సీసపు ముక్క దానితో ఏకమైపోవునటుల జీవుడు బ్రహ్మసాగరమునబడినంతనే ప్రత్యేకతను విడనాడును.

25.బ్రహ్మము అపరిచ్ఛిన్నము, జీవుడో, పరిచ్ఛిన్నుడు, ఇట్టి పరిచ్ఛిన్నుడు అపరిచ్ఛిన్న బ్రహ్మమును దెలియుటెట్లు? ఇయ్యది ఉప్పుబొమ్మ సముద్రపులోతును గనుగొన యత్నించుటవంటిది. అట్టి యత్నమున ఉప్పుబొమ్మ కరగి సముద్రమునలీనమైపోవును గదా! జీవుడును బ్రహ్మస్వరూపమును గ్రహింపయత్నించునపుడు తన ప్రత్యేకతను గోల్పోయి బ్రహ్మమునందైక్యమునొందును.

26.నారాయణుడే పనరరూపమున క్రీడించుచున్నాడు. అతడు మహేంద్ర జాలికుడు;జీవజగత్తునెడు నీయింద్రజాలము వాని మాయ, జాలకుడు మాత్రమే సత్యము, జాలము మిథ్యగదా!

27.ఈతనువు వంట కుండవంటిది; మనస్సు, బుద్ధి, ఇంద్రియములు అనునవి అందలి నీరు, బియ్యము, ఊరులగడ్డలు. వీనితో గూడిన కుండను నిప్పుపై బెట్టినపులడు అవి వేడెక్కును. అప్పుడెవ్వడైనను వానిని తాకినయెడల నిజముగా వేడిమి అందలి ఏ పదార్థమునకు జెందకున్నను చేయి కాలును గదా! మనస్సు, బుద్ధి (ఇతరమైన) ఇంద్రియములు వాని వాని కార్యములను అవి చేయుచుండుటకు బ్రహ్మయొక్క శక్తియే కారణము. ఆ శక్తి తొలగెనా, ఇవి అన్నియు పనిచేయమానును.

బద్ధజీవుడు

28.జీవుడు నిజముగా సచ్చిదానంద స్వరూపుడు. అహంకారముచేతఅనేక ఉపాధులచే బద్ధుడై జీవుడు నిజస్వభావమును మరచియున్నాడు.

29.ఉపాధివలన నరుని స్వభావము మారుచుండును. ఎవ్వడైనను నిగనిగలాడు నల్లంచుధోవతిని సొగసుమీరు దుస్తులను ధరించెనేని నిధుబాబువిరచిత శృంగార గీతములు వాని పెదవులపై నాట్యము చేయునారంభించును. ఇంగ్లీషు బూట్లు తొడగెనా, బక్కవానికై ననుడంబము తలకెక్కును. తత్క్షణమే ఆతడు ఈలలు వేయసాగును; మెట్టునకు కుప్పించుచుబోవును. ఇక చేతిలో కలమున్నవాడు కనబడిన కాగితముపై నెల్లగిలుకుచుండును!

30.కుబుసమును పామును వేరైనట్లు ఆత్మ శరీరముకంటే భిన్నము.

31.ఆత్మ అసంగము. పుణ్య పాపములు, కష్టసుఖములు మొదలగునవి ఎన్నటికిని ఆత్మనంటజాలవు; కాని దేహాత్మబుద్ధిగలవానిని, లేక దేసమే తాననుకొనువానిని మాత్రము ఇవి బాధించుననుటకు సందియము లేదు. పొగ గోడలనే మలినము చేయగలదు గాని వాని నడుమనున్న ఆకాశమును మలినము చేయజాలదు గదా?

32.ఆత్మ అసంగమని వేదాంతులు చెప్పుదురు. ఉణ్యపాపములు గాని సుఖ దుఃఖములుగాని ఆత్మనంటజాలవు; కాని దేహాభిమానుల నవి బాధించును. పొగ గోడలను మలినము చేయగలదు గాని ఆకావము నేమి జేయజాలదు కదా!

33.సత్త్వరజస్తమోగుణముల న్యూనతాధిక్యములను బట్టి మానవులు వేర్వేరు స్వభావములు గలవారై యుందురు.

34.వస్తుతః జీవులందరును ఒక్కటియేయ య్యును. వారి వారి స్థితిగుతలను బట్టి నాలుగు విధములుగా నుందురు. 1.బద్ధజీవులు అనగా సంసారబద్ధులు 2.ముముక్షువులు మోక్షమునకై ప్రయత్నించువారు 3.ముక్తులు 4.నిత్యముక్తులు.

35.పల్లెవాడు నీటిలో వల వేయగా వలలో చాలా చేపలు పడినవి. అందు కొన్ని బయటపడుట ప్రయత్నము చేయక స్తబ్ధముగా పడియున్నవి. కొన్ని చేపలు గంతులు వేసి తప్పించుకొనలేకపోయినవి. కాని కొన్ని ఎట్లో తప్పించుకొని బయటపడినవి. ఇదేవిధముగా లోకమందును జనులు ముప్విధములుగా నున్నారు.

ఇంకావుంది...

శ్రీరామకృష్ణ బోధామృతము - పరిశోధితమగు 1121 మహోపదేశములు గల శ్రీరామకృష్ణ వాక్య రత్నాకరము
-సంగ్రహ జీవిత సహితము - అనువాదకుడు: శ్రీ చిరంతనానందస్వామి

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ
తెలుగు అనువాదం: డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

183

అయితే 'యుక్తాహ్యస్య హరయః శతాదశ' ఆత్మను తరిమివేసేవి, పెడదారిని పట్టించే శక్తులు వేలకొలది ఉంటాయని మాత్రం చెప్పగలం. కాబట్టి సావధానులు కండి.

నాకెంత లాభించినా నిన్ను వదలను

మహే చన త్వామద్రివః పరా శుల్కాయ దేయామ్
న సహస్రాయ నాయుతాయ వజ్రివో న శతాయ శతామఘ

భావం:ఓ ఆదిదేవా! ఎంత గొప్ప లాభం లౌకికంగా చేకూరినా నిన్ను మాత్రం నేను విడువను. శతామఘ! వంద, వేయి, పదివేలు ఇలా ఎంత లాభించినా వానికోసం ఆశపడి నిన్ను మాత్రం నేను విడువను.

వివరణ:లోకంలో మానవులకు ఒక విచిత్ర స్థితి ఎదురవుతూంది. మనస్సు ఆకర్షించే భోగ సామగ్రితో నిండిన ప్రపంచమొకప్రక్క, మరొకప్రక్క పరోక్షంగా వున్న భగవంతుడు ఈ రెండింటిలో ముఖ్యంగా ఎవరివైపు మొగ్గు చూపాలి? భగవంతుడు కంటికి కనబడడు. ఇక సుఖదాయకమైన భోగసామగ్రితో నిండిన ప్రపంచం ఎదురుగా ఉండి ఆకర్షిస్తూ ఉంటుంది. ప్రత్యక్షంగా కనబడేదాన్ని కనబడక పరోక్షంగా ఉన్నదాని కోసం త్యాగం చేసేందుకు ఎవరు సాహసించగలరు? సాహసించేందుకు ఆ దైవం పరోక్షంగా గాక ప్రత్యక్షంగా ముందు నిలుస్తుందా? ఇట్టి సందర్భాన్ని పురస్కరించుకొని యమధర్మరాజు నచికేతుడితో ఇలా అన్నాడు.

'శతాయుషః పుత్రపౌత్రాన్ వృణీష్వ
బహూన్ పశూన్ హస్తిహిరణ్యమశ్వాన్
భూమేర్మహదయతనం వృణీష్వ
స్వయం చ జీవ శరదో యావదిచ్ఛసి
ఇమా రామాః సరథాః సతూర్యా న
హీదృశా లంభనీయా మనుష్యైః
ఆభిర్మత్ప్రత్తాభిః పరిచారయస్వ నచి
కేతో!మరణం మా స్రుప్రాక్షీః

ఓ నచికేతా! నూరేండ్లు జీవించే కొడుకులను, మనుమలను కోరుకో. పశువులను, ఏనుగులనూ, గుఱ్ఱాలనూ, బంగారాన్నీ, భూమినీ, ఎన్నైనా కోరుకో. భూమిమీద సువిశాలమైన సామ్రాజ్యాన్ని కోరుకో. చిరంజీవిత్వాన్ని కూడా కోరుకో. మనుష్యలోకంలో ఏ ఏ కోరికలు దుర్లభమైనవో వాటిని స్వేచ్ఛగా అడుగు. సంగీత వాద్యాలతో, విహార రథాలతో ఉన్న అపురూప సుందరులైన కన్యలను కోరుకో. ఈ అన్నింటిని నీకు ప్రసాదిస్తాను. వారిచేత హాయిగా సేవలను పొందు. కాని మరణానంతర జీవితాన్ని మాత్రం అడగవద్దు.

యముడు మనోవైజ్ఞానిక పండితుడు. పరోక్ష విజ్ఞానాభిలాష నుండి నచికేతుణ్ణి మరలించి ప్రత్యక్ష భోగలాలసవైపునకు అతని మనస్సు త్రిప్పేందుకు తీవ్రంగా ప్రలోభపరచాడు. బిడ్డలు, మనుమలు, ఏనుగులు, గుఱ్ఱాలు, ధన, ధాన్యాలు, నాట్య, గాన వినోదాలు అన్నీ ప్రత్యక్ష భోగ విషయాలు. వీనిలో ఏ ఒక్కటి పరోక్షాంశం లేదు. ఈ అన్నింటిని అడుగు అని యముడు నచికేతుడికి ఆశ చూపుతూ ఒక్క మరణానంతర జీవితాన్ని గురించి అడుగవద్దు అని నచికేతుడి దృష్టిని ప్రత్యక్ష భోగాలవైపు త్రిప్పేందుకు ప్రయత్నించాడు. కాని నిజమైన ఆధ్యాత్మిక తత్త్వవేత్తకు భగవంతుడు 'శతమఘుడు =అనంతైశ్వర్య సంపన్నుడు' అని బాగా తెలుసు. కాబట్టి అతడు ఆ శతమఘుని 'త్వం విశ్వా దధిషే కేవలాని యాన్యావిర్యా చ గుహా వసూని'- "ఓ విశ్వాత్మా!నీవు ప్రత్యక్షమూ మరియు పరోక్షమూ (రహస్యం) అయిన సమస్త ఐశ్వర్యాన్ని వహించియున్నావు" అని శ్లాఘిస్తాడు.

కాని మానవులందరు భగవంతుడట్టి సర్వైశ్వర్య సంపన్నుడని తెలిసి కూడా ఆయనను ఒక్క ప్రత్యక్ష ఐశ్వర్యాన్నే ఎందుకు అర్థిస్తారో అర్థం కాదు. ఈ నిర్వేదనతోనే దైవాన్ని సంపూర్ణంగా నమ్మినవాడు 'మహే చన త్వామద్రివః పరా శుల్కాయ దేయామ్'- "ఎంతటి మహోన్నత ధన లాభం సిద్ధించినా ఓ మహాదేవా! నేను నిన్ను మాత్రం విడువను"-అంటే నశ్వరమైన ధనలాభాన్ని ఆశించి 'మాహం బ్రహ్మ నిరాకుర్యామ్'-"పరబ్రహ్మ లబ్ధిని తిరస్కరించను" అని తన దృఢ నిశ్చయాన్ని ఆవిష్కరిస్తాడు. బ్రహ్మమును నిరాకరించినవాడు తనను తాను నిరాకరించుకొన్నవాడే అవుతాడు. సమస్త నశ్వర ఐశ్వర్య సంపన్నమైన ప్రపంచ ప్రలోభమొక వైపు, సమస్త శాశ్వత ఐశ్వర్య ప్రదాయతైన సర్వేశ్వరుడొకవైపు. నశ్వరాన్ని కోరుకొని అనశ్వర భగవల్లబ్ధిని ఎవడు కోరుకొంటాడు ఒక్క మూర్ఖుడు తప్ప.

పురూవసుర్హి మఘవన్త్సనాదసి

"అష్టైశ్వర్య సంపన్నుడైన భగవానుడొక్కడే అనాదిగా ఉన్నాడు"-కాబట్టి భగవంతునే ఆశ్రయిస్తే ఆయన సనాతన శాశ్వత ధనమంతా స్వంతమవుతుంది. కాని ఐహిక సంపద లభించినవాడికి మాత్రం ఆ భగవదైశ్వర్యం లభ్యం కానే కాదు. కాబట్టి ధనాన్ని స్వంతం చేసుకోవడం కంటే ధనం గలవాడిని స్వంతం చేసుకోవడం ఉత్తమం.

ఇంకా ఉంది



మహర్షి చిత్రంలో మహేష్‌బాబు సెకెండ్ లుక్

గడచిన ఏడాది జయాపజయాలకు తెరదించేసి హీరోలంతా కొత్త ప్రాజెక్టులపై అప్పడే పరుగులు మొదలెట్టారు. హీరోయిజాన్ని నిలబెట్టుకుంటూనే ఈ ఏడాదీ వైవిధ్యమైన కథలతో ఆడియన్స్ ముందుకొచ్చే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

మళ్లీ.. మొదలెట్టేశారు

చిట్టిబాబుగా రంగస్థలంపై చెలరేగి విమర్శకుల ప్రశంసలందుకున్న హీరో రామ్‌చరణ్ కొత్త ఏడాదిలో వినయ విధేయతలు ప్రదర్శించబోతున్నాడు. సినిమాను డైరెక్ట్ చేస్తున్న బోయపాటి టీం ఇప్పటికే విడుదల చేసిన ట్రైలర్స్, ఆడియో కేకపెట్టించడంతో సినిమా క్రేజ్ పెరిగింది. అయితే సాఫ్ట్ టైటిల్.. సాలిడ్ స్టిల్ అన్నట్టు చెర్రీ లుక్ మాత్రం వైవిధ్యంగా ఉంది. టాలీవుడ్‌లో 'ప్రిడేటర్' సినిమా చూపిస్తున్న స్టయిల్‌లో ఆర్నాల్డ్ స్వార్జ్‌నెగ్గర్ మాదిరి గన్‌పట్టుకున్న చెర్రీ లుక్ -సినిమా రేంజ్‌ను అంచనా వేసుకోమన్నట్టు కనిపిస్తోంది. స్టార్ హీరోల రేస్‌లో ఈసారి ముందున్న చరణ్, ఈ సంక్రాంతికే థియేటర్లకు వచ్చేస్తున్నాడు. దీని తరువాత చెర్రీ, ఎన్టీఆర్‌లు రాజమౌళి మల్టీ స్టారర్ ప్రాజెక్టుతో బిజీ అవుతారు. కొరటాల శివ, త్రివిక్రమ్, వంశీ పైడిపల్లిలాంటి క్రేజీ డైరెక్టర్లనూ చెర్రీ క్యూలో పెట్టాడు.

భరత్ అను నేను.. అంటూ ప్రమాణం చేసి బాక్సాఫీస్‌ను మోతెక్కించిన హీరో మహేష్ బాబు. కొరటాల శివ డైరెక్షన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్‌తో స్టయిలిష్ యంగ్ సీఎంగా మెప్పించి ఊపుమీదున్నాడు. కొత్త ఏడాది రేసులో 'మహర్షి' టైటిల్‌తో 'సెటిల్డ్ ఇమేజ్'ను రుచి చూపించడానికి సిద్ధమవుతున్నాడు. వంశీ పైడిపల్లి డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఏప్రిల్ 5న ఈ చిత్రం థియేటర్లకు వస్తుంది. వెంటనే సుకుమార్‌తో సినిమాకు కమిటయ్యాడు. అలాగే త్రివిక్రమ్, అర్జున్‌రెడ్డి ఫేమ్ సందీప్ వంగతో సినిమాలూ క్యూలో ఉన్నాయి.



యన్‌టిఆర్ బయోపిక్ మొదటి భాగం కథానాయకుడు చిత్రంలో అల్లూరిగా బాలయ్య

భిన్నకోణంలో లవ్ ఫ్యాక్షనిజాన్ని అనుభవంలోకి తెచ్చి అదరగొట్టాడు యంగ్ టైగర్ ఎన్టీఆర్. అరవింద సమేత వీర రాఘవుడిగా బ్లాక్‌బస్టర్‌ని బ్యాక్ ప్యాకెట్‌లో పెట్టుకున్న ఎన్టీఆర్ -కొత్త ప్రాజెక్టులపై ఆచితూచి అడుగేస్తున్నాడు. బాహుబలితో ఇమేజ్ స్టేటస్‌నే మార్చేసుకున్న రాజమౌళి డైరెక్షన్‌లో రామ్‌చరణ్‌తో దోస్తీకట్టి మల్టీస్టారర్‌ను మెరిపించనున్నాడు. ప్రస్తుతానికి 'ట్రిపుల్ ఆర్' అంటూ భారీగా వచ్చిన ప్రాజెక్టు ఇమేజ్ కోసం కష్టపడుతూనే, తరువాతి ప్రాజెక్టును తమిళ డైరెక్టర్ అట్లీకుమార్ భుజాలపై పెట్టినట్టు తెలుస్తోంది. క్యూలో కొరటాల శివకూ చోటివ్వడం చూస్తుంటే -జూ.ఎన్టీఆర్ ఎంత ప్రణాళికగా అడుగులేస్తున్నాడో అర్థమవుతుంది.



వినయ విధేయ రామ చిత్రంలో రామ్‌చరణ్ లుక్

బాహుబలి తరువాత యూనివర్శల్ స్టేటస్ సంపాదించుకున్న ప్రభాస్, కొత్త ఏడాదిలోనూ అదే రేంజ్ చూపించే సినిమా చేస్తున్నాడు. అదే -సాహో. వచ్చే ఆగస్టు, సెప్టెంబర్‌లలో ఈ చిత్రాన్ని థియేటర్లకు తెచ్చే ప్రయత్నంలో దర్శకుడు సుజిత్ టీం బిజీగా ఉంది. సాహో మరో సెన్సేషనల్ సృష్టించగలదన్న నమ్మకంతో ప్రభాస్ కనిపిస్తున్నాడు.

ఇక ప్రధానంగా చెప్పుకోవాల్సింది అల్లు అర్జున్ గురించి. తోటి హీరోలంతా ఒక్కో బ్లాక్‌బస్టర్‌తో హ్యాపీమూడ్స్‌లోవుంటే, 'సోల్జర్' కథ అడ్డంతిరగడంతో -కసితో రగిలిపోతున్నాడు. స్టార్ రైటర్ వక్కంతం వంశీ డైరెక్టర్ అవతారమెత్తి తెరకెక్కించిన నా పేరు సూర్య నిరాశపర్చడం తెలిసిందే. నాలుగడుగులు వెనక్కేసిన బన్నీ, తరువాతి ప్రాజెక్టుకు త్రివిక్రమ్‌తో కమిటై కొత్త ఏడాదిలో సత్తాచాటే ప్రయత్నాల్లో ఉన్నాడు.

ఇక వెటరన్ హీరోల్లో మెగా రీఎంట్రీ ఇచ్చిన చిరంజీవి ఖైదీ నంబర్ 150తో అందుకున్న హిట్టు ఉత్సాహంతో సైరాలో బిజీగా ఉన్నాడు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథను వచ్చే మేలో రుచి చూపించేందుకు సిద్ధమవుతున్నాడు. తరువాత ప్రాజెక్టునూ లైన్‌లో పెడుతూ కొరటాల శివ, త్రివిక్రమ్‌లో ఒకరికి చాన్స్ ఇచ్చే ఆలోచనతో ఉన్నట్టు కనిపిస్తోంది. ఇక నందమూరి బాలకృష్ణను గడచిన ఏడాది 'జైసింహా' పేరిట అసంతృప్తికి గురిచేస్తే, కొత్త ఏడాదిలో సంచలనం సృష్టించే ప్రయత్నాల్లో బిజీగా ఉన్నాడు. తండ్రి జీవిత కథను భుజానికెత్తుకుని -కథానాయకుడు, మహానాయకుడిగా 'యన్‌టీఆర్'ను మరోసారి స్క్రీన్‌పై చూపించనున్నాడు. సంక్రాంతిని టార్గెట్ చేస్తూ వస్తున్న రెండు భాగాల అనంతరం, బాలయ్య వినాయక్‌తో సినిమా చేసే అవకాశం కనిపిస్తోంది.

మరో హీరో నాగార్జునకు గడచిన కాలం కలిసిరాలేదు. వర్మతో చేసిన ఆఫీసర్, మల్టీస్టారర్‌గా నానితో చేసిన దేవదాసు ఆశించిన సంతృప్తినివ్వలేదు. దీంతో ఈ ఏడాది నాగార్జున నుంచి కొత్త ప్రాజెక్టు ప్రకటన రాలేదు. సీనియర్ హీరో వెంకటేష్ అయితే గడచిన ఏడాదిలో సినిమాయే చేయలేదు. తొందరపడకుండా నిదానంగా సెలెక్టెడ్ ప్రాజెక్టులు చేయడానికి ఇష్టపడుతున్న వెంకీ -కొత్త ఏడాదిలో మాత్రం సంక్రాంతి సినిమా రుచి చూపించనున్నాడు. హీరో వరుణ్‌తో 'సంక్రాంతి అల్లుళ్ల' సినిమా చూపించేందుకు ఎఫ్2గా వస్తుండటం తెలిసిందే. ఇదికాక, త్రివిక్రమ్ సహా మరో దర్శకుడితో రెండు సినిమాలు క్యూలో పెట్టుకున్నాడు.


ఇక కుర్ర బ్యాచ్‌లో సెన్సేషనల్ హీరో ఇమేజ్ తెచ్చుకున్న విజయ్ దేవరకొండ 'డియర్ కామ్రేడ్' అంటుంటే, తొలిప్రేమను ఆస్వాదించి, రోదసి ప్రయోగాన్ని సక్సెస్ చేసిన వరుణ్‌తేజ్ కొత్త ఏడాదిలో 'ఎఫ్-2'తో అల్లరి చేయనున్నాడు. కలిసొచ్చిన కాలంలో కొత్త ఉత్సాహంతో నాని, నాగచైతన్య, సుధీర్ బాబు, నాగశౌర్యలాంటి హీరోలూ కొత్త ప్రాజెక్టులకు పదును పెట్టుకుంటున్నారు.

-శ్రీనివాస్ ఆర్ రావ్



త్రివిక్రమ్‌తోనే అర్జున్

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కాంబినేషన్ కన్ఫర్మ్ అయ్యింది. తాజా ప్రాజెక్టు అల్లు అర్జున్‌కు 19వ చిత్రమైతే, వీరిద్దరి కాంబినేషన్‌లో మూడో సినిమా. జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి చిత్రాల విజయాల నేపథ్యంలో ముచ్చటగా మూడోసారి తెరకెక్కనున్న చిత్రంపై ఇటు సినీ వాణిజ్య రంగాల్లో, అటు ప్రేక్షక వర్గాల్లో అంచనాలు పెరుగుతున్నాయి. తాజా ప్రాజెక్టును హారిక అండ్ హాసిని క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ అధినేతలు ఎస్.రాధాకృష్ణ (చినబాబు), అల్లు అరవింద్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్నారు. ఇప్పటికే చిత్రం పూర్వ నిర్మాణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. చిత్రానికి సంబంధించిన ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. ఈనెలలోనే ప్రాజెక్టును సెట్స్‌మీదకు తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాజా ప్రాజెక్టుకు నిర్ణయం తీసుకుంటూ, 2019 ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు చిత్ర నిర్మాతలు అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ (చినబాబు).



అందమైన ప్రేమ మజిలీ

అక్కినేని నాగచైతన్య, సమంత జంటగా నటిస్తున్న చిత్రానికి మజిలీ టైటిల్ కన్ఫర్మ్ చేశారు. దేర్ ఈజ్ లవ్... దేర్ ఈజ్ పేయిన్ క్యాప్షన్ పెట్టారు. చిత్రం ఫస్ట్ లుక్‌లో నాగచైతన్య, సమంత ఎమోషనల్ లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. నిన్ను కోరి లాంటి ఎమోషనల్ హిట్ సినిమా తెరకెక్కించిన శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. వైజాగ్ నేపథ్యంలో రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. దివ్యాంశ కౌశిక్ చిత్రంలో రెండో హీరోయిన్. రావురమేష్, పోసాని కృష్ణ మురళి, సుబ్బరాజు చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నారు. గోపీసుందర్ సంగీతం అందిస్తుంటే, విష్ణు వర్మ సినిమాటోగ్రఫీ సమకూరుస్తున్నాడు. సాహు గరపాటి, హరీష్ రెడ్డి షైన్ స్క్రీన్ బ్యానర్‌పై చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



ఈసారి బ్రోచేవారెవరురా...

యంగ్ హీరో శ్రీ విష్ణు, దర్శకుడు వివేక్ ఆత్రేయ రెండోసారి జతకట్టబోతున్నారు. మెంటల్ మదిలో లాంటి సూపర్ హిట్ సినిమా తర్వాత ఈసారి క్రైమ్ కామెడీతో రాబోతున్నారు. ఈ చిత్రానికి బ్రోచేవారెవరురా టైటిల్ కన్‌ఫర్మ్ చేశారు. నివేదాథామస్, నివేదా పేతురాజ్ హీరోయిన్లు. సత్యదేవ్, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రం షూటింగ్ జరుగుతుంది. వివేక్‌సాగర్ సంగీతం అందిస్తుంటే, సాయిశ్రీరామ్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. మన్యం ప్రొడక్షన్స్ బ్యానర్‌పై విజయకుమార్ మన్యం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

అన్ లిమిటెడ్ ఫన్

విక్టరీ వెంకటేశ్, మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్లుగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మాణంలో రూపొందుతున్న చిత్రం 'ఎఫ్2'. ఫన్ అండ్ ఫ్రస్టేషన్ ట్యాగ్‌లైన్. అనిల్ రావిపూడి దర్శకుడు. సంక్రాంతి సినిమాగా జనవరి 12న విడుదలవుతోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన పాటలను వైజాగ్‌లో విడుదల చేశారు. ఆడియో సీడీలను ఆంధ్రప్రదేశ్ మంత్రి గంటా శ్రీనివాసరావు విడుదల చేశారు. దిల్ రాజు మాట్లాడుతూ 2019 సంక్రాంతికి మూడు సినిమాలు బాలయ్య యన్‌టిఆర్ బయోపిక్, రామ్‌చరణ్ వినయ విధేయ రామ, ఎఫ్2 వస్తున్నాయని, అన్ని చిత్రాలూ హిట్ కావాలని ఆకాంక్షించారు. ఎఫ్2 ద్వారా ఫ్యామిలీ ఆడియెన్స్‌కు వరుణ్ మరింత దగ్గరవుతాడన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి కథ చెబుతున్నపుడు నవ్వుతూనే ఉన్నాను. ప్రతి భార్యా భర్త మధ్య ఫన్ వుంటుంది, ఫ్రస్టేషన్ ఉంటుంది. హీరోలకు తగ్గట్లు హీరోయిన్లు, ఇతర టెక్నీషియన్లు బాగా కుదిరారు. పక్కా ఫ్యామిలీ సినిమా. అందుకే సంక్రాంతి అల్లుళ్లు వస్తున్నారు అని మరో ట్యాగ్‌లైన్‌ను కూడా అనిల్ యాడ్ చేశాడన్నారు. ఏపీ మంత్రి గంటా మాట్లాడుతూ వైజాగ్ సినిమాలకు సెంటిమెంట్‌గా మారిందని, షూటింగ్‌లకు అనువుగా ఉండేలా వసతులు ఉన్నాయన్నారు. సినీ పరిశ్రమ వైజాగ్‌కు తరలిరావాల్సిన సరైన సమయం ఇదేనన్నారు. వరుణ్ తేజ్ మాట్లాడుతూ దర్శకుడు అనిల్ ధైర్యం చేసి నాకు మంచి పాత్ర ఇచ్చాడు. అందరికీ నచ్చుతుందనుకుంటున్నాను. వెంకటేశ్‌తో పనిచేయడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ ఎఫ్2లో అనిల్ వండర్‌ఫుల్ స్క్రిప్ట్ చేశాడన్నారు. నా గత చిత్రాలన్నీ చూసి వాటికంటే రెచ్చిపోయేలా సినిమాలో నటింపజేశాడు అన్నారు.





కొత్త ఏడాదితో క్రికెట్ ఆడుకోడానికి నేచురల్ స్టార్ నాని రెడీ అయిపోయాడు. యు-టర్న్ ఫేం శ్రద్ధా శ్రీనాథ్‌తో జోడీకట్టి ఇప్పటికే షూటింగ్ మొదలుపెట్టిన జెర్సీ ఫస్ట్‌లుక్‌ను కొత్త ఏడాది శుభసమయంలో యూనిట్ విడుదల చేసింది. సత్యరాజ్, బ్రహ్మాజీ, రోనిల్ కామ్రా ప్రధాన తారాగణంగా రూపుదిద్దుకుంటున్న క్రికెట్ క్రీడా నేపథ్య చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సూర్యదేవర నాగవంశి నిర్మిస్తుండటం తెలిసిందే. దర్శకుడు గౌతం తిన్ననూరి చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు.



అజయ్ పాసయ్యాడు

రచయిత బికె ఈశ్వర్ అందించిన కథతో తెరకెక్కిన చిత్రం -అజయ్ పాసయ్యాడు. భారతం క్రియేషన్స్ పతాకంపై ప్రేమ్ భగీరథ్ దర్శకత్వంలో మాగాపు సూర్య కమల, వై రాజేంద్ర సంయుక్తంగా నిర్మించారు. పోస్టు ప్రొడక్షన్స్ పూర్తి చేసుకున్న వినోదాత్మక చిత్రం జనవరి 4న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అజయ్ అమన్, సాయికిరణ్ హీరోలుగా అంబిక హీరోయిన్‌గా నటించిన చిత్రంలో యాంకర్ ఝాన్సీ, శివన్నారాయణ ముఖ్య పాత్రలు పోషించారు. చిత్రం విడుదల సందర్భంగా నిర్మాతలు మాగాపు సూర్య కమల, వై రాజేంద్ర మీడియాతో మాట్లాడుతూ అజయ్ పాసయ్యాడు చిత్రాన్ని దర్శకుడు ప్రేమ్ భగీరథ్ అద్భుతంగా తెరకెక్కించాడన్నారు. నవ్వించి, కవ్వించి, ఆలోచనలు రేకెత్తించే చిత్రం ఆద్యంతం అలరిస్తుందన్నారు. అటు ఆరిస్టులు, ఇటు టెక్నికల్ టీం కష్టపడి పనిచేసి అద్భుత ప్రాజెక్టుకు ప్రాణం పోశారని, జనవరి 4న వస్తున్న 'అజయ్.. ' డిస్టింక్షన్‌లో పాసవుతాడన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే

ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణాలను హీరో హీరోయిన్లుగా పరిచయం చేస్తూ ఓం శ్రీ చక్ర క్రియేషన్స్ బ్యానర్ నిర్మిస్తోన్న చిత్రం -4 లెటర్స్. 'కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే' అన్నది ఉప శీర్షిక. ఆర్.రఘురాజ్ దర్శకుడు, దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మాతలు. సినిమా పోస్ట్ ప్రొడక్షన్స్‌లో ఉన్న సందర్భంగా నిర్మాతలు హేమలత, ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ చిత్రం ద్వారా ఈశ్వర్‌ను హీరోగా పరిచయం చేస్తున్నామని, సత్యానంద్ వద్ద శిక్షణ తీసుకున్న ఈశ్వర్, ప్రాజెక్టు కోసం హార్డ్‌వర్క్ చేశాడన్నారు. అలాగే 'కలుసుకోవాలని' వంటి బ్యూటిఫుల్, క్యూట్ లవ్ స్టోరీని తెరకెక్కించి అందరి మన్ననలు అందుకున్న దర్శకుడు రఘురాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించాడని, కమర్షియల్ హంగులతో యూత్ సహా అన్నీ వర్గాలను ఆకట్టుకునే ఎంటర్‌టైనర్‌గా సినిమా సిద్ధమైందన్నారు. త్వరలోనే పాటలు, సినిమా విడుదల తేదీ ప్రకటిస్తామన్నారు. దర్శకుడు ఆర్.రఘురాజ్ మాట్లాడుతూ కలుసుకోవాలని తర్వాత కన్నడ, తమిళ సినిమాలతో బిజీ అయ్యానని, గ్యాప్ తర్వాత తెలుగులో డైరెక్ట్ చేసిన చిత్రం 4 లెటర్స్ అన్నారు. నేటితరం ప్రేమ కథా చిత్రం కనుక 'కుర్రాళ్లకి అర్థమవుతుందిలే' అని ఉప శీర్షిక పెట్టామన్నారు. చిత్ర కథ, కథనాలు, సంభాషణలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా, ఆలోచన రేకెత్తించేలా ఉంటాయన్నారు. నిర్మాతలు మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సపోర్ట్ చేయడంతో సినిమాను అనుకున్న ప్రణాళిక ప్రకారం పూర్తిచేశామన్నారు.

